మంగళవారం
27-09-2022
విజయవాడ ప్రచురణ
సంపుటి : 71, సంచిక : 97
పేజీలు : 10, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
అక్షరాక్షరం అభ్యుదయం
VISALAANDHRA Regd No.VJ/042/2021-23

ఆంధ్ర మహాసభను రాజకీయ బాట పట్టించిన రావి నారాయణ రెడ్డి
రాజాజీని నల్లకళ్ల జోళ్లు తీయమన్న పిల్లలమర్రి
మరపురాని మహోజ్వల ఘట్టం చిట్టగాంగ్ తిరుగుబాటు
7లో

మరింత చిక్కిన రూపాయి

సరికొత్త జీవనకాల కనిష్ఠానికి

న్యూఢిల్లీ: వారం ప్రారంభమైనా... రూపాయి మారకం విలువ మాత్రం కోలుకోవడం లేదు. సరికొత్తగా జీవనకాల కనిష్ఠానికి చేరుకుంది. పతనం కొనసాగుతోంది. అమెరికా వడ్డీ రేట్ల పెంపు, ఈక్విటీ మార్కెట్లలోని బలహీనత రూపాయిపై మరింత ఒత్తిడి పెంచాయి. సోమవారం రూ.81.55 వద్ద ప్రారంభమైన రూపాయి క్రితం సెషన్ ముగింపైన రూ.80.99తో పోలిస్తే 0.64 శాతం పతన మైంది. గత తొమ్మిది సెషన్‌లలో మొత్తం ఎనిమిది సెషన్‌లలో రూపాయి నేలచూపులు చూసింది. 2.28 శాతం నష్టపోయింది. ఉదయం రూ.10:38 గంటల సమయంలో డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ రూ.81.56 వద్ద సరికొత్త జీవనకాల కనిష్ఠాన్ని నమోదు చేసింది. అమెరికా ఫెడరల్ రిజర్వ్ గతవారం కీలక వడ్డీరేట్లను 75 బేసిస్ పాయింట్లు పెంచిన విషయం తెలిసిందే. పైగా రానున్న రోజుల్లో రేట్ల పెంపు మరింత వేగంగా ఉంటుందని ఫెడ్ చైర్మన్ జెరోమ్ పావెల్ ప్రకటించారు. అలాగే ద్రవ్యోల్బణం తప్పదేమో నని హెచ్చరించారు. దీంతో ఇతర దేశాల కరెన్సీలతో పోలిస్తే డాలర్ రోజురోజుకూ బలపడుతోంది. ఫలితంగా రూపాయికి డిమాండ్ తగ్గి మారకపు విలువ పడిపోతోంది. ఇతర ప్రధాన కరెన్సీలతో పోలిస్తే డాలర్ బలాన్ని తెలియజేసే 'డాలర్ సూచీ' క్రితం ముగింపుతో పోలిస్తే 0.68 శాతం ఎగబాకి 113.97కు పెరిగింది. ప్రస్తుతం మదుపర్లు

- మిగతా 2 లో

జగన్ సర్కార్‌కు సుప్రీం అక్షింతలు

ఒక్క కేసుకి ఇంతమంది న్యాయవాదులా?

- అప్పీళ్లపై ఉన్న శ్రద్ధ పర్యావరణంపై లేదా?
- అవసరమైతే లాయర్లకు ప్రభుత్వ ఖర్చుపై నోటీసులిస్తాం
- కీలక వ్యాఖ్యలు చేసిన అత్యున్నత న్యాయస్థానం

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: పోలవరం ప్రాజెక్టుపై సుప్రీంకోర్టులో జగన్ ప్రభుత్వానికి షాక్ తగిలింది. ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా జరిగిన పర్యావరణ నష్టానికి ఏపీ ప్రభుత్వం ఎందుకు బాధ్యత వహించదని సుప్రీంకోర్టు సూటిగా ప్రశ్నించింది. న్యాయవాదులకు ఫీజు చెల్లింపులో ఉన్న శ్రద్ధ ప్రభుత్వానికి పర్యావరణ రక్షణపై కనిపించడం లేదని ఘాటుగా వ్యాఖ్యానించింది. పోలవరం ప్రాజెక్ట్ కేసులో ఇప్పటి వరకూ ఎంత డబ్బు న్యాయవాదులకు ఖర్చు పెట్టారనే దానిపై నోటీసు ఇస్తామని సుప్రీం పేర్కొంది. ఒక్క కేసుకు ఎంత మంది సీనియర్ న్యాయవాదులను నియమిస్తారని సుప్రీం ప్రశ్నించింది. ప్రభుత్వాలకు న్యాయవాదులను రంగంలో దించడంపై ఉన్న ఆసక్తి పర్యావరణ పరిరక్షణ పైన లేదని వ్యాఖ్యానించింది. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో పర్యావరణ ఉల్లంఘనలకు రూ.120 కోట్లు పర్యావరణ రుసుము చెల్లించాలన్న జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) తీర్పును ఏపీ ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. మొత్తం మూడు అంశాలకు సంబంధించి ఏపీ ప్రభుత్వం మూడు వేర్వేరు అప్పీళ్లను సుప్రీంలో దాఖలు చేసింది. ఏపీ అప్పీళ్లపై సోమవారం జస్టిస్ అజయ్ రస్తోగి, జస్టిస్ రవికుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పోలవరం, పురుషోత్తపట్నం, పులిచింతల ప్రాజెక్టులపై ఎన్జీటీ ఇచ్చిన తీర్పుపై దాఖలు చేసిన అప్పీళ్లను కలిపి వింటామని సుప్రీంకోర్టు ధర్మాసనం వెల్లడించింది. ఇప్పటికీ ఇంకా ఉల్లంఘనలు జరుగుతున్నాయని పిటిషనర్ డాక్టర్ పెంటపాటి పుల్లారావు తరపు న్యాయవాది శ్రవణ్ కుమార్ కోర్టుకు వివరించారు. ప్రాజెక్టు వల్ల యాభై వేల మంది ముంపునకు గురయ్యారని తెలియజేశారు. ఏపీ ప్రభుత్వం దాఖలు చేసిన మూడు అప్పీళ్లపై విచారణకు సుప్రీంకోర్టు కేసు విచారణను వాయిదా వేసింది.

శివశంకర్ రెడ్డికి బెయిల్ ఇవ్వలేం

ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి బాబాయి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసులో నిందితుడిగా ఉన్న దేవిరెడ్డి శివశంకర్ రెడ్డి బెయిల్ పిటీషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. వివేకా హత్య కేసులో కీలక నిందితునిగా ఉన్న శివశంకర రెడ్డి ఇటీవల సుప్రీంలో పిటీషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ కృష్ణమురారితో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటీషనర్ తరపు న్యాయవాది బెయిల్ మంజూరు చేయాలంటూ వాదనలు వినిపించగా, దానిపై సుప్రీం స్పందిస్తూ శివశంకర రెడ్డి బెయిల్ మంజూరు చేసేందుకు ఎలాంటి కారణాలు కనిపించడం లేదని తెలిపింది. ఈ విషయంలో రాష్ట్ర హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోలేమని స్పష్టం చేస్తూ బెయిల్ పిటీషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది.

అదే హైడ్రామా!

- రాజస్థాన్ కాంగ్రెస్‌లో కొనసాగుతున్న సంక్షోభం
- కొత్త సీఎం కోసం కుమ్ములాటలు
- పట్టువీడని గెహ్లాట్ వర్గం
- సీనియర్లతో సోనియా మంతనాలు
- అందరి దృష్టి 10, జన్‌పథ్ పైనే...
- కమల్‌నాథ్‌ను రంగంలోకి దించిన అధిష్ఠానం

న్యూఢిల్లీ/జైపూర్: రాజస్థాన్ కాంగ్రెస్‌లో హైడ్రామా కొనసాగుతోంది. కొత్త సీఎం నియామకం వేళ కుమ్ములాటల పర్వం కొనసాగుతోంది. ఇక్కడ పార్టీ ఎమ్మెల్యేలలో ఎక్కువ మంది సచిన్ పైలట్‌కు వ్యతిరేకంగా ముఖ్యమంత్రిగా అశోక్ గెహ్లాటే కొనసాగాలని కోరుకుంటున్నారు. ఈ నేపథ్యంలో ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికలకు ముందు రాజస్థాన్ కాంగ్రెస్‌లో నెలకొన్న సంక్షోభ నివారణకు అధిష్ఠానం ప్రయత్నాలు చేస్తోంది. దీంతో రాష్ట్రంలో గత 24 గంటల్లో జరిగిన వరుస పరిణామాల తర్వాత సోమవారం ఇక్కడి 10, జన్‌పథ్ నివాసంలో పార్టీ అగ్ర నేతలు సమావేశమైనందున అందరి దృష్టి కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీపై ఉంది. సీనియర్లతో సోనియా మంతనాలు జరుపుతున్నారు. సీనియర్ నేత కమల్‌నాథ్‌ను మధ్యవర్తిత్వం కోసం రాజస్థాన్ పంపాలని భావిస్తున్నారు. తక్షణం ఢిల్లీకి రావాలని కమల్‌నాథ్‌ను ఆదేశించారు. కాగా ఈ సంక్షోభం 'పొరపాటు'గా పేర్కొంటూ అశోక్ గెహ్లాట్ క్షమాపణ చెప్పినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఈ పరిణామాల నడుమ మంగళవారం 10, జన్‌పథ్‌లో కీలక సమావేశం జరగనున్నది.

రాజస్థాన్‌కు పంపిన పార్టీ పరిశీలకులు మల్లికార్జున్ ఖర్గే, అజయ్ మాకెన్... కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్‌పీ) ప్రణాళికాబద్ధమైన సమావేశం జరగక పోవడంతో సోమవారం ఢిల్లీకి తిరిగి వచ్చారు. జైపూర్ నుంచి తిరిగి వచ్చిన వెంటనే గాంధీని ఆమె నివాసంలో కలిశారు. గెహ్లాట్ ఇప్పటికీ పార్టీ అధ్యక్ష పదవికి పోటీ చేస్తారా లేదా ప్రస్తుత నాయకత్వం మద్దతు ఇచ్చే అభ్యర్థిగా అతని

- మిగతా 2 లో

రేసులో కొత్త ముఖాలు!

- గెహ్లాట్ తీరుతో మారిన పరిణామాలు
- కాంగ్రెస్ అధ్యక్ష బరిలో వేణుగోపాల్, దిగ్విజయ్, ఖర్గే పేర్లు

న్యూఢిల్లీ: రాజస్థాన్ కాంగ్రెస్‌లో సంక్షోభం నడుమ సీఎం అశోక్ గెహ్లాట్ పార్టీ అధ్యక్ష ఎన్నికల రేసుకు దూరంగా ఉన్నట్లు చెబుతున్నారు. కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్, సీనియర్ నేతలు దిగ్విజయ్ సింగ్, మల్లికార్జున్ ఖర్గే ఈ పదవికి పోటీ పడుతున్నారని సంబంధిత వర్గాలు తెలిపాయి. రాజస్థాన్‌లో తీవ్ర రాజకీయ సంక్షోభం, కాంగ్రెస్ అంతర్గత పోరు తారాస్థాయికి చేరుకోవడంతో అశోక్ గెహ్లాట్ పార్టీ అధ్యక్ష ఎన్నికల రేసులో లేరని ఉన్నత వర్గాలు పేర్కొన్నాయి. ప్రస్తుతం ఆ పార్టీ సీనియర్ నేతలు కేసీ వేణుగోపాల్, దిగ్విజయ్ సింగ్, మల్లికార్జున్ ఖర్గే కాంగ్రెస్ అగ్రనాయకత్వం కోసం పోటీ పడుతున్నారు. 'ఆయన (అశోక్ గెహ్లాట్) కాంగ్రెస్ అధ్యక్ష రేసులో లేరు. సెప్టెంబర్ 30 లోపు నామినేషన్ దాఖలు చేసే ఇతర నాయకులు కూడా ఉన్నారు. ముకుల్ వాస్నిక్, మల్లికార్జున్ ఖర్గే, దిగ్విజయ్ సింగ్, కేసీ వేణుగోపాల్ రేసులో ఉన్నారు' అని కాంగ్రెస్ నాయకుడు ఒకరు

- మిగతా 2 లో

ఎస్‌టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా

కత్తి నరసింహారెడ్డి

విశాలాంధ్ర-కడప కార్పొరేషన్: పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ నియోజక వర్గం ఎస్‌టీయూ అభ్యర్థిగా సిట్టింగ్ ఎమ్మెల్సీ కత్తి నరసింహారెడ్డి పేరు ఖరారు చేసినట్లు ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్. సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న ప్రకటించారు. కడపలోని వీవీఆర్ ఎస్‌టీయూ భవన్‌లో సోమవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో సాయి శ్రీనివాస్, తిమ్మన్న మాట్లాడారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారం కోసం అహర్నిశలు పని చేస్తున్న ఉద్యమనేత కత్తి నరసింహారెడ్డి అనీ, నిబద్ధత గల నాయకుడి అవసరం ఉపాధ్యాయ లోకానికి ఉందని వారు చెప్పారు. రాష్ట్ర అధ్యక్షుడిగానూ, ఫ్యాప్టో చైర్మన్‌గానూ, జేఏసీ కో-చైర్మన్‌గానూ పనిచేసిన అనుభవంతో పాటు ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలపై పూర్తి అవగాహన గల కత్తి నరసింహారెడ్డిని తిరిగి గెలిపించుకుందామని తెలిపారు. ఎమ్మెల్సీగా శాసనమండలిలోనూ, బయటా పోరాడుతున్నారని, అవసరమైనపుడు సంఘాల పక్షాన జరిగే ఉద్యమాలు, పోరాటాలలో పాల్గొంటున్నారని గుర్తుచేశారు. అక్టోబర్ ఒకటో తేదీ నుండి ఓటు నమోదు చేయించుకోవాలని ఉపాధ్యాయ, అధ్యాపకులకు విజ్ఞప్తి చేశారు. కత్తి నరసింహారెడ్డిని తిరిగి

- మిగతా 2 లో

కేంద్రీయ వర్సిటీల్లో

అంబేద్కర్ ఎక్సలెన్స్ సెంటర్లు

కేంద్ర సహాయ మంత్రి నారాయణస్వామి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దేశ వ్యాప్తంగా 30 కేంద్ర విశ్వవిద్యాలయాల్లో డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఎక్సలెన్స్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టామని కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత శాఖ సహాయ మంత్రి ఎ.నారాయణస్వామి చెప్పారు. అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక అమలులో భాగంగా 2021-22వ ఆర్థిక సంవత్సరంలో 18 శాఖలకు కేటాయించిన రూ.2,837 కోట్ల నిధుల వెచ్చింపు, అభివృద్ధి కార్యాచరణ ప్రణాళిక అమలుపై ఆయన సోమవారం అమరావతి సచివాలయంలో శాఖల వారీగా సమీక్షించారు. వ్యవసాయ అనుబంధ శాఖలతో పాటు విద్య, ఆరోగ్యం, కుటుంబ సంక్షేమం, స్త్రీ,శిశు సంక్షేమం, గృహ నిర్మాణం, గ్రామీణాభివృద్ధిచ తాగునీటి సరఫరా, పారిశుధ్యం తదితర శాఖలకార్యాచరణ ప్రణాళికల అమలు తీరును సమీక్షించారు. నారాయణస్వామి మాట్లడుతూ... అంబేద్కర్ ఎక్సలెన్స్ కేంద్రాల్లో సివిల్ సర్వీసెస్, బ్యాంకింగ్ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ కోసం ప్రతి విద్యార్థికి రూ.75 వేలు కేటాయిస్తామన్నారు. ఇందుకు 28 విశ్వవిద్యాలయాలు ఆమోదం తెలిపాయని, రాష్ట్రం నుంచి అనంతపురం విశ్వవిద్యాలయం నుంచి ప్రతిపాదన వచ్చిందన్నారు. బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, సంక్షేమం కోసం వివిధ పథకాల అమలుకు కేంద్రం ఏటా కోటా కింద కోట్లాది రూపాయల్ని కేటాయిస్తోందన్నారు. 2021-22 ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ.లక్షా 42 వేల కోట్ల మేర నిధులను కేటాయించినట్లు వివరించారు. జల్‌జీవన్ మిషన్ అమల్లో భాగంగా 95లక్షల గృహాలకు నేరుగా ట్యాప్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉండగా, ఇప్పటివరకు 54 లక్షల గృహాలకు ట్యాప్ కనెక్షన్లు ఇచ్చామని పేర్కొన్నారు. రాష్ట్రంలో 125 ఫ్లోరైడ్ నీటి సమస్య గ్రామాలున్నాయన్నారు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం,

- మిగతా 2 లో

గులాం నబీ ఆజాద్ కొత్త పార్టీ

- డెమొక్రటిక్ ఆజాద్ పార్టీగా నామకరణం
- జమ్ముకశ్మీర్‌లో శాంతి... సాధారణ పరిస్థితుల బలోపేతంపై దృష్టి

జమ్ము: ఇటీవలే కాంగ్రెస్‌తో విడిపోయిన గులాం నబీ ఆజాద్ సోమవారం తన కొత్త పార్టీ డెమొక్రటిక్ ఆజాద్ పార్టీ (డీఏపీ)ని ప్రారంభించారు. జమ్ముకశ్మీర్ మాజీ ముఖ్యమంత్రి అయిన ఆజాద్ ఆగస్టు 26న కాంగ్రెస్‌తో ఐదు దశాబ్దాలకు పైగా సుదీర్ఘ అనుబంధాన్ని ముగించారు. 'నేను ఈరోజు ఇక్కడ (జమ్ము కశ్మీర్) నుంచి డెమొక్రటిక్ ఆజాద్ పార్టీ (డీఏపీ)ని ప్రారంభిస్తున్నాను. ఇది ప్రజాస్వామ్యం, వాక్ స్వాతంత్ర్యం, ఆలోచనా స్వేచ్ఛకు ప్రతీక. మా భావజాలం మహాత్మా గాంధీ ఆదర్శాలపై ఆధారపడి ఉంటుంది' అని

- మిగతా 2 లో

ఇదీ లోకం!

అయ్యో నీక్కూడా రక్షణ లేదా!?

దివ్యాంగులకు భవిత సెంటర్

- వారికి అవసరమైన సేవలన్నీ సచివాలయాల్లోనే
- జువైనల్ హోమ్స్ పర్యవేక్షణకు ప్రత్యేక ఐపీఎస్ అధికారి
- మహిళా, శిశు సంక్షేమశాఖ సమీక్షలో సీఎం జగన్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: దివ్యాంగులకోసం ప్రతి నియోజకవర్గంలో ఒక భవిత సెంటర్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు. అలాగే వారికి అవసరమైన సేవలన్నీ గ్రామ, వార్డు సచివాలయాల్లోనే అందించేలా తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. జువైనల్ హోమ్స్ పర్యవేక్షణకు ప్రత్యేక ఐపీఎస్ అధికారిని నియమించాలని, వాటిలో సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశాలు జారీ చేశారు. అంగన్‌వాడీల నిర్వహణ, పిల్లలకు నాణ్యమైన పౌష్టికాహారం, దివ్యాంగుల సంక్షేమం తదితర అంశాలపై సీఎం సోమవారం క్యాంపు కార్యాలయంలో సమీక్షించారు. ఈసందర్భంగా

- మిగతా 2 లో

అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు

6లో

ఇటలీ తొలి మహిళా ప్రధాని మెలోని

రోమ్: ఇటలీ తొలి మహిళా ప్రధానిగా జియార్జియా మెలోని బాధ్యతలు స్వీకరించనున్నారు. మెలోని పూర్తిగా అతివాద నేత. నేషనలిస్ట్ బ్రదర్స్ పార్టీ నేత అయిన మెలోని(45) ఆదివారం జరిగిన జాతీయ ఎన్నికల్లో 26.37 శాతం ఓట్లను సాధించారు. వివాదాస్పదమైన గాడ్, ఫాదర్‌లాండ్ అండ్ ఫ్యామిలీ నినాదంతో మెలోని ఈ ఎన్నికల్లో విజయం సాధించారు. ఆమె ఎల్‌జీబీటీ హక్కులకు వ్యతిరేకంగా పోరాడారు. మాలియో సల్విని లీగ్, సిల్వియో బెర్లుస్కోనీ ఫోర్జా ఇటాలియా పార్టీలతో కూడిన కూటమి 43 శాతం పైగా ఓట్లను గెలుచుకున్నది. దీంతో సేనేట్‌లో ఆ పార్టీ 114 సీట్లను సొంతం చేసుకునే అవకాశాలు ఉన్నాయి. బ్రిటన్ కన్జర్వేటివ్‌ల తరహాలో తాము పాలన కొనసాగించనున్నట్లు మెలోని తెలిపారు. ఇంధన కొరత కొత్త ప్రభుత్వానికి సమస్యగా మారే అవకాశాలు ఉన్నాయి. యూరోప్‌లోని రైట్ వింగ్ నేతలందరూ మెలోని విజయానికి మద్దతు పలికారు. దీంతో మెలోని తొలి మహిళా ప్రధాని అయ్యే ఛాన్సు ఉంది. మెలోని కూటమి పార్టీలు కూడా ఉభయసభల్లో కీలక సీట్లను గెలుచుకున్నాయి. గత ఎన్నికల్లో మెలోని పార్టీకి 4శాతం ఓట్లు మాత్రమే వచ్చాయి. గ్రాబెల్లోలోని ఓ కార్మిక కుటుంబంలో జన్మించిన మెలోని తల్లి వద్ద పెరిగింది.

ఘనంగా ముగిసిన కేఎస్ఈ వార్షికోత్సవాలు

ఏథెన్స్ : గ్రీస్ కమ్యూనిస్ట్ యూత్ (కేఎస్ఈ) 48వ వార్షికోత్సరం ఏథెన్స్ ట్రిట్సిస్ పార్క్‌లో విజయవంతంగా ముగిసింది, వేలాది మంది కమ్యూనిస్టులు, కార్మికులు, పురుషులు, మహిళలు, సోషలిజం కోసం పెట్టుబడిదారీ దోపిడీ, సామ్రాజ్యవాద యుద్ధాలకు వ్యతిరేకంగా, కేకేఈతో కలిసి అలుపెరగని పోరాటం చేయాలని ఈ మహాసభలో సంకల్పించాయి. ప్రధాన వక్త కేకేఈ ప్రధాన కార్యదర్శి కౌత్సొంబస్ ప్రారంభ ప్రసంగం చేశారు. ఈ ఉత్సవంలో దేశంలోని ప్రముఖ కళాకారుల సంగీత కచేరీలు, రంగస్థల ప్రదర్శనలు, పుస్తక ప్రదర్శనలు, స్టాండ్ అప్ కామెడీ, వివిధ ప్రదర్శనలు, క్రీడా కార్యక్రమాలతో సహా అనేక రాజకీయ మరియు సాంస్కృతిక కార్యక్రమాలు ఉన్నాయి.

విశాలాంధ్ర ప్రపంచం

వచ్చే నెలలో సీపీసీ మహాసభలు

బీజింగ్: చైనా కమ్యూనిస్ట్ పార్టీ (సీపీసీ) కాంగ్రెస్‌కు ప్రతినిధులను ఎన్నుకుంది. అక్టోబరు 16న జరుగనున్న 20వ జాతీయ కాంగ్రెస్ సమావేశానికి 2,296 మంది ప్రతినిధులను ఎంపిక చేసింది. అధ్యక్షుడు జిన్‌పింగ్‌కు మూడవసారి అధ్యక్షుడుగా ఆమోదం పొందే అవకాశం ఉంది. ఐదేళ్లకు ఒకసారి జరిగే జాతీయ కాంగ్రెస్‌కు ప్రతినిధులు "పార్టీ రాజ్యాంగం ప్రకారం" చైనా లక్షణాలతో కూడిన సోషలిజం మార్గదర్శకత్వంలో ఈ ఎన్నిక జరిగిందని చైనా ప్రభుత్వ మీడియా జిన్హువా తెలిపింది. గణనీయమైన సంఖ్యలో మహిళా పార్టీ సభ్యులు, మైనారిటీ సమూహాలకు చెందిన వారు, అలాగే వివిధ రంగాలకు చెందిన వారు ఈ ప్రతినిధులలో ఉన్నట్లు తాజా నివేదిక పేర్కొంది. వెస్ట్రన్ థియేటర్ కమాండ్ (డబ్ల్యుటీసీ) నుండి 30 మంది ప్రతినిధులను ఎంపిక చేసింది. జిన్‌పింగ్‌పై సైనిక తిరుగుబాటు జరుగుతుందనే ఊహాగానాలను చైనా పీపుల్స్ డైలీ వార్తాపత్రిక కొట్టిపారేసింది. రానున్న ఐదేళ్లలో పార్టీ లక్ష్యాలు, ప్రధాన విధానాలపై కాంగ్రెస్ నిర్దిష్టమైన ప్రణాళికలను రూపొందించనుంది.

రష్యా స్కూల్లో కాల్పులు

14 మంది మృతి

మాస్కో: రష్యాలోని ఓ స్కూల్ విద్యార్థులపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపిన ఘటనలో 14 మంది మృతి చెందారు. ఇన్‌హెవెస్క్ సిటీ లోని ఓ స్కూల్ వద్ద సోమవారం దుండగుడు ఈ కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనలో 21 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ కాల్పుల్లో 9 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయారు. ఈ కాల్పులు జరిగిన సమయంలో 1000 మంది విద్యార్థులు, 80 మంది టీచర్లు ఉన్నారు. మృతి చెందిన వారిలో ఇద్దరు సెక్యూరిటీ గార్డులు, ఇద్దరు టీచర్లు కూడా మృతి చెందారు. గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం దగ్గరలోని ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. తరగతులు జరుగుతున్న సమయంలో ఈ కాల్పులు జరిగాయి. దాడిచేయడానికి వచ్చిన ఆగంతకుడు ముందుగా గార్డుపై కాల్పులు జరిపాడు. తరువాత పాఠశాలలోకి ప్రవేశించి విద్యార్థులపై కాల్పులకు తెగబడ్డాడు. కాల్పులు జరగుతున్న సమయంలో ఓ విద్యార్థిని తీసుకుని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఓ గదిలో దాక్కుంది. అయితే కాల్పులు జరిపిన వ్యక్తి కూడా తనకు తాను కాల్చుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ దుండగుడు బ్లాక్ కలర్‌లో ఉన్న దుస్తులు ధరించినట్లు రష్యా బలగాలు పేర్కొన్నాయి. ఆ డ్రెస్‌పై నాజీ సింబల్స్ ఉన్నట్లు నిర్ధారించారు.

గులాం నబీ ఆజాద్ కొత్త పార్టీ

(మొదటిపేజీ తరువాయి)

జమ్ములో విలేకరుల సమావేశంలో ఆజాద్ అన్నారు. డీపీఏకి మరే ఇతర రాజకీయ పార్టీతో పోటీ లేదని, జమ్ముకశ్మీర్‌లో శాంతి, సాధారణ పరిస్థితులను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తుందని ఆజాద్ వివరించారు. ఉర్దూ, హిందీ, సంస్కృతంలో పార్టీ కోసం దాదాపు 1,500 మంది పేర్లను తనకు సూచించినట్లు ఆజాద్ మీడియా ప్రతినిధులతో చెప్పారు. 'హిందీ, ఉర్దూ మిశ్రమం హిందుస్థానీ. పేరు ప్రజాస్వామ్య, శాంతియుత, స్వతంత్రంగా ఉండాలని మేము కోరుకుంటున్నాము. పూర్తి రాష్ట్ర హోదా, భూమిపై హక్కు, స్థానిక నివాసాలకు ఉపాధిని పునరుద్ధరించడంపై నా పార్టీ దృష్టి పెడుతుంది' అని ఆయన చెప్పారు. నీలం, తెలుపు, పసుపు రంగులతో కూడిన తన కొత్త పార్టీ జెండాను కూడా ఆజాద్ ప్రదర్శించారు. అంతకుముందు ఆగస్టులో, గులాం నబీ ఆజాద్ కాంగ్రెస్ ప్రాథమిక సభ్యత్వంతో సహా అన్ని పార్టీ పదవులకు రాజీనామా చేశారు. నాయకత్వాన్ని విమర్శిస్తూ, కాంగ్రెస్ పార్టీలో మార్పులు చేయాలని కోరిన జీ23 గ్రూపులో ఒక సభ్యుడిగా ఉన్నారు. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీకి రాసిన ఐదు పేజీల లేఖలో... 'భారీ హృదయంతో' పార్టీని వీడుతున్నట్లు తెలిపారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) నడుపుతున్న కోటరీ అధ్వర్యంలో భారతదేశానికి సరైన వాటి కోసం పోరాడే సంకల్పం, సామర్థ్యం రెండింటినీ కాంగ్రెస్ కోల్పోయిందని కూడా ఆయన అన్నారు. 'భారత్ జోడో యాత్ర' ప్రారంభించే ముందు, నాయకత్వం 'కాంగ్రెస్ జోడో యాత్ర' చేపట్టాలి' అని ప్రముఖ నాయకుడు తన లేఖలో పేర్కొన్నారు. ఆజాద్‌కు మద్దతుగా మాజీ ఉప ముఖ్యమంత్రి తారా చంద్‌తో సహా రెండు డజన్ల మంది ప్రముఖ కాంగ్రెస్ నేతలు కాంగ్రెస్‌కు రాజీనామా చేశారు.

మరింత చిక్కిన రూపాయి

(మొదటిపేజీ తరువాయి)

ఆర్‌బీఐ పరపతి విధాన సమీక్ష నిర్ణయాలపై దృష్టి సారించారు. రేపోరేటును మరో 50 బేసిస్ పాయింట్లు పెంచే అవకాశం ఉందని నిపుణులు అంచనా వేస్తున్నారు. మరోవైపు శుక్రవారం విదేశీ మదుపర్లు రూ.2,899 కోట్లు విలువ చేసే షేర్లను విక్రయించారు. ఇదిలా ఉంటే.. విదేశీ మారక నిల్వలు వేగంగా తరిగిపోతున్నాయి. సెప్టెంబరు 16తో ముగిసిన వారంలో నిల్వలు మరో 5.219 బిలియన్ డాలర్లు తగ్గి 545.652 బి.డాలర్లకు చేరాయి.

అంబేద్కర్ ఎక్స్‌లెన్స్ సెంటర్లు

(మొదటిపేజీ తరువాయి)

జగ్గయ్యపేట సమీపంలోని ఎ.కొండూరు గ్రామాల్లో కిడ్నీ సమస్యలతో బాధపడేవారిలో ఎక్కువగా గిరిజనులేనని పేర్కొన్నారు. పీఎంఏజీవై పథకం కింద 92 గ్రామాలను ఆదర్శ గ్రామాలుగా గుర్తించామని, మరో 120 గ్రామాలను ప్రతిపాదించామన్నారు. నేషనల్ ఎస్సీ డవలప్‌మెంట్ కార్పొరేషన్ కు రూ.143 కోట్లను కేటాయించామని పేర్కొన్నారు. అద్దె భవనాల్లో నిర్వహిస్తోన్న గురుకుల పాఠశాలలు, వసతి గృహాల శాశ్వత భవనాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులకు సూచించామన్నారు. ఈ సమావేశంలో కేంద్ర సామాజిక న్యాయ, సాధికారిత శాఖ అదనపు కార్యదర్శి సురేంద్ర సింగ్, రాష్ట్ర సాంఘిక, బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ విజయలక్ష్మీ, సంచాలకులు కె.హర్షవర్ధన్, బీసీ సంక్షేమ శాఖ సంచాలకులు పి.అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులకు భవిత సెంటర్

(మొదటిపేజీ తరువాయి)

మాట్లాడుతూ స్కూళ్లలో టాయిలెట్ల మెయింటెనెన్స్ కోసం ఏర్పాటు చేసిన టీఎంఎఫ్, స్కూళ్ల నిర్వహణకోసం ఏర్పాటు చేసిన ఎస్ఎంఎఫ్ తరహాలో అంగన్‌వాడీల నిర్వహణ ఉండాలని, పరిశుభ్రతకోసం ప్రత్యేక నిధిని ఏర్పాటు చేయాలని చెప్పారు. అంగన్‌వాడీలకు కూడా ఎస్ఎంఎఫ్, టీఎంఎఫ్‌లు ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. అంగన్‌వాడీ పిల్లలకు ఇప్పటినుంచే భాష, ఉచ్ఛారణలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. పాఠశాల విద్యాశాఖతో కలిసి పగడ్బందీగా పీపీ-1, పీపీ-2 పిల్లలకు పాఠ్యప్రణాళిక అమలు చేయాలి. అన్నీ బైలింగువల్ టెక్స్ట్‌బుక్స్ ఉండాలని సీఎం మార్గనిర్దేశనం చేశారు. అంగన్‌వాడీలకు అత్యంత నాణ్యమైన పౌష్టికాహారం పంపిణీపై సమావేశంలో చర్చ జరిగింది. ప్రస్తుతం జరుగుతున్న కొనుగోలు, పంపిణీ విధానాలను సీఎం సమగ్రంగా సమీక్షించారు. పిల్లలకు అందించే ఆహారం నాణ్యంగా ఉండాలన్నదే ప్రధాన ఉద్దేశమని, పంపిణీలో అక్కడక్కడా లోపాలు తలెత్తుతున్న సమాచారం నేపథ్యంలో పకడ్బందీ విధానాలు అమలు చేయాలని సీఎం స్పష్టం చేశారు. నాణ్యతను పూర్తిస్థాయిలో చెక్‌చేసిన తర్వాతనే పిల్లలకు చేరాలన్నారు. మార్క్‌ఫెడ్ అధ్వర్యంలో కొనుగోళ్లు, పంపిణీని పైలట్‌ప్రాజెక్ట్ కింద చేపట్టాలని ఈ సమావేశంలో సూత్రప్రాయ నిర్ణయించారు. బాల్య వివాహాలను పూర్తిగా నివారించాలని, కల్యాణమస్తు పథకం బాల్య వివాహాల నివారణలో ప్రత్యేక పాత్ర పోషిస్తుందన్నారు. అందుకనే లబ్ధిదారైన వధువు, ఆమెను వివాహం చేసుకునే వరుడు తప్పనిసరిగా టెన్త్ ఉత్తీర్ణత సాధించాలన్న నిబంధన పెట్టామని సీఎం వివరించారు. అన్ని అంగన్‌వాడీలకు, స్కూళ్లలో మధ్యాహ్న భోజనానికి సార్టెక్స్ చేసిన బియ్యాన్నే పంపిణీ చేయాలని, ఎస్‌డీజీ లక్ష్యాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని చెప్పారు. అంగన్‌వాడీల నిర్వహణలో ఏమైనా సమస్యలు ఉంటే ఫిర్యాదు చేయడానికి ప్రత్యేక నంబర్‌తో ఉన్న పోస్టర్‌ను ప్రతి అంగన్‌వాడీలో ఉంచాలని సూచించారు. పోస్టుల భర్తీపై సీఎం వివరాలు అడగ్గా, సెప్టెంబరు 30 కల్లా అంగన్‌వాడీ సూపర్ వైజర్ల పోస్టుల భర్తీ చేస్తామని అధికారులు వెల్లడించారు. ఇంటర్వ్యూలు ముగిశాక మార్కుల జాబితాలను వెల్లడిస్తామని, పరీక్షలకు హాజరైన అభ్యర్థులు అవసరమనుకుంటే.. తమ ఆన్సర్‌షీట్లను కూడా పరిశీలించుకునే అవకాశం కల్పిస్తున్నామని, పరీక్షల ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తిచేసి సెప్టెంబరు 30 కల్లా సూపర్‌వైజర్లను నియమించేలా చర్యలు తీసుకుంటామని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సమావేశంలో మహిళా, శిశుసంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషాశ్రీచరణ్, స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్, మహిళా, శిశుసంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఏఆర్.అనురాధ, మార్క్‌ఫెడ్ కమిషనర్ పీఎస్ ప్రద్యుమ్న, మహిళా, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ ఎ.సిరి తదితరులు పాల్గొన్నారు.

మరో పాతికేళ్లకి అభివృద్ధి చెందిన దేశంగా భారత్

హుబ్లీ: 2047లో జరుపుకోనున్న స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి దేశాన్ని అన్ని విధాల అభివృద్ధి చేసుకుందామని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కర్ణాటక పర్యటనలో ఉన్న ఆమె రాష్ట్రపతి గౌరవార్థం హుబ్లీ నగరంలో ఏర్పాటు చేసిన పౌర సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. హుబ్లీ-దార్వాడ మున్సిపల్ కార్పొరేషన్లు ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జరిగిన సన్మానం అనంతరం ద్రౌపది ముర్ము మాట్లాడుతూ...దేశవ్యాప్తంగా 75 ఏళ్ల స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో ఆజాదీకా అమృత మహోత్సవ్ పేరుతో ఉత్సవాలు జరుపుకున్నామని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన సమర యోధులను స్మరించుకోకపోతే ఉత్సవాలకు సార్థకత ఉండదని చెప్పారు. 2047లో జరుపుకోనున్న స్వాతంత్ర్య శతాబ్ది ఉత్సవాల నాటికి దేశాన్ని ఆత్మనిర్భర భారత్‌గా మార్చుకోవడాన్ని లక్ష్యంగా పెట్టుకోవాలని పేర్కొన్నారు. అప్పటికి భారత్ తప్పకుండా అభివృద్ధి చెందిన దేశం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సాహిత్యం కళలు, ఆధ్యాతిక రంగాల కోసం కృషి చేసిన ప్రముఖుల సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, సీఎం బసవ రాజ్ బొమ్మై, కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అనంతబాబుకు బెయిల్ తిరస్కరణ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్సీ అనంతబాబుకు హైకోర్టులో చుక్కెదురైంది. తన కారు మాజీ డ్రైవర్, దళిత యువకుడు సుబ్రమణ్యం హత్య కేసులో ఎమ్మెల్సీ నిందితుడిగా ఆరోపణలను ఎదుర్కొంటున్న విషయం తెలిసిందే. పోలీసులు 90 రోజుల్లోగా ఛార్జిషీటు దాఖలు చేయనందున బెయిల్ మంజూరు చేయాలంటూ ఎమ్మెల్సీ హైకోర్టులో పిటిషన్ వేశారు. విచారణ సందర్భంగా న్యాయస్థానం ఆ పిటిషన్‌ను కొట్టేసింది. గతంలో బెయిల్ పిటిషన్‌ను కింద కోర్టు కొట్టేయడంతో ఆయన హైకోర్టులో పిటిషన్ వేశారు. ప్రస్తుతం రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న అనంతబాబు రిమాండ్‌ను ఎస్సీ, ఎస్టీ కోర్టు మరోసారి పొడిగించింది. అక్టోబరు 7 వరకు రిమాండ్‌లో ఉంచుతూ న్యాయమూర్తి ఆదేశాలు జారీచేశారు. అనంతబాబు కొన్నాళ్ల క్రితం తన కారు డ్రైవర్ సుబ్రమణ్యంను హత్య చేసి మృతదేహాన్ని నేరుగా తనకారులోనే తీసుకొచ్చి ఇంటిదగ్గర వదిలివెళ్లాడు. ఈ సంఘటన రాష్ట్రవ్యాప్తంగా సంచలనం కలిగించింది. సుబ్రమణ్యం హత్య కేసులో అనంతబాబు కీలక వివరాలను వెల్లడించాడు. తన వ్యక్తిగత వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడమే కాకుండా బయట కూడా మాట్లాడటంతో బెదిరించి వదిలేద్దామనుకున్నానని, తప్పనిసరి పరిస్థితుల్లో హత్య చేయాల్సి వచ్చిందని పోలీసులతో చెప్పినట్లు వార్తలు వచ్చాయి.

కజిరంగాలో నైట్ సఫారీ

వివాదంలో అసోం సీఎం, సద్గురు

గువాహటి: అసోం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ, సద్గురు జగ్గీవాసుదేవ్ జాతీయ పార్కు సందర్శన వివాదాస్పదమైంది. రాత్రివేళ సఫారీకి వెళ్లడం.. వన్యప్రాణి సంరక్షణ నిబంధనల ఉల్లంఘనేనంటూ విమర్శలు వచ్చాయి. అయితే ఆ ఆరోపణలను ముఖ్యమంత్రి ఖండించారు. హిమంత బిశ్వ శర్మ, సద్గురు, పర్యాటక మంత్రి జయంత మల్లా బారువా.. శనివారం షెడ్యూల్ సమయం తర్వాత కజిరంగా జాతీయ పార్కులో పర్యటించారంటూ ఇద్దరు ఉద్యమకారులు ఫిర్యాదు చేశారు. వన్యప్రాణి సంరక్షణ చట్టం ప్రకారం.. మూగజీవాల అలవాట్లకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు షెడ్యూల్ సమయం తర్వాత అక్కడ సఫారీ చేయడం నిషేధం. 'చట్టం ముందు అందరూ సమానులే. ఈ చట్టాన్ని ఎలా ఉల్లంఘిస్తారు. అలాంటి చర్యలను మేం సహించం. ఉల్లంఘనలకు పాల్పడినందుకు వారిని అరెస్టు చేయాలి' అని ఉద్యమకారుడు సోనేశ్వర్ నరా ఆరోపించారు. ఈ సందర్శన సమయంలో సద్గురు ఎస్‌యూవీని నడపగా, ఆ వాహనంలో హిమంత, బారువా వెంటే ఉన్నారు. ఈ ఆరోపణలను అసోం ముఖ్యమంత్రి తోసిపుచ్చారు. 'ఇక్కడ ఉల్లంఘన అంటూ ఏమీ లేదు. చట్టం ప్రకారమే.. రక్షిత ప్రాంతంలో పర్యటించేందుకు మాకు వార్డెన్ అనుమతి ఇచ్చారు. ప్రజలు రాత్రిపూట వెళ్లకుండా ఏ చట్టమూ ఆపలేదు' అని వ్యాఖ్యానించారు. ఈ వ్యవహారంపై అటవీ సంరక్షణ విభాగం ఉన్నతాధికారి స్పందిస్తూ.. 'సద్గురు, ముఖ్యమంత్రి రాత్రివేళ సఫారీని ఆస్వాదించారని ఆరోపించడం సరికాదు. అన్ని ఏర్పాట్లు పూర్తవడంతో.. చీకటి పడిందని చెప్పి వారి పర్యటనను రద్దు చేసే మార్గం లేదు' అని వెల్లడించారు. ఇదిలా ఉంటే.. ఈ విషయంలో తాము ఎలాంటి ఎఫ్ఐఆర్ నమోదు చేయలేదని పోలీసులు తెలిపారు.

ఎస్టీయూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కత్తి నరసింహారెడ్డి

(మొదటిపేజీ తరువాయి)

గెలిపించుకుంటామని కార్యకర్తలు నినాదాలు చేశారు. కత్తి నరసింహారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్సీ అభ్యర్థిగా తనను ప్రకటించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. తన జీవితాన్ని ఉపాధ్యాయ, విద్యారంగ సంక్షేమం కోసం ధారపోస్తానన్నారు. రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి మల్లు రఘునాథరెడ్డి, రాష్ట్ర నాయకులు బాలగంగిరెడ్డి, గురుకుమార్, ఇలియాస్ భాష, శివారెడ్డి, కడప జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, అన్నమయ్య జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జగన్‌మోహన్ రెడ్డి, సునీల్ కుమార్ పాల్గొన్నారు.

రేసులో కొత్త ముఖాలు!

(మొదటిపేజీ తరువాయి)

తెలిపారు. 'గెహ్లాట్ ప్రవర్తించిన తీరు పార్టీ నాయకత్వానికి నచ్చలేదు. వారు అతనితో చాలా కలత చెందారు' అని సీడబ్ల్యూసీ సభ్యుడైన మరొక నాయకుడు అన్నారు. గెహ్లాట్‌కు విధేయులైన 82 మంది రాజస్థాన్ ఎమ్మెల్యేలు రాజీనామా చేసిన తర్వాత ఆదివారం సాయంత్రం నుంచి ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో హైడ్రామాకు అవధులు లేవు. సోమవారం సంక్షోభంపై పార్టీ సీనియర్ నేతలు అజయ్ మాకెన్, మల్లికార్జున్ ఖర్గే... సోనియా గాంధీకి వివరించారు. సమావేశం అనంతరం అజయ్ మాకెన్ మీడియాతో మాట్లాడుతూ అశోక్ గెహ్లాట్‌కు విధేయులైన ఎమ్మెల్యేల డిమాండ్లపై మాట్లాడారు. అజయ్ మాకెన్ పార్టీ తీర్మానానికి సంబంధించిన షరతులను 'ప్రయోజనాల సంఘర్షణ'గా అభివర్ణించారు. అశోక్ గెహ్లాట్, సచిన్ పైలట్ వర్గాల మధ్య వాగ్వాదానికి మధ్యవర్తిత్వం వహించేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం కమల్ నాథ్‌ను నియమించినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.

పార్టీ అధ్యక్ష పదవి రేసు నుంచి గెహ్లాట్‌ను తప్పించండి

రాజస్థాన్‌లో కాంగ్రెస్‌లో సంక్షోభానికి కారణమైన అశోక్ గెహ్లాట్‌ను కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేయకుండా చూడాలని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు. గెహ్లాట్‌ను తప్పించి పార్టీకి కట్టుబడి ఉండే మరో నేతను పోటీకి దింపాలని సూచిస్తున్నారు. ఈ మేరకు గెహ్లాట్ పై సోనియాగాంధీకి కొందరు సీడబ్ల్యూసీ సభ్యులు ఫిర్యాదు చేశారు. ఆయనపై విశ్వాసం ఉంచి... పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం మంచిదికాదని చెప్పినట్లు తెలిసింది. దిగ్విజయ్ సింగ్, ముకుల్ వాస్నిక్ వంటి సీనియర్ నాయకుల పేర్లు అధ్యక్ష పదవికి పరిశీలించాలని సోనియాను కోరినట్లు సమాచారం. ఢిల్లీలోని 10, జన్‌పథ్‌లో మంగళవారం కీలక సమావేశం జరగనున్న సందర్భంలో పార్టీ సీనియర్ నాయకులు కీలక వ్యాఖ్యలు చేశారు. పోటీకి సిద్ధమైన మరో సీనియర్ నేత శశిథరూర్ ఈ నెల 20న తన నామినేషన్ పత్రాలను సమర్పించనున్నారు.

కాంగ్రెస్ పదవిపై ఆసక్తి లేదు: కమల్ నాథ్

రాజస్థాన్ కాంగ్రెస్‌లో కొనసాగుతున్న సంక్షోభాన్ని పరిష్కరించడానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు కమల్ నాథ్ సోమవారం అడుగుపెట్టినప్పటికీ, పార్టీ అధ్యక్ష పదవికి తాను పోటీ చేసే విషయాన్ని తోసిపుచ్చారు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌తో సన్నిహిత సంబంధాలను కలిగి ఉన్న కమల్ నాథ్, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీని ఆమె 10 జన్‌పథ్ నివాసంలో కలిశారు. రాష్ట్ర పార్టీ పరిశీలకులు మల్లికార్జున్ ఖర్గే, అజయ్ మాకెన్‌తో ఆమె గంటకు పైగా సమావేశం నిర్వహించారు. సమావేశం అనంతరం కమల్ నాథ్ విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ అధ్యక్ష పదవిపై మీకు ఆసక్తి లేదా అని అడిగిన ప్రశ్నకు... 'నాకు ఆసక్తి లేదు. నవరాత్రుల కోసం నేను ఢిల్లీకి వచ్చాను' అని తెలిపారు.

అదే హైడ్రామా!

(మొదటిపేజీ తరువాయి)

స్థానంలో మరొకరు పోటీ చేస్తారా అనేది ప్రశ్నార్థకంగా మారింది. అయితే కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నిక అంతర్గత వ్యవహారమని, 'ఒక వ్యక్తి, ఒకే పదవి' ఫార్ములా తనకు వర్తించదని గెహ్లాట్ పేర్కొంటున్నారు. ఇదిలాఉండగా, పార్టీలో నెలకొన్న గందరగోళంపై తాను, తన సహచరుడు మల్లికార్జున్ ఖర్గే 'ఈ రాత్రి లేదా రేపు' లోపు లిఖితపూర్వక నివేదికను పార్టీ నేత సోనియాకు అందజేస్తామని కాంగ్రెస్ కేంద్ర పరిశీలకుడు అజయ్ మాకెన్ సోమవారం తెలిపారు. ఆ తర్వాత పార్టీ తదుపరి వ్యూహాన్ని రూపొందిస్తామన్నారు. సోనియాను కలిసిన తర్వాత న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన మాకెన్... రాజస్థాన్‌లో తాను, ఖర్గే జరిపిన సమావేశాలకు సంబంధించి వివరించిన తర్వాత 'రాతపూర్వక నివేదిక' కోరినట్లు చెప్పారు. తదుపరి కాంగ్రెస్ అధ్యక్షుడిగా రేసులో ఉన్న గెహ్లాట్‌ను రాజస్థాన్ ముఖ్యమంత్రిగా నియమించాలని 102 మంది గెహ్లాట్ మద్దతుదారులు తనకు, ఖర్గేకు చెప్పారని మాకెన్ చెప్పారు. 'మేము వారి అభిప్రాయాన్ని పార్టీ అధ్యక్షురాలుకు అందజేస్తాం. ఆమోదించిన తీర్మానాలకు ఎటువంటి షరతులు జోడించలేదని మేము వారికి చెప్పాం. పార్టీ అధినేత సంప్రదింపుల తర్వాత నిర్ణయం తీసుకుంటారు' అని వివరించారు. మరోవైపు, పార్టీలో సంక్షోభ పరిష్కారం కోసం, పార్టీ సీనియర్ నేత, మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ కూడా సోనియాను కలవడానికి న్యూఢిల్లీ బయలుదేరారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడుగా ఉన్న కమల్‌నాథ్ గెహ్లాట్‌తో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నారని, సంధికి మధ్యవర్తిత్వం వహించమని కోరవచ్చు. రాజస్థాన్‌లో మెజారిటీ ఎమ్మెల్యేల తిరుగుబాటు తర్వాత తలెత్తిన పరిస్థితులపై చర్చించేందుకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణు గోపాల్... సోనియా నివాసానికి వచ్చారు. ఈ పరిణామాల మధ్య రాజస్థాన్ మాజీ ప్రతిపక్ష నాయకుడు రామేశ్వర్ దూడీ కూడా సోనియాను కలిశారు. గెహ్లాట్‌కు విధేయులైన ఎమ్మెల్యేలు... ఖర్గే, మాకెన్‌ను విడివిడిగా కలవడం మానుకోవడంతో నాయకత్వ మార్పుపై రాజస్థాన్‌లో రాజకీయ నాటకం సోమవారం కొనసాగింది. గెహ్లాట్‌ను ముఖ్యమంత్రిగా కొనసాగించాలని కోరుతూ సమాంతర సమావేశం నిర్వహించి అనేక డిమాండ్లను ముందుకు తెచ్చారు. కాంగ్రెస్ అధ్యక్షుడిగా గెహ్లాట్ ఎన్నికయితే ముఖ్యమంత్రి పదవికి ప్రధాన పోటీదారుగా భావిస్తున్న పైలట్... ఈ పరిణామాల మధ్య పార్టీ అధిష్ఠానాన్ని కూడా కలవాలని భావిస్తున్నారు. పైలట్‌ను తదుపరి ముఖ్యమంత్రిగా నియమించే అవకాశం ఉన్నందున ఆదివారం రాజీనామా చేసిన గెహ్లాట్‌కు విధేయులైన 82 మంది ఎమ్మెల్యేలు తమ తదుపరి కార్యాచరణను నిర్ణయించడానికి మరోసారి సమావేశం నిర్వహించే అవకాశం ఉందని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి. 200 మంది సభ్యులున్న రాజస్థాన్ అసెంబ్లీలో కాంగ్రెస్‌కు 108 మంది ఎమ్మెల్యేలు ఉన్నారు. ఆదివారం జరిగిన సీఎల్‌పీ సమావేశానికి ఎమ్మెల్యేలంతా వస్తారని ఎదురుచూసిన ఖర్గే, మాకెన్ రాజకీయ సంక్షోభాన్ని చల్లార్చే ప్రయత్నంలో గెహ్లాట్ విధేయులను ఒక్కొక్కరుగా కలిసేలా ఒప్పించే ప్రయత్నం చేస్తున్నారు. అయితే, నవరాత్రి పండుగను దృష్టిలో ఉంచుకుని అనేక మంది ఎమ్మెల్యేలు తమ తమ నియోజక వర్గాలకు వెళ్లిపోయారని సంబంధిత వర్గాలు తెలిపాయి. కాగా పార్టీ తీర్మానం కోసం షరతులు విధించినందుకు గెహ్లాట్ విధేయులను మాకెన్ నిందించారు. సమాంతర సమావేశాన్ని నిర్వహించాలనే వారి నిర్ణయం క్రమశిక్షణా రాహిత్యానికి సమానమని అన్నారు. '75 ఏళ్ల కాంగ్రెస్ చరిత్రలో షరతులతో కూడిన తీర్మానం ఎప్పుడూ జరగలేదు. తీర్మానం అనేది ఏకవాక్యం మాత్రమే. అంతా కాంగ్రెస్ అధ్యక్షునికి చెప్పి నిర్ణయం తీసుకుంటాం' అని జైపూర్‌లో విలేకరులతో మాకెన్ అన్నారు. 'ఒక తీర్మానం ఎలాంటి ప్రయోజనాల వివాదాన్ని కలిగి ఉండకూడదు. రేపు ఎన్నికలలో పోటీ చేసే వారు పార్టీ అధ్యక్షుడవుతారు. తీర్మానంపై నిర్ణయం తీసుకుంటే, అది ప్రయోజనాల విరుద్ధం. అందువల్ల అది తప్పు' అని గెహ్లాట్ పేరు ప్రస్తావించకుండా అన్నారు. గెహ్లాట్ విధేయుల సందేశాన్ని తెలియజేసేందుకు రాజస్థాన్ మంత్రులు శాంతి ధరివాల్, మహేష్ జోషి, ప్రతాప్ సింగ్ ఖాచార్యవాస్ ఆదివారం రాత్రి జైపూర్‌లోని ముఖ్యమంత్రి నివాసంలో ఖర్గే, మాకెన్‌ను కలిశారు. ప్రతినిధి బృందం మూడు షరతులను ముందుకు తెచ్చిందని... కాంగ్రెస్ అధ్యక్ష ఎన్నికల తర్వాత ముఖ్యమంత్రి ఎంపికపై నిర్ణయం తీసుకోవాలని, 2020లో రాజకీయ సంక్షోభం సమయంలో ప్రభుత్వంతో పాటు నిలబడిన ఎమ్మెల్యేల నుంచి ముఖ్యమంత్రి ఉండాలని, పైలట్ శిబిరం నుంచి కాదని, పరిశీలకులు అధిష్ఠానం కోరినట్లు ఎమ్మెల్యేలతో విడివిడిగా సమావేశాలు జరపకుండా, సమూహాలుగా సమావేశాలు నిర్వహించాలని కోరినట్లు మాకెన్ తెలిపారు. 'అందరి మాట వింటాం. ఎలాంటి నిర్ణయం తీసుకోవడం లేదు. మీరు ఏం చెప్పినా ఢిల్లీకి చేరవేస్తాం. ఎమ్మెల్యేలతో విడివిడిగా సమావేశాలు నిర్వహించాలని మాకు ఆదేశాలు ఉన్నాయి' అని మాకెన్ శాసనసభ్యులకు చెప్పారు. ఎమ్మెల్యేల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోకపోతే ప్రభుత్వానికి ప్రమాదం తప్పదని స్వతంత్ర శాసనసభ్యుడు, ముఖ్యమంత్రి సలహాదారు సన్యామ్ లోధా అన్నారు. అక్టోబరు 19న పార్టీ అధ్యక్ష ఎన్నికల తర్వాత, గెహ్లాట్‌తో సంప్రదించి తదుపరి ముఖ్యమంత్రిపై ఏదైనా నిర్ణయం తీసుకోవాలని ఖర్గే, మాకెన్‌కు చెప్పినట్లు గెహ్లాట్ విధేయులు తెలిపారు.

గెహ్లాట్ క్షమాపణ!

నిన్న జైపూర్‌లో జరిగిన శాసనసభా పక్ష సమావేశానికి వచ్చిన కేంద్ర పరిశీలకుడు మల్లికార్జున్ ఖర్గేకి అశోక్ గెహ్లాట్ క్షమాపణలు చెప్పినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ఎమ్మెల్యేల సమాంతర సమావేశం, ఆ తర్వాత జరిగిన వారి తిరుగుబాటును 'పొరపాటు'గా పేర్కొంటూ, గెహ్లాట్ 'అది జరగాల్సింది కాదు' అని చెప్పినట్లు వర్గాలు తెలిపాయి. దానితో తనకు సంబంధం లేదని కూడా చెప్పినట్లు తెలుస్తోంది.

మాకు ఆమోదయోగ్యంగా ఉండాలి

ఎవరిని ముఖ్యమంత్రి చేసినా పార్టీ ఎమ్మెల్యేలకు అభ్యంతరం లేదని, కానీ అధిష్ఠానం తుది నిర్ణయం తమకు ఆమోదయోగ్యంగా ఉండాలని రాజస్థాన్ అసెంబ్లీలో కాంగ్రెస్ చీఫ్ విప్ మహేశ్ జోషి సోమవారం తెలిపారు. ముఖ్యమంత్రి అశోక్ గెహ్లాట్‌కు విధేయులుగా ఉన్న కాంగ్రెస్ ఎమ్మెల్యేల సమావేశానికి సంబంధించిన వీడియో ఒకటి బయటకు వచ్చింది. గెహ్లాట్‌ను ముఖ్యమంత్రి పదవి నుంచి తొలగిస్తే కాంగ్రెస్‌కు నష్టం వాటిల్లుతుందని మంత్రి శాంతి ధరివాల్ తన నివాసంలో సమావేశం నిర్వహించిన వీడియోలో వినిపిస్తోంది. గెహ్లాట్, రాష్ట్ర కాంగ్రెస్ చీఫ్ గోవింద్ సింగ్ దోతస్రాతో కలిసి సోమవారం జైపూర్-ఢిల్లీ జాతీయ రహదారిలోని ఒక హోటల్‌లో ఏఐసీసీ పరిశీలకులు మల్లికార్జున్ ఖర్గే, అజయ్ మాకెన్‌ను కలిశారు. హోటల్‌లో కొందరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా కనిపించారు. సమావేశం అనంతరం ఖర్గే, మాకెన్ ఢిల్లీకి బయలుదేరి వెళ్లారు. జోషి మాట్లాడుతూ 'ఎమ్మెల్యేల సందేహాలను అధిష్ఠానం నివృత్తి చేయాలని, ఆపై ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఆమోదిస్తామన్నారు. ఎవరినైనా ముఖ్యమంత్రిని చేస్తే మాకు ఎలాంటి అభ్యంతరం లేదు. అయితే తుది నిర్ణయం ఏకాభిప్రాయంతో ఉండాలి' అని ఆయన ఇక్కడ విలేకరులతో అన్నారు. ఆదివారం రాత్రి ముఖ్యమంత్రి నివాసంలో ఏఐసీసీ పరిశీలకులను కలిసిన మంత్రులు పార్టీ తీర్మానంలో ఎమ్మెల్యేల షరతులను పొందుపరచాలని కోరలేదని కూడా జోషి చెప్పారు. 'మేము తీర్మానంలో ప్రతిదీ కోరుకుంటున్నామని కాదు. వారికి (పరిశీలకులకు) అర్థమయ్యేలా చేయడంలో మేము విఫలమై ఉండవచ్చు లేదా మేము ప్రయత్నించి ఉండవచ్చు కానీ వారికి అర్థం కాలేదు. కానీ తీర్మానంలో ఎలాంటి సవరణల గురించి మాట్లాడలేదు' అని ఆయన అన్నారు. మరోవైపు, గెహ్లాట్ విధేయుల రాజీనామా తర్వాత ప్రభుత్వానికి అసెంబ్లీలో మెజారిటీ లేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే గిరిరాజ్ సింగ్ మలింగ అన్నారు. మధ్యంతర ఎన్నికలే సరైన మార్గమని అన్నారు. ధరివాల్ నివాసంలో జరిగిన సమావేశానికి 30 మంది మంత్రులు హాజరయ్యారని, రాష్ట్రంలో సీఎం మార్పు గురించి వారు ఎక్కువగా ఆందోళన చెందుతున్నారని మలింగ అన్నారు. 'కొత్త మంత్రివర్గం ఏర్పడితే తమ కుర్చీలు పోతాయని మంత్రులు ఆందోళన చెందుతున్నారు. ప్రజల కోసం పని చేయని వారు తమ సొంత ఏర్పాట్లలో నిమగ్నమై నిరసనలు తెలుపుతున్నారు. అశోక్ గెహ్లాట్, సచిన్ పైలట్ లేదా మరెవరినైనా ముఖ్యమంత్రిని చేసినా నేను అధిష్ఠానంతోనే ఉన్నాను' అని ఆయన అన్నారు. పైలట్ విధేయుల్లో ఒకరైన ఖిలాడీ లాల్ బైర్వా మాట్లాడుతూ 'మేము అధిష్ఠానంతో ఉన్నాం. ఎలాంటి నిర్ణయం తీసుకున్నా ఆమోదిస్తాం. ఆదివారం కూడా ఇదే చెప్పాం' అని అన్నారు. సచిన్ పైలట్‌ను సీఎంను చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ కేంద్ర పరిశీలకుడు, రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అజయ్ మాకెన్‌పై ధరివాల్ ఎదురుదాడికి దిగారు. 'రాజస్థాన్ ఇన్‌ఛార్జ్ పక్షపాతంతో వ్యవహరిస్తున్నారు. అతను పైలట్ కోసం ప్రచారం చేస్తున్నాడు. అతనిని ముఖ్యమంత్రిని చేయాలనుకుంటున్నాడు. ప్రజలు ఆగ్రహించారు' అని తెలిపారు.

యాభైలోకి 'ఏపీఐఐసీ'

అభివృద్ధి కార్యక్రమాల్లో కీలకపాత్ర

స్వర్ణోత్సవ లోగోను ఆవిష్కరించిన సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : రాష్ట్ర పారిశ్రామిక ప్రగతిలో ప్రత్యేక ముద్ర వేసుకున్న ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏపీఐఐసీ) సోమవారం 50వ సంవత్సరంలోకి అడుగిడింది. ఈ సందర్భంగా తాడేపల్లి సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి సంస్థ స్వర్ణోత్సవ లోగోను ఆవిష్కరించారు. పారదర్శక పారిశ్రామిక విధానంతో పారిశ్రామిక వాడల అభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని ఉన్నతాధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఏపీఐఐసీ చైర్మన్ మెట్టు గోవిందరెడ్డి, ఎండీ జేవీఎస్ సుబ్రహ్మణ్యం, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. 1973 సెప్టెంబర్ 26న రూ.20 కోట్ల మూలధనంతో ఏర్పాటైన ఏపీఐఐసీ, ఇప్పటివరకు 450కి పైగా పారిశ్రామిక పార్కుల నిర్మాణం చేపట్టింది. ఉమ్మడి రాష్ట్రంలో 1,25,000 ఎకరాల్లో 3,500కు పైగా యూనిట్ల ఏర్పాటు చేసింది. విభజన తర్వాత రాష్ట్రంలో 93 పారిశ్రామిక పార్కులను సుమారు రూ.1,708 కోట్ల వ్యయంతో అభివృద్ధి చేసింది. హైదరాబాద్ పురోగతిలో కీలకమైన హైటెక్ సిటీ నుంచి విశాఖలోని రాంకీ ఫార్మా సెజ్ వరకు అనేక ప్రాజెక్టుల నిర్మాణంలో ఏపీఐఐసీ పాత్ర కీలకం. గుంటూరు జిల్లాలో ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, విజయవాడ స్వరాజ్ మైదానంలో ఏర్పాటు చేయనున్న 125 అడుగుల బీ.ఆర్ అంబేద్కర్ విగ్రహం ప్రాజెక్టుల నిర్వహణా బాధ్యతలు కూడా ఏపీఐఐసీయే చేపట్టింది. రాష్ట్ర ప్రగతిలో కీలకంగా ఉన్న శ్రీ సిటీ, అచ్యుతాపురం, నెల్లూరు మాంబట్టు, గంగవరం పోర్టు వంటి కీలక ప్రాజెక్టులకు భూసేకరణ సహా అభివృద్ధి చేసింది ఏపీఐఐసీనే. విశాఖపట్నం- చెన్నై, చెన్నై - బెంగళూరు, హైదరాబాద్- బెంగళూరు కారిడార్లను వేల కోట్లతో అభివృద్ధి చేస్తోంది. ఒక్క విశాఖ - చెన్నై కారిడార్‌లోనే 33,000 ఎకరాలు ఉండగా, అందులో తొలుత రూ.5,000 కోట్లతో రూ.10,000 ఎకరాలను, ఆసియా డెవలప్‌మెంట్ బ్యాంకు (ఏడీబీ) సహకారంతో చెన్నై - బెంగళూరు కారిడార్‌లో మొత్తం 12,000 ఎకరాల అభివృద్ధి చేస్తుంది. ఇందులో తొలుత 2,500 ఎకరాల్లో క్రిస్ సిటీ పేరుతో పారిశ్రామిక నగరాన్ని నిర్మిస్తుంది. ఏపీఐఐసీ హైదరాబాద్ - బెంగళూరు కారిడార్‌లో కర్నూలు జిల్లా ఓర్వకల్లు వద్ద సుమారు 10,000 ఎకరాల్లో భారీ పారిశ్రామిక వాడ అభివృద్ధి పనులు చేపట్టింది. ఇవి కాకుండా వైఎస్సార్ జిల్లా కొప్పర్తి వద్ద 6,739 ఎకరాల్లో వైఎస్సార్ జగనన్న మెగా ఇండస్ట్రియల్ హబ్, 800 ఎకరాల్లో వైఎస్సార్ ఎలక్ట్రానిక్ మాన్యుఫాక్చరింగ్ క్లస్టర్, కృష్ణా జిల్లా మల్లవల్లి వద్ద మెగా ఫుడ్ పార్క్, కాకినాడ సెజ్, తిరుపతి వద్ద ఈఎంసీ 1, ఈఎంసీ 2 ప్రగతిలో ఏపీఐఐసీ వెన్నెముక. చిత్తూరు జిల్లా మన్నవరం వద్ద 225 ఎకారల్లో విద్యుత్ ఉపకరణాల తయారీ యూనిట్, కొప్పర్తి వద్ద 1,000 ఎకరాల్లో పీఎం-మిత్రా పథకం కింద టెక్స్‌టైల్ పార్కును అభివృద్ధి చేయడానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపింది. విశాఖ, అనంతపురంలలో రెండు మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కుల అభివృద్ధిపైనా ఏపీఐఐసీ దృష్టి పెట్టింది.

ఎన్టీఆర్ హంతకులదే కపట ప్రేమ: లక్ష్మీపార్వతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్టీఆర్ హంతకులకే హెల్త్ యూనివర్సిటీపై కపట ప్రేమ ఉందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందమూరి లక్ష్మీపార్వతి విమర్శించారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఎన్టీఆర్ జిల్లా అనేది పెద్దదనీ, యూనివర్సిటీ చాలా చిన్నదనీ ఆమె అభిప్రాయం వ్యక్తం చేశారు. ఎన్టీఆర్ పేరు జిల్లాకు ఉండాలా, యూనివర్సిటీకి ఉండాలా అంటే.. జిల్లాకే నా ఓటు అని ఆమె స్పష్టం చేశారు. ఎన్టీఆర్‌పై చంద్రబాబులా ద్వేషంగానీ, శత్రుత్వంగానీ సీఎం జగన్‌కు లేవన్నారు. ఎన్టీఆర్‌పై సీఎంకు గౌరవం, అభిమానం ఉన్నందునే విజయవాడ జిల్లాకు ఎన్టీఆర్ పేరు పెట్టారని పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీ సృష్టికర్త, రూపాయి వైద్యుడిగా పేరు గడించిన వైఎస్ఆర్ పేరు పెట్టడమే సముచితమని చెప్పారు. నాడు ఎన్టీఆర్‌కు భారతరత్న రాకుండా అడ్డుపడిన వారు ఆయన్ను గౌరవిస్తారా? అని ప్రశ్నించారు. ప్రతి మహానాడులో ఎన్టీఆర్‌కు భారతరత్న ఇవ్వాలని తీర్మానిస్తారని, ఆ తర్వాత దానిని చెత్తబుట్టలో వేయడం పరిపాటని పేర్కొన్నారు. ఎన్టీఆర్‌కు ద్రోహం చేసిన వాళ్లే, ఇవాళ ఆయన పేరు వాడుకుంటున్నారన్నారు. ఎన్టీఆర్ చావుకు కారణమైనందుకుగాను ఆయన బిడ్డలుగా ఇప్పటికైనా మీకు పశ్చాత్తాపం కలగదా? అని నిలదీశారు. నాడు ఎన్టీఆర్‌కు అన్యాయం చేయనంటూ చంద్రబాబు ఆయన కొడుకుపై తన వద్ద ప్రమాణం చేసి, ఆ తర్వాత మాట తప్పారని విమర్శించారు. ఎన్టీఆర్ జీవితంలోకి తాను వచ్చాకే వసంతం వచ్చిందని వివరించారు. తనపై పిచ్చి రాతలు రాస్తున్న రామోజీరావు, రాధాకృష్ణలకు జ్ఞానం ఉందా? అని మండిపడ్డారు. ఎన్టీఆర్ పేరు మార్చాలంటూ రాధాకృష్ణ ఇంటర్వ్యూలో చంద్రబాబే చెప్పారన్నారు. హెల్త్ యూనివర్సిటీకి పేరు మార్పుపై సీఎం జగన్ అసెంబ్లీలోనే సమగ్రంగా చెప్పారని గుర్తుచేశారు. 14 ఏళ్ల సీఎంగా ఉన్న చంద్రబాబు, రాష్ట్రంలో ఏదైనా శాశ్వత పథకానికి ఎన్టీఆర్ పేరు పెట్టారా? ఎన్టీఆర్‌కు వెన్నుపోటు పొడిచి, ఆయన చావుకు కారణమయ్యారన్నారు. ప్రజల దృష్టిని మరల్చడానికే నాడు రాజీవ్‌గాంధీ హెల్త్ యూనివర్సిటీగా ఉన్న దాని పేరు మార్చి అప్పటికప్పుడు ఎన్టీఆర్ పేరు పెట్టారని పేర్కొన్నారు.

సిద్ధేశ్వరం ప్రజల ఇక్కట్లు పట్టవా?

నిర్వాసితుల సమస్యలు పరిష్కరించండి

జేవీ సత్యనారాయణమూర్తి డిమాండ్

విశాలాంధ్ర-జూపాడు బంగ్లా: నంద్యాల జిల్లా సిద్ధేశ్వరం గ్రామ ప్రజల ప్రత్యేకించి చెంచుల జీవితాలు దుర్భరంగా ఉన్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి చెప్పారు. ఇక్కడ 40 చెంచుల కుటుంబాలు ఉన్నాయని, కనీసం తినడానికి తిండిలేక.. ఉండటానికి ఇళ్లు లేక చీకట్లో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని జీవిస్తున్నారని తెలిపారు. గ్రామానికి తాగునీరు, రోడ్లు, విద్యుత్, బస్సు సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. మండలంలోని పారుమంచాల మజార గ్రామమైన సిద్ధేశ్వరంలో సోమవారం సీపీఐ జిల్లా నాయకులు ఎం.రమేశ్ బాబు, మండల కార్యదర్శి వైదుద్దీన్ నాయకత్వాన సీపీఐ రాష్ట్ర నాయకుల బృందం పర్యటించింది. నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ పతాకాన్ని జేవీ సత్యనారాయణమూర్తి, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజనేయులు, నంద్యాల జిల్లా కార్యదర్శి రంగనాయుడు ఆవిష్కరించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజలు కష్టజీవులని చెప్పారు. ఇక్కడి ప్రజలకు కనీస సదుపాయాలు లేవని, అయినా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. పక్కనే పోతిరెడ్డిపాడు రెగ్యులేటర్, అలగనూరు రిజర్వాయర్ ఉన్నప్పటికీ తాగు, సాగునీరు లేక ప్రజలు, రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. ఇక్కడి చెంచులను ఐటీడీఏ పరిధిలోకి తీసుకోలేదని, సీపీఐ పోరాటం కారణంగా వారికి ఆధార్ కార్డులు లభించాయని గుర్తుచేశారు. శ్రీశైలం ముంపు ప్రాంత బాధితులను ప్రభుత్వం గాలికొదిలేసిందని ఆరోపించారు. పోతిరెడ్డిపాడు దిగువున గల అలగనూరు రిజర్వాయర్‌కు గండిపడటం వల్ల ఆ ప్రాంతానికి సాగు, తాగునీరు అందడం లేదని, తక్షణమే ఆ గండి పూడ్చి రిజర్వాయరుకు నీరు మళ్లించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టుల కోసం సర్వం కోల్పోయి 50 సంవత్సరాలు గడుస్తున్నా నిర్వాసితులకు ఇంకా మౌలిక వసతులు కల్పించడంలో పాలకవర్గాలు పూర్తిగా విఫలమయ్యాయని మండిపడ్డారు. ముంపు బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని సూచించారు. మల్యాల ఎత్తిపోతల పథకం నుంచి నందికొట్కూరు మేజర్ పంచాయతీకి సాగు, తాగునీరు అందించాలన్నారు. నిర్వాసితుల సమస్యలపై సీపీఐ నవంబరులో పోరాటం ప్రారంభిస్తుందని స్పష్టంచేశారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాబా ఫక్రుద్దీన్, రఘు రామ్మూర్తి, శ్రీనివాసులు, జిల్లా సమితి సభ్యులు ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, ధనుంజయ, ప్రజానాట్యమండలి కళాకారులు శివయ్య, నాగరాజు, వాసు, మండల నాయకులు దినేశ్ ,మహానంది, నరసింహ, శ్రీనివాసులు, ఎల్లయ్య పాల్గొన్నారు.

ఎన్టీఆర్ కీర్తి దెబ్బతీసేందుకు కుట్ర

టీడీపీ నేత నక్కా ఆనందబాబు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఎన్టీఆర్ కీర్తి ప్రతిష్ఠలను దెబ్బతీసే కుట్రలో భాగంగానే హెల్త్ వర్సిటీకి ఆయన పేరు మార్చారని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు నక్కా ఆనందబాబు విమర్శించారు. మంగళగిరి లోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, హెల్త్ యూనివర్సిటీ పేరు మార్చేందుకు సీఎం జగన్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరికాదన్నారు. ఒక మహానుభావుడు, యుగపురుషుడి పేరు మార్చి జగన్ పైశాచిక ఆనందం పొందుతున్నారని ఆరోపించారు. లక్ష్మీపార్వతి వంటి వాళ్లు శునకానందం చెందుతున్నారని పేర్కొన్నారు. వైద్య కళాశాలలపై సీఎం చాలా అసత్యాలు మాట్లాడారన్నారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 24 వైద్య కళాశాలలను తెచ్చిన ఘనత చంద్రబాబుదేనని, అందులో నాలుగు ప్రభుత్వ, 12 ప్రైవేటు వైద్య కళాశాలలు ఉన్నాయని వివరించారు. రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను నిర్మిస్తామని ప్రకటించడం హాస్యాస్పదమన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డి పార్లమెంటులో ఎన్ని ప్రభుత్వ మెడికల్ కాలేజీలున్నాయని ప్రశ్నిస్తే 2021, డిసెంబర్ 14న కేంద్రం 14 వైద్య కళాశాలలున్నాయని సమాధానమిచ్చారని గుర్తుచేశారు. ఎన్టీఆర్ పేరు మర్చడానికిగాను అసెంబ్లీలో మార్ఫింగ్ చేసిన ఫేక్ వీడియోను చూపించారని మండిపడ్డారు. ఎన్టీఆర్ పథకం ఆరోగ్యశ్రీగా మారిన విషయం ఏ స్థాయిలో వెళ్లిందనే చర్చ జరుగుతుంటే అకస్మాత్తుగా తప్పుడు కథనాన్ని లేవనెత్తారన్నారు. లక్ష్మీపార్వతి ప్రసంగించిన తీరుపై ప్రజలంతా విమర్శిస్తున్నారని పేర్కొన్నారు.

రాజా నోరు అదుపులో పెట్టుకో: మాజీ మంత్రి జవహర్

ఎన్టీఆర్‌ను కించపరుస్తూ మాట్లాడిన మంత్రి దాడిశెట్టి రాజాను నోరు అదుపులో పెట్టుకోవాలని టీడీపీ నేత, మాజీ మంత్రి కేఎస్ జవహర్ హెచ్చరించారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ, దాడిశెట్టి ఒక అజ్ఞాని అని, పేకాట ఆడటం, ఆడించడం తప్ప ఆయనకేమీ తెలియదన్నారు. చరిత్ర తెలియని మంత్రులు జగన్ మంత్రివర్గంలో ఉన్నారంటూ ఎద్దేవా చేశారు. దాడిశెట్టి మాటలను సీఎం సమర్థిస్తారా? అని ప్రశ్నించారు. నోటికి ఏదొస్తే అది మాట్లాడితే సహించబోమని, అవాకులు, చవాకులు పేలడం మానాలని దాడిశెట్టికి హితవు పలికారు.

సీఎంను కలిసిన హజ్ కమిటీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం క్యాంప్ కార్యాలయంలో సీఎం జగన్‌ను హజ్ కమిటీ సోమవారం కలిసింది. సీఎంకు హజ్ పవిత్ర జలం (జమ్ జమ్ వాటర్)ను కమిటీ చైర్మన్, ఎమ్మెల్సీలు, హజ్ కమిటీ సభ్యులు అందజేశారు. సీఎంను కలిసిన వారిలో హజ్ కమిటీ చైర్మన్ బీఎస్ గౌస్ లాజమ్, ఎమ్మెల్సీలు రుహుల్లా, ఇషాక్ బాషా, హజ్ కమిటీ సభ్యులు మునీర్ బాషా, ఇమ్రాన్, ఇబాదుల్లా, ఖాదర్, ముఫ్తిబాసిత్ పాల్గొన్నారు.

సోకిలేరులో దిగి ముగ్గురు బాలికల మృతి

విశాలాంధ్ర- చింతూరు/ చీరాల: విహారయాత్ర విషాదం గా మారి ముగ్గురు విద్యార్థి నులు అసువులు బాసిన సంఘటన అల్లూరి సీతారామ రాజు జిల్లా చింతూరు మండలం మోతు గూడెం పోలీస్ స్టేషన్ పరిధి లోని మారేడుమిల్లి ఘాట్ రోడ్‌లో సోకిలేరు వ్యూ పాయింట్ వద్ద సోమవారం జరిగింది. బాపట్ల జిల్లా వేటపాలెంలోని అనుజ్ఞ హై స్కూలులో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి బస్‌లో విహారయాత్రకు బయలుదేరి వెళ్లారు. ఉదయం పది గంటల సమయంలో విద్యార్థులంతా సోకిలేరు వాగులో దిగారు. ఉధృతికి గుమ్మడి జయశ్రీ (14), సువర్ణ కమల (14), గీతాంజలి గల్లంతయ్యారు. తోటి విద్యార్థులు రక్షించే క్రమంలో ముగ్గురూ మృతి చెందారు. సమాచారం అందుకున్న మోతుగూడెం పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృత దేహాలను వెలికితీసి పోస్ట్‌మార్టం నిమిత్తం చింతూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

జగన్ పాలనలో నిరుద్యోగులకు దగా

ఏపీ నిరుద్యోగ జేఏసీ

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సీఎం జగన్ నిరుద్యోగులను దగా చేస్తున్నారని ఏపీ నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు సమయం హేమంతకుమార్ విమర్శించారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ నిరుద్యోగ భృతి వదులుకుని జగన్‌ను కోటి 20లక్షల మంది నిరుద్యోగ కుటుంబాలు ఓట్లతో గద్దె నెక్కించాయని గుర్తుచేశారు. ఈ మూడేళ్ల పాలనలో కానిస్టేబుల్, ఎస్ఐ, డీఎస్సీ, గ్రంథాలయ ఉద్యోగాలు భర్తీ చేయలేదన్నారు. గత ప్రభుత్వం ఆర్థిక శాఖ అనుమతించిన దేవాదాయశాఖ గ్రేడ్-3లో 60 ఉద్యోగాలకు, జులై 24న జూనియర్ అసిస్టెంట్ కమ్ కంప్యూటర్ ఆపరేటర్ 670 ఉద్యోగాలకు జులై 31న ప్రాథమిక పరీక్షను 2,11495 మంది అభ్యర్థులకు నిర్వహించారు. వీటిలో ప్రధాన పరీక్షకు, ఒక ఉద్యోగానికి 50 మందిని ఎంపిక చేయాల్సింది పోగా, ఒక్క ఉద్యోగానికి 15 మందినే ఎంపిక చేశామన్నారు. ఉద్యోగ వార్షిక క్యాలెండర్ తక్షణమే ప్రకటించాలని, ఏపీపీఎస్సీ, డీఎస్సీ ఉద్యోగ వయోపరిమితిని జనరల్ అభ్యర్థులకు 47 ఏళ్లకు పెంచాలని డిమాండ్ చేశారు. అక్టోబర్ రెండో తేదీలోగా ఏపీపీఎస్సీ అన్ని ఉద్యోగాలకు ప్రధాన పరీక్ష ఎంపికకు 1:50 చొప్పున అమలు చేయాలన్నారు.

హామీల అమలులో బీజేపీ విఫలం: రవీంద్రనాథ్

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: విజయవాడలో అక్టోబరు 14 నుంచి 18 వరకు జరుగనున్న సీపీఐ 24వ జాతీయ మహాసభలను జయ ప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ కార్మికవర్గానికి పిలుపునిచ్చారు. డీఎస్ఆర్ అమర్‌భవన్‌లో ఏఐటీయూసీ విజయనగరం జిల్లా కార్యవర్గ సమావేశం ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎస్.రంగరాజు అధ్యక్షతన సోమవారం ఉదయం జరిగింది. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి బుగత అశోక్ కార్యకలాపాల నివేదిక ఇచ్చారు. ఆర్.రవీంద్రనాథ్ మాట్లాడుతూ వందరోజుల్లో ధరలు తగ్గిస్తామని, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు చేస్తామని, నిరుద్యోగ సమస్య పరిష్కరిస్తామని, ప్రతీ పేదవాడి బ్యాంకు ఖాతాలో పదిహేను లక్షల రూపాయలు డిపాజిట్ చేస్తామని ఇచ్చిన హామీని బీజేపీ అమలు చేయలేదని విమర్శించారు. గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచిందని, దీనివల్ల నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్నంటాయని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థలు, పరిశ్రమలు, ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా అమ్మి ప్రజలకు, కార్మిక కష్టజీవులకు ద్రోహం చేస్తున్నదని ధ్వజమెత్తారు. 2014లో పదిహేడు వేల కోట్ల రూపాయల ఆదాయం గల అదానీ...మోదీ ప్రభుత్వ విధానాల కారణంగా నేడు పదిన్నర లక్షల కోట్లు సంపాదించారని చెప్పారు. బ్యాంకులు, రైల్వే, టెలికాం, పోస్టల్, స్టీల్‌ప్లాంట్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేస్తూ రిజర్వేషన్లు ఎత్తివేయడానికి మోదీ సర్కారు కుట్ర పన్నుతోందని ఆరోపించారు. 44 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ అమలు చేసి కార్మికుల హక్కులను హరిస్తోందని దుయ్యబట్టారు. ప్రభుత్వ సంస్థలు, పరిశ్రమలు, ఆస్తుల పరిరక్షణకు సంబంధించి సీపీఐ జాతీయ మహాసభలు భవిష్యత్ కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తాయని వివరించారు. భవిష్యత్ ఉద్యమాలకు ఏఐటీయూసీ శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. అక్టోబరు 14న జరిగే ప్రదర్శనలో విజయనగరం జిల్లా నుంచి కార్మికులు వేలాదిగా తరలిరావాలని కోరారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, ఏపీ మధ్యాహ్న భోజన కార్మికసంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కె.స్రవంతి, ఏఐటీయూసీ జిల్లా గౌరవాధ్యక్షుడు ఎస్.రామచంద్రరావు, జిల్లా ఉపప్రధాన కార్యదర్శి మునకాల శ్రీనివాసరావు, జిల్లా కార్యదర్శులు టీవీ రమణ, టి.జీవన్, పురం అప్పారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.మురళీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు.

సీనియర్ సిటిజన్లకు ప్రాధాన్యం

విశాఖ కో-ఆపరేటివ్ బ్యాంకు ఇన్‌చార్జి చైర్మన్ భాస్కరరావు

విశాలాంధ్ర-విశాఖ: తమ బ్యాంకులో సీనియర్ సిటిజన్లకు అత్యంత ప్రాధాన్యత లభిస్తుందని విశాఖపట్నం కో ఆపరేటివ్ బ్యాంక్ ఇన్‌చార్జి చైర్మన్ గుడివాడ భాస్కరరావు, సీఈవో పీవీ నరసింహమూర్తి తెలిపారు. వాల్తేరు బ్రాంచ్‌ను సోమవారం బాబా బజార్ రోడ్డులోని నూతన ప్రాంగణంలోకి మార్చి, ఏటీఎం సేవల్ని కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పాలకవర్గ కీలక నేత మానం ఆంజనేయులు మార్గదర్శకత్వంలో, సీహెచ్ రాఘవేంద్రరావు నిర్వహణలో తమ బ్యాంకు ఎంతో పురోగతి సాధించిందన్నారు. ఇక్కడి బ్రాంచి దశాబ్ద కాలం నుంచి సేవలందిస్తోందని, రూ.133 కోట్ల డిపాజిట్లతో పాటు రూ.47 కోట్ల మేర రుణాలను అందజేసిందన్నారు. 16 వేల మంది ఖాతాదారులున్నారని, వారిలో దాదాపు 60శాతం మంది సీనియర్ సిటిజన్లేనన్నారు. లాకర్ సదుపాయంతో పాటు, ఏటీఎం కూడా ఏర్పాటు చేసినట్టు చెప్పారు. ఇక్కడ 1640 మంది షేర్ హోల్డర్లున్నారని వివరించారు. తొలుత బ్రాంచ్‌ను భాస్కర్‌రావు ప్రారంభించారు. సీనియర్ సిటిజన్స్‌కు అదనపు వడ్డీతో పాటు వయో వృద్ధులకు తమ ఇంటివద్దకే బ్యాంక్ సిబ్బంది వెళ్లి సేవలు అందించడం జరుగుతుందన్నారు. పాలకవర్గ సభ్యులు వీరఘంట చంద్రశేఖర్, కాకి భవాని, ఎస్.జానకి రామచంద్ర రాజు, ఉప్పలపాటి పార్వతీదేవి, బ్రాంచ్ మేనేజర్ డి.పావని, పి.ఎస్.ప్రకాష్, సుధీర్ బాబు, రెడ్డి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి రైతులను ఆదుకోవాలి

పత్తికొండలో ప్రదర్శన, ధర్నా

విశాలాంధ్ర - పత్తికొండ : గిట్టుబాటు ధరలేక అల్లాడుతున్న ఉల్లి రైతులను ఆదుకోవాలనీ, క్వింటాల్‌కు రూ. 4వేలు మద్దతు ధర కల్పించి ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం పత్తికొండ నియోజకవర్గ సమితి అధ్వర్యాన సోమవారం పత్తికొండలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. స్థానిక చదువుల రామయ్య భవనం నుంచి పురవీధుల గుండా ప్రదర్శన నిర్వహించి నాలుగు స్తంభాల దగ్గర ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అధ్యక్షులు పి. రామచంద్రయ్య మాట్లాడుతూ, ఉల్లి రైతులను ఆదుకోవాలనిడిమాండ్ చేశారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేసిన ఉల్లి పంటకు కనీస మద్దతు ధర లేకపోవడంతో రైతులు తమ పొలాల్లో ఉల్లి పంటను దున్నేసి, వదిలి వేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఉల్లి పంటకు ఎకరాకు 50 వేల నుంచి లక్ష రూపాయల వరకు పెట్టుబడులు పెట్టారని, ప్రభుత్వం కనీసం రైతులు పెట్టిన పెట్టు బడులైన ఇవ్వాలన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తమది రైతు ప్రభుత్వం అని గొప్పలు చెబుతున్నారని, రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించడంలో పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. హంద్రీనీవా ప్రధాన కాలువ ద్వారా పుష్కలంగా నీరు పారుతున్న పంట పొలాలకు సాగునీరు అందడం లేదని, హంద్రీనీవా కింద ఉన్న కుడి, ఎడమ కాలువల ద్వారా పంట పొలాలన్నింటికీ సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. జిల్లాలో వెనుకబడ్డ పత్తికొండ నియోజకవర్గంలో టమోటా జ్యూస్ ఫ్యాక్టరీ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ విష్ణు ప్రసాద్‌కు వినతిపత్రం సమర్పించారు. రైతు సంఘం తాలూకా కార్యదర్శి పెద్ద ఈరన్న అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి డి.రాజా సాహెబ్, తాలూకా అధ్యక్షులు కారన్న, సీపీఐ తుగ్గలి మండల కార్యదర్శి సుల్తాన్, పట్టణ కార్యదర్శి రామాంజనేయులు, ప్రజాసంఘాల నాయకులు గురుదాస్, కారుమంచి, నెట్టే కంటయ్య, రంగన్న, పెద్ద ముని, మాదన్న, పులికొండ, బొజ్జప్ప, మునిస్వామి, గిద్దయ్య గౌడ్, జోహారపురం కాశి, అల్తాఫ్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

లోన్‌యాప్ మోసగాళ్లకు సహకరిస్తున్న

కమీషన్ ఏజెంట్ అరెస్ట్



విశాలాంధ్ర-కడప క్రైం: లోన్ యాప్ మోసగాళ్లకు సహకరిస్తున్న అనంతపురం జిల్లా తాడిపత్రి పట్టణానికి చెందిన కమీషన్ ఏజెంట్ లింగుట్ల రంగనాథ్ (25)ను అరెస్టు చేసినట్లు ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. తన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ, దేవేంద్ర సిమెంట్స్‌లో మార్కెటింగ్ మేనేజర్ గా పనిచేస్తున్న చింతకొమ్మదిన్నె మండలం ఎర్రమాచుపల్లెకు చెందిన బండి సాయికుమార్ రెడ్డి "రుపీస్ క్యాష్", "రుపీస్ లోన్" అనే యాప్‌ల ద్వారా రూ. 95 వేలు కావాలని ఆన్‌లైన్ ద్వారా అప్లై చేశారన్నారు. తన ఫోన్ నెంబర్, ఆధార్, పాన్ కార్డు పొందుపర్చినట్టు చెప్పారు. కంపెనీ నార్మ్స్ ప్రకారం క్యాపిటల్ అమౌంట్ నుంచి తగ్గించి రూ.65 వేలు సాయికుమార్ రెడ్డి అకౌంట్లో క్రెడిట్ చేశారన్నారు. వివిధ తేదీలలో 52 సార్లు ఈఎంఐల రూపంలో మొత్తం రూ.3,71,952 చెల్లించారని వివరించారు. తీసుకున్న లోన్ కంటే ఎక్కువ నగదు చెల్లించి నప్పటికీ ఇంకా రూ.99 వేలు చెల్లించాలని పదేపదే సాయి కుమార్ రెడ్డికి కాల్స్ చేస్తున్నారన్నారు. డబ్బులు చెల్లించక పోతే మీ స్నేహితులకు, బంధువులకు ఫోటోలు పెడుతూ మీ పరువు తీస్తాం అని బెదిరింపులకు పాల్పడుతున్నట్టు ఎస్పీ చెప్పారు. పెద్ద ఎత్తున డబ్బు వసూలు చేస్తూ తనను మోసం చేస్తున్నారని సాయికుమార్ రెడ్డి చింతకొమ్మదిన్నె పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశామని ఎస్పీ వివరించారు.

కేసును ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అడిషనల్ ఎస్పీ తుషార్ డుడి, డీఎస్పీ బి.వెంకట శివారెడ్డి పర్యవేక్షణలో, రూరల్ సిఐ శ్రీరామ్‌శ్రీనివాస్, సైబర్ క్రైమ్స్ సిఐ శ్రీధర్ నాయుడు ఆధ్వర్యంలో రెండు టీమ్‌లుగా ఏర్పాటు చేశామన్నారు. కేసు పరిశోధనలో భాగంగా ఫిర్యాది డబ్బు చెల్లించిన యూపీఐ ఐడీలను సేకరించి, వాటి ద్వారా నిందితులు ఉపయోగించిన అకౌంట్ వివరాలు సేకరించి కేసు విచారణ చేపట్టామన్నారు. లోన్ యాప్ ల ద్వారా మోసం చేస్తున్న ప్రధాన నిందితులకు కమీషన్ ఏజెంట్ లింగుట్ల రంగనాథ్ సహకరిస్తూ, వివిధ పేర్లతో, వివిధ బ్యాంకుల్లో అకౌంట్లు ఓపెన్ చేస్తూ, ఆ అకౌంట్ల వివరాలు నిందితులకు చేర వేస్తున్నారన్నారు. అందుకు ప్రతిఫలంగా క్రెడిట్ అవుతున్న రూ.లక్షకు పదివేలు కమీషన్ తీసుకుంటున్న లింగుట్లను సోమవారం అరెస్టు చేశామన్నారు. ప్రధాన నిందితులను అరెస్టు చేసేందుకు స్పెషల్ టీం ను ఏర్పాటు చేశామని, వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని ఎస్పీ వివరించారు.

కేసును ఛేదించడంలో కృషి చేసిన రూరల్ సీ.ఐ శ్రీరాం శ్రీనివాస్, సైబర్ క్రైమ్ సీ.ఐ శ్రీధర్ నాయుడు, సైబర్ క్రైమ్ ఎస్సై మధు మల్లేశ్వర్ రెడ్డి, చింతకొమ్మదిన్నె ఎస్సై అరుణ్ రెడ్డి, పెండ్లిమర్రి ఎస్సై రాజరాజేశ్వర్ రెడ్డి, సైబర్ క్రైమ్ ఎస్సై సుభాష్ చంద్రబోస్, సిబ్బంది సాగర్ రాజేష్ సుబ్రహ్మణ్యం, తాజుద్దీన్ లను ఎస్పీ అభినందించి ప్రశంసాపత్రాలను అందజేశారు.

భారత రాజ్యాంగాన్ని కాలరాస్తున్న కేంద్రం

592వ రోజుకు ఉక్కు దీక్షలు

విశాలాంధ్ర-కూర్మన్న పాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటకమిటీ ఆధ్వర్యంలో 592వ రోజు రిలే నిరాహార దీక్షలలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రభుత్వరంగాన్ని ప్రైవేటీకరించడం అంటే బాబాసాహెబ్ డాక్టర్ అంబేద్కర్ తెచ్చిన రాజ్యాంగాన్ని కాలరాయడమేనని అన్నారు. ఈ దీక్షా శిబిరంలో పోరాట కమిటీ నాయకులు డి.ఆదినారాయణ, మంత్రి రాజశేఖర్, జె.అయోధ్య రామ్, వరసాల శ్రీనివాసరావు, గంధం వెంకటరావు, జె.రామకృష్ణ, విల్లా రామ్‌మోహన్ కుమార్, గొల్లు రామకృష్ణ నాయుడు, బొడ్డు పైడిరాజు, దొమ్మేటి అప్పారావు, బయ్యే మల్లయ్య, తవుడన్న, సీహెచ్ సన్యాసిరావు, డేవిడ్, నందికి తాతారావు మాట్లాడారు. ప్లాంట్ పరిరక్షణ విషయంలో రాజీలేని పోరాటం చేస్తామన్నారు. ప్లాంట్ ఉత్పత్తి పూర్వవైభవంలోకి వచ్చేందుకు యాజమాన్యంపై ఒత్తిడి తీసుకువచ్చి ఆ దిశగా ప్రయత్నాలు కొనసాగిస్తామన్నారు. అక్టోబర్ 2వ తేదీన విశాఖ సముద్రతీరంలో సాయంత్రం 4 గంటలకు ఉక్కు సత్యాగ్రహ పాదయాత్ర జరుగుతుందని దీనిలో కార్మిక సంఘాలు, ప్రజలు, వివిధ పరిశ్రమలో ఉన్న కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. ఈ దీక్షా శిబిరంలో బీఫ్ విభాగం నుండి, కె.బాబా ఎం.కిరణ్, ఈశ్వరరావు, నగేష్ ,వీరభద్ర రావు, కోటేశ్వరరావు, విజయ్ కుమార్, నాగేశ్వరరావు, సంతోష్ రాజు, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

సంపాదకీయం

గెహ్లాట్ కనికట్టు విద్య

రెండు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్‌లో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని నామరూపాలు లేకుండా చేసిన నేపథ్యంలో కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు నిర్వహించాల్సిన సంకల్పం అనేక అవాంతరాల పాలవుతోంది. అక్టోబరు 17న కాంగ్రెస్ అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరుగుతాయని తెలిసిన తరవాత సీనియర్ నాయకులు శశిథరూర్ పోటీకి సిద్ధమయ్యారు. ఈ ఎన్నికల్లో తటస్థంగా ఉంటానని సోనియాగాంధీ చెప్పినప్పటికీ అధిష్ఠానం తరఫున రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్‌ను రంగంలోకి దింపాలని అనుకుంటున్నారు. ఆయనకు కాంగ్రెస్ అధ్యక్షుడు కావడం సమ్మతమే కానీ, రాజస్థాన్ ముఖ్యమంత్రిగా కొనసాగాలనుకున్నారు. అయితే, రాహుల్ గాంధీ ఒకే వ్యక్తికి ఒకే పదవి అని ప్రకటించడంతో జోడు పదవుల్లో కొనసాగడానికి గెహ్లోట్ తన మద్దతుదారులు అయిన శాసనసభ్యులను పరోక్షంగా రంగంలోకి దించారు. ఆదివారం కాంగ్రెస్ అధిష్ఠానం తరఫున రాజస్థాన్ రాజధాని జైపూర్ వెళ్లిన సీనియర్ నాయకులు మల్లికార్జున ఖర్గే, అజయ్ మకెన్‌లకు అవరోధం ఎదురైంది. గెహ్లోట్‌కు మద్దతు ఇస్తున్న 92మంది శాసన సభ్యులు ఆదివారం సాయంత్రం ఖర్గే, మకెన్ ఏర్పాటు చేసిన శాసనసభా పక్షం సమావేశానికి హాజరుకాలేదు. వారు శాసనసభ స్పీకర్ సీపీ జోషీ దగ్గరకు వెళ్లి తమ రాజీనామా లేఖలు అందజేశారు. వీటిని స్పీకర్ ఆమోదించలేదు. కానీ, గెహ్లోట్ స్థానంలో సచిన్ పైలెట్‌ను ముఖ్య మంత్రి స్థానంలో కూర్చోబెట్టాలన్న అధిష్ఠానం ఆలోచనకు ఎదురుదెబ్బ తగిలింది. ఇది ఊహించని పరిణామం. గెహ్లోట్‌కు సచిన్ పైలెట్‌కు మధ్య ఎప్పటి నుంచో ఉప్పు–నిప్పు సంబంధమే ఉంది. ఎట్టి పరిస్థితుల్లోను సచిన్ పైలెట్ ముఖ్యమంత్రి కాకూడదన్నది గెహ్లోట్ ఎత్తుగడ. ఇలాంటి వ్యక్తిని నమ్మి కాంగ్రెస్ అధ్యక్ష స్థానం అప్పగించకూడదని కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు సోనియాగాంధీని గట్టిగా కోరారు. గెహ్లోట్ దక్షత గల రాజకీయ నాయకుడే. అయినా ఆయన మదిలో మెదిలే ఆలోచనలను పసిగట్టడం సులభం కాదు. జోడు పదవులమీద ఆశ కొద్దీ ఆయన తనకు మద్దతు ఇచ్చే శాసనసభ్యులను లోపాయకారీగా ఉసిగొల్పి ఏమీ ఎరగనట్టు నటించారు. గెహ్లోట్ తండ్రి కనకట్టు విద్య (మేజిక్)లో నేర్పరి. చిన్నప్పుడు గెహ్లోట్ తండ్రితో కలిసి ఈ మ్యాజిక్ ప్రదర్శనల్లో పాల్గొన్నారు కూడా. ఆ విద్యనే ఇప్పుడు ఆయన ప్రదర్శించారు. దీనితో ఖంగుతినడం అధిష్ఠానం వంతైంది. విధిలేక అధిష్ఠానం ప్రత్యామ్నాయ అభ్యర్థుల కోసం అన్వేషణ ప్రారంభించక తప్పని పరిస్థితి ఏర్పడింది. దిగ్విజయ్ సింగ్, ముకుల్ వాస్నిక్‌లాంటి వారి పేర్లు పరిశీలనలో ఉన్నాయంటున్నారు. నిజానికి సీనియర్ నాయకుడు దిగ్విజయ్ సింగ్‌కు కాంగ్రెస్ అధ్యక్ష స్థానం మీద మక్కువ లేకపోలేదు. ఇటీవల పత్రికల వారితో మాట్లాడుతూ తానూ పోటీ పడతానని చెప్పలేదు కానీ, పోటీ చేయడానికి ఏ మాత్రం విముఖత చూపలేదు. పైగా ఆయన చాలా కాలం నుంచి ఇందిరాగాంధీ కుటుంబానికి విశ్వాసపాత్రుడిగానే మసలుకున్నారు. ముఖ్యమంత్రి పదవిలో ఉన్నప్పుడే కాకుండా కాంగ్రెస్ వ్యవహారాలు చక్కబెట్టవలసి వచ్చిన సందర్భాల్లోనూ అధిష్ఠానం ఇష్టాఇష్టాలకు అనుగుణంగానే మెదిలారు.

మూడేళ్లుగా సోనియాగాంధీ తాత్కాలిక అధ్యక్షురాలిగా కొనసాగుతున్నారు. 2019 ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఘోర పరాజయం ఎదురైన తరవాత రాహుల్ గాంధీ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఆయన గత 7వ తేదీన భారత్ జోడో యాత్ర ప్రారంభించిన తరవాతే 11 రాష్ట్రాల కాంగ్రెస్ కమిటీలు రాహుల్ గాంధీ మళ్లీ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాలని తీర్మానాలు ఆమోదించినా, రాహుల్ మనసు మార్చుకోలేదు. పైగా కొంతకాలం నుంచి కాంగ్రెస్ సీనియర్ నాయకులే సోనియా గాంధీ కుటుంబానికి చెందనివారు కాంగ్రెస్ అధ్యక్షులుగా ఉండాలని గట్టిగానే కోరారు. రాహుల్ సంసిద్ధంగా లేకపోవడం, సోనియా గాంధీ ఆరోగ్యం అంతంతమాత్రం కావడంతో అధ్యక్ష స్థానానికి ఎన్నికలు జరిపి, తామూ అంతర్గత ప్రజాస్వామ్యానికి విలువ ఇస్తామని సోనియా గాంధీ కుటుంబం చాటిచెప్పదలచుకుంది. అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ధ్వంసం చేయడం సులభమే కానీ, పునరుద్ధరించడం అంత సులువైన పని కాదని, ఇప్పుడు కాంగ్రెస్ అధిష్ఠానానికి తెలిసొచ్చింది. పార్లమెంటరీ ప్రజాస్వామ్యంలో కచ్చితమైన ప్రజాస్వామ్య పద్ధతులను అనుసరించడం చాలా ప్రధానం. కానీ, మనం అనుసరిస్తున్న పార్లమెంటరీ ప్రజాస్వామ్యం రాజకీయ పార్టీల మీద ఆధారపడింది. అలాంటప్పుడు రాజకీయాల్లో కీలక పాత్ర పోషించే రాజకీయ పార్టీలలో అంతర్గత ప్రజాస్వామ్యం కొరవడితే మొత్తం ప్రజాస్వామ్య వ్యవస్థమీదే ఆ దుష్ప్రభావం పడితీరుతుంది. కాంగ్రెస్ బలహీన పడడానికి అంతర్గత ప్రజాస్వామ్యం లోపించడం ఒక్కటే కారణం కాకపోవచ్చు. ఆ మాటకొస్తే, మనకున్న అనేకానేక రాజకీయ పార్టీలు అంతర్గత ప్రజాస్వామ్యానికి ఇస్తున్న ప్రాధాన్యం నామమాత్రమైందే. 'దమ్ముంటే సోనియా కుటుంబానికి చెందని వారిని కాంగ్రెస్ అధ్యక్షులుగా ఎన్నుకుని చూపించండి' అని ప్రధానమంత్రి మోదీ ఇటీవలే సవాల్ విసిరారు. అక్కడికి బీజేపీలో అంతర్గత ప్రజాస్వామ్యం మూడు పువ్వులు, ఆరు కాయలుగా విరిజిల్లుతోందని కాదు. మోదీ ఎప్పుడూ కాంగ్రెస్ వంశపారంపర్య పాలనను కొనసాగిస్తుందని దెప్పిపొడుస్తుంటారు. బీజేపీలో కూడా వంశ పారంపర్య పాలనకు తక్కువ ఏమీ లేదు. ప్రాంతీయ పార్టీల్లో అనేకం ఆ పార్టీలను నెలకొల్పిన నేతల కుటుంబం గుప్పెట్లో ఉన్నవే. ఈ విషయంలో చాలా పార్టీలది గురవింద తత్వమే. పీవీ నరసింహారావు ప్రధానమంత్రిగా ఉన్నప్పుడు తిరుపతిలో ఏఐసీసీ సమావేశంలో ఎన్నికల నిర్వహణ అనే తంతు జరగక పోలేదు. కానీ, తనతో పాటు ప్రధానమంత్రి పదవికి పోటీదారులు అనుకున్న శరద్ పవార్, నారాయణదత్ తివారీ, అర్జున్ సింగ్ కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైతే పీవీ వారిచేత రాజీనామా చేయించారు. మళ్లీ తానే ఈ ముగ్గురినీ వర్కింగ్ కమిటీ సభ్యులుగా నామినేట్ చేసి, తన ఆధిపత్యం చాటుకున్నారు. కాంగ్రెస్‌ను తమ జేబు సంస్థగా దిగజార్చిన ఘనత నిస్సందేహంగా ఇందిరాగాంధీదే. అదే విధానాన్ని రాజీవ్‌గాంధీ కూడా కొనసాగించారు. సోనియా కాంగ్రెస్ అధ్యక్షురాలు అయిన తరువాత ఆమే సర్వాధికారి. ఈ ఏకపక్ష ధోరణిని ఇప్పటికైనా విరమించాలన్న ఆలోచన కాంగ్రెస్‌కు రావడం హర్షించదగింది. అనుకున్న సమయంలో గెహ్లోట్ అత్యాశ ఆ ప్రక్రియను అపహాస్యంపాలు చేసింది. అధ్యక్ష స్థానానికి నామినేషన్‌ల గడువు ముగియడానికి ఇంకా మూడు రోజుల సమయం ఉంది. ఆలోగా సొంత ఇంటిని చక్కబెట్టుకోకపోతే కాంగ్రెస్ నవ్వులపాలు కాకతప్పదు. అతిపెద్ద ప్రతిపక్ష పార్టీ అయిన కాంగ్రెస్ ఇతర పార్టీలకు ఆదర్శప్రాయంగా మెలగడం అలవాటు చేసుకోవడం ఒక్కటే మార్గం.



ప్రజల భాగస్వామ్యంతోనే పర్యాటక అభివృద్ధి

డా యం.విరూపాక్షరెడ్డి

అంతర్జాతీయ శాంతి సోదర సంబంధాలను కొనసాగించడానికి పర్యాటకం ఉత్తమ మార్గం. ప్రపంచ స్థాయిలో ఒకరి సంస్కృతిని ప్రతిబింబించడంలో పర్యాటకం కీలక పాత్ర పోషిస్తుంది. యునైటెడ్ నేషన్స్ వరల్డ్ టూరిజం ఆర్గనైజేషన్ 1980 నుండి సెప్టెంబర్ 27న ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని జరుపుకుంటోంది. పర్యాటక ప్రాముఖ్యత ఆదరణ దృష్ట్యా ప్రపంచ పర్యాటక దినోత్సవం ప్రారంభించబడిందని ఈ రోజును జరుపుకోవడం ఉద్దేశ్యం పర్యాటకం గురించి ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కలిగించడమే. ప్రజలను చైతన్యపరచటానికి, ఐక్యరాజ్యసమితి ప్రపంచ పర్యాటక సంస్థ ప్రతి సంవత్సరం ప్రపంచ పర్యాటక దినోత్సవం థీమ్‌ను విభిన్నంగా ఉంచుతుంది.

కోట్లాది మంది ప్రజల జీవనోపాధి టూరిజంపై ఆధారపడి ఉంది. దేశంలో కులాల మధ్య మతాల మధ్య సామరస్యత పెంపొందించేందుకు మనుషులందరూ ఒక్కటే అనే భావన కలిగించేందుకు టూరిజం దే ఉపయోగపడుతుంది. సోదర సంబంధాన్ని కొనసాగించడానికి, దేశ సమగ్రత తెలియజేయడానికి, స్థానిక జీవన విధానాన్ని ప్రపంచానికి తెలియజేయడానికి ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పాటిస్తాము. ఇది దేశంలోని ప్రతి ప్రాంతంలో విధిగా నిర్వహించే ఒక రోజు కార్యక్రమం. ఈ దినోత్సవం ప్రధాన లక్ష్యం పర్యాటక రంగంపై అవగాహన పెంచడం. ఇది ప్రపంచ వ్యాప్తంగా సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ విలువలను ఎలా ప్రభావితం చేస్తుందో ప్రజలకు బోధిస్తుంది. టూరిజం ప్రాముఖ్యతను గుర్తు చేసుకునే రోజు. పర్యాటక అభివృద్ధిపై దృష్టి పెట్టి చారిత్రక కోటలు, కట్టడాలు, అద్భుత శిలా ఖండాలు, ప్రదేశాల ప్రాముఖ్యత బహుళ ప్రాచుర్యం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నిర్మాణ రంగంలో భారీ మార్పులు వచ్చినా, శత్రు దుర్భేద్యమైన కట్టడాలు, చారిత్రక కట్టడాలు ఈ తరం ప్రజలు, పాలకులు ఎలాగూ కట్టలేరు వీటి పరిరక్షణకు పూనుకోవాలి. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతంలో లైవ్ ఫోర్ట్స్ తలపిస్తున్న గుత్తికోట, పెనుకొండ కోట, రత్నగిరి కోట, సిద్ధవటం కోట, గండి కోట, రాయదుర్గం కోట అలాగే ప్రముఖ దేవాలయాలైన లేపాక్షి, తాడిపత్రిలో వెలసిన బుగ్గ రామలింగేశ్వర స్వామి గుడి, చింతల వెంకటరమణ స్వామి గుడి, పశుపతినాథ్ దేవాలయం, ఆదిమ మానవుడు గీసిన చిత్రాలు. జీవ వైవిధ్యం, వృక్ష సంరక్షణ చాటి చెప్పే తిమ్మమ్మ మర్రిమాను. సామాజిక శాస్త్రాల్లో స్థానిక అంశాలు చోటు కల్పించాలి. తమ ప్రాంత నాగరికత, చరిత్ర, ప్రజల జీవన శైలి, ఆహార అలవాట్లు, సంప్రదాయం కట్టుబాట్లు గురించి తెలుసుకునే అవకాశం ఉంది. పాఠ్యాంశాలలో చొప్పిస్తే పిల్లలకు తమ ప్రాంతం గొప్పతనం గురించి తెలుస్తుంది. అలాగే ఈ ప్రాంతాలను సందర్శించడానికి హెరిటేజ్ వాక్, స్థానిక పర్యాటక వలయాలు రూపొందించుకొని పిల్లలకు విధిగా చూపించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పర్యాటక దినోత్సవం ప్రజల పండుగగా జరుపుకోవాలి. అలాగే కేవలం దినోత్సవాలకే పరిమితం కాకుండా వీటి అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించి భావి తరాలకు అందించే ప్రయత్నం చేయాలి.

వ్యాస రచయిత అనంత పురాతన కట్టడాల పరిరక్షణ కమిటీ అధ్యక్షులు

భారత్‌ను ఐక్యంగా ఉంచేది ఏది!

రామ్ పునియాని

అతల్ బిహారీ వాజ్‌పేయి మాజీ సహాయకుడు సుధీంద్ర కులకర్ణి 'భారత్ జోడో (ఐక్యత) కోసం ప్రయత్నం' శీర్షికతో ఈ నెల 12వ తేదీన ఒక వ్యాసం రాశారు. ఒక వైపున ఈ యాత్రను స్వాగతిస్తూనే మరోవైపున ఇది హిందూ మత ప్రాతిపదికన జరుగుతున్నది కానందున ఈ యాత్ర సంక్లిష్టమైనదన్నారు. ఆయన ఉద్దేశంలో భారతీయ ఐక్యతకు ప్రాతిపదిక హిందూ మతం. ఇదే విషయాన్ని ప్రచారం చేస్తున్న ఆర్‌ఎస్‌ఎస్‌నూ ఆయన పొగడ్తలతో ముంచెత్తారు.

స్వామి వివేకానంద దృష్టిలో 'భారత్ జోడో' కు మూలం ఆధ్యాత్మికవాదమేనని, ఇందులో ప్రధానమైనది హిందూయిజమని కులకర్ణి వక్కాణించారు. వివేకానందుడు సూత్రీకరించిన భారత్‌లో ప్రధానమైన అంశం 'భారత్ భౌతికంగా ఇస్లాంపరమైనది, దాని బుద్ధి (మనస్సు) వేదాంతికం' అన్న విషయాన్ని కులకర్ణి మర్చిపోయినట్టున్నారు. అసలు భారతదేశం 'మతాల వైవిధ్యత' పునాదుల మీదే ఏర్పడింది. భారతీయ రూపురేఖల్లోనే ఇది అంతర్లీనంగా ఇమిడిపోయింది. కుల వ్యవస్థ పోవాలి, దారిద్ర్యం సమసిపోవాలి (ఆయన దరిద్ర నారాయణులు అనేవారు) అనేది వివేకానందుని బలమైన వాంఛ. కులకర్ణి ఈ విషయాన్ని కూడా వదిలేశారు పాపం.

కులకర్ణి ఈ వ్యాసమంతా తప్పుడు విషయాలనే రాసుకొచ్చారు. భారత్ ఐక్యత, పునరుజ్జీవనం కోసం సంస్కృతి, ఆధ్యాత్మికతను ప్రజల్లోకి తీసుకెళ్ళేందుకు ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారక్‌లు, స్వయం సేవక్‌లు చెమటోడుస్తున్నారట. ఈ విషయంలో కాంగ్రెస్ నాయకులను మించి పాటుపడ్తున్నారట. అసలు భారతీయ సాంస్కృతిక, ఆధ్యాత్మిక వనరులు ఏంటి? మనం అవలోకించాల్సిన అవసరం ఉంది. ఇస్లాం, క్రిస్టియానిటీలను ఆర్‌ఎస్‌ఎస్ విదేశీ మతాలని చెబుతోంది. భారతీయ ఆధ్యాత్మికతకు నిలువెత్తు స్వరూపంగా చెప్పుకునే గాంధీ చెబుతున్న దానికి ఇది పూర్తి వ్యతిరేకం. భారతీయ సంస్కృతి, వారసత్వం పునాదుల గురించి గాంధీ మాటల్లోనే చెప్పాలంటే "నా జీవితమంతా ఎవరికోసమైతే పని చేశానో ఆ భారతదేశంలోని ప్రతి ఒక్కరూ వారి మతమేదైనప్పటికీ సమాన హోదా ఉండాలి. దేశం మొత్తం సంపూర్ణంగా లౌకికదేశం కావాలి", "మతం జాతీయతకు అడ్డు కాకూడదు. ఇది మనిషికి, దేవుడికి మధ్య ఉండే వ్యక్తిగతమైన విషయం", "ఎవరికైనా మతమనేది వ్యక్తిగతమైన వ్యవహారం. దీనిని రాజకీయాలు లేదా జాతీయ వ్యవహారాలతో ముడిపెట్టరాదు" (హరిజన్ ఆగస్టు 31, 1947). "క్రిస్టియానిటీ, జుడాయిజం, హిందూయిజం, దాని అనుబంధ శాఖలు, ఇస్లాం, జొరాస్ట్రియనిజం భారత్‌లో ఉన్న విశ్వాసాలు" (గాంధీ కలెక్టెడ్ వర్క్స్, వాల్యూమ్ ఎక్స్‌ఎల్‌విఐ పేజీ 27-28).

భారతీయుల మెజారిటీ గురించి చెప్పడంలో వివేకానందుడు, గాంధీ విజన్‌లకు ఆర్‌ఎస్‌ఎస్ విజన్ (దృష్టి) ఏ కోణంలో చూసినా పూర్తి భిన్నంగా ఉంటుంది. భారతీయ పునరుజ్జీవనాన్ని చూస్తే ఇది స్వాతంత్రోద్యమంతో పాటు సమాంతరంగా నడిచింది. జ్యోతిరావు పూలే, సావిత్రిభాయి పూలే మొదలుకొని



అంబేద్కర్ వరకు సామాజిక సంస్కరణల క్రమం నిరంతరంగా కొనసాగింది. అంటరానితనానికి వ్యతిరేకంగా 1933లో గాంధీ చేసిన యాత్ర భారతీయ పునరుజ్జీవన క్రమంలో అత్యంత ప్రధానమైంది. భారతీయ పునరుజ్జీవనంలో అత్యంత కీలకమైన ఈ కాలం గురించి 'మనుస్మృతి చట్టంగా అమలు జరిగిన గతించిన ఆ కాలం బంగారం" అంటూ ఆర్‌ఎస్‌ఎస్, వారి కార్యకర్తలు కీర్తిగానం చేస్తున్నారు. ఇందుకు ప్రధాన కారణం వారు సుదీర్ఘ కాలంగా భారత రాజ్యాంగాన్ని వ్యతిరేకిస్తూనే ఉన్నారు.

స్వాతంత్రోద్యమ కాలంలో అంకురించిన లౌకిక విలువలు, భారత రాజ్యాంగ అమలులో కాంగ్రెస్ పార్టీ ఎన్నో తప్పులు చేసిందన్న కులకర్ణి అభిప్రాయాన్ని మాత్రం ఒప్పుకోవాలి. హిందువుల ప్రయోజనాలను విస్మరిస్తున్నారని వారు ఇప్పటికీ చేస్తున్న ప్రచారం సత్యదూరం. హిందువులతో సహా అన్ని వర్గాల ప్రజల పురోగతికి పారిశ్రామికీకరణ, ఇరిగేషన్, విద్య, పరిశోధనా సంస్థల ఉన్నతి కీలకమైనవి. హిందువుల ప్రయోజనాలను విస్మరించారని కులకర్ణి చెప్పడం బహుశా రామాలయం, పవిత్ర గోవు, లవ్ జీహాద్ అంశాలను కాంగ్రెస్ పట్టించుకోకపోవడం గురించేమో. హిందువులను తీవ్ర ఆందోళనకు గురి చేస్తున్న అంశాలుగా ఆర్‌ఎస్‌ఎస్, వారి అనుచరులు ప్రచారం చేస్తున్న అంశాలు ఇవేగా. స్వాతంత్రోద్యమ కాలంలో ఎన్నో వ్యథలకోర్చి ఒక్కటిగా రూపుదిద్దుకున్న సోదర భావాన్ని, సామరస్యాన్ని ఈ అంశాలు విచ్ఛిన్నం చేస్తున్నాయి. అన్ని మతాలవారూ కలిసి రూపొందించిన ప్రాతినిధ్య పత్రమైన మన రాజ్యాంగమే మన లౌకిక విధానాలకు గొప్ప వ్యక్తీకరణ. ఫలానా మతం ఆధ్యాత్మికత భారతీయ లౌకిక వాదానికి ప్రాతిపదిక అని చెప్పడానికి లేదు.

ముస్లింలు ఇస్లాంకు చెబుతున్న ప్రత్యేక భాష్యం, జాత్యహంకారం, లౌకిక వాద వ్యతిరేకతను కాంగ్రెస్ తన ఓటు బ్యాంకు రాజకీయాల కోసం వ్యతిరేకించడం లేదని కులకర్ణి ఆరోపించారు. ఇక్కడ ఆయన వికృత వాదన చేస్తున్నారు. ముస్లింల్లో ఒక వర్గం ఇస్లాంకు ప్రత్యేకతను ఆపాదిస్తున్నట్టే హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్‌లు కూడా హిందూయిజానికి వేర్పాటువాదనను వినిపిస్తున్నారు. పాకిస్తాన్‌లో ఇస్లాంకు ముస్లిం లీగ్ ఎలా అయితే ప్రత్యేకతను చూపిస్తోందో అలాగే హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్ కూడా హిందూ దేశం, హిందూ జాతి అంటూ హిందూయిజాన్ని ప్రత్యేకంగా ప్రచారం చేస్తున్నాయి.

హిందూయిజం ప్రత్యేక వాదనను మెజారిటీ హిందువులు అంగీకరించని విధంగానే ఇస్లాం ప్రత్యేక వాదనకు, ముస్లిం లీగ్‌కు మెజారిటీ ముస్లింలు మద్దతు నివ్వలేదనే విషయాన్ని మనం గుర్తించాల్సిన అవసరం ఉంది. దేశ విభజన డిమాండ్‌ను, పాకిస్తాన్‌ను అల్లాబక్ష్ సుమ్రో నేతృత్వంలోని ఆల్ ఇండియా ఆజాద్ ముస్లిం కాన్ఫరెన్స్, ఆల్ ఇండియా మొమిన్ కాన్ఫరెన్స్‌లు ఎలా వ్యతిరేకించాయో కులకర్ణి లాంటి వారు తెలుసుకోవాలి. ఇవి మెజారిటీ ముస్లింలకు ప్రాతినిధ్యం వహిస్తున్న సంస్థలు. జాతీయోద్యమానికి మెజారిటీ హిందువులు గొప్ప మద్దతునిచ్చారు. కానీ హిందూ దేశ భావనకు వారు మద్దతునివ్వలేదు.

కాంగ్రెస్‌లోనూ మౌలానా ఆజాద్, ఖాన్ అబ్దుల్ గఫార్ ఖాన్ లాంటి ఉద్దండులు, ఇతర అనేకమంది ముస్లిం నాయకులు ముస్లిం లీగ్ రాజకీయాలను, విభజన డిమాండ్‌కు వ్యతిరేకంగా నిలబడ్డారు. 'విభజించి పాలించు' అనే బ్రిటిష్ విధానం వల్ల 'భారత్ టోడో' (భారతదేశ విభజన) అనే బాధాకరమైన ఘటన జరిగింది. హిందూ మహాసభ, ఆర్‌ఎస్‌ఎస్‌లు చెబుతున్న హిందూ వేర్పాటువాదాన్ని (మనది హిందూ దేశం), ముస్లిం లీగ్ తీసుకొచ్చిన ముస్లిం వేర్పాటువాదాన్ని గాంధీ, మౌలానా ఆజాద్‌లు గట్టిగా వ్యతిరేకించారు.

'నియంత అరాచక పాలన' నుండి మనం ముప్పుని ఎదుర్కొంటున్నాం అని కులకర్ణి చెప్పదలుచుకున్నట్లయితే ఆయన ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఆర్‌ఎస్‌ఎస్ ప్రచారం చేస్తున్న వర్గ జాతీయవాదం హద్దు మీరి అరాచకవాదం ప్రబలుతుందన్నదే ఆ విషయం. ముస్లింల్లో సంస్కరణల గురించీ కులకర్ణి ప్రస్తావించారు. హిందువులు హిందూ కోడ్ బిల్లును యథాతథ రూపంలో అనుసరించినట్లయితే ఇతరులూ ఇదే అనుసరిస్తారు. ఈ పరిస్థితుల్లో జరిగే హింస, వివక్షకు ఎక్కువగా బలవుతున్నవారు మైనారిటీలే. సంస్కరణలే క్లిష్టంగా మారుతున్నాయి. ముస్లింల (బిల్కిస్ బానో) హంతకులకు, లైంగిక దాడులకు పాల్పడుతున్నవారికి దండలు వేయడం, మిఠాయిలు ఇవ్వడం జరుగుతున్న నేపథ్యంలో ముస్లింల్లో సంస్కరణలను ఎలా తీసుకురావాలన్న అంశంపై మనం కూడా ఒకసారి ఆలోచించాలి కదా!

భారతీయ లౌకికవాదానికి కీలకమని కులకర్ణి చెబుతున్న హిందూ ఆధ్యాత్మికతను ప్రచారం చేయడం ద్వారా సోదరభావం, సామరస్యత పెరగదు. భారత స్వాతంత్రోద్యమంలో పునాదులు పడిన భిన్నత్వంలో ఏకత్వం వల్లే మనం ఐక్యంగా ఉంటాం. దీనినే బహు సుందరంగా నెహ్రూ చెప్పిన 'గంగా జమున తహజీబ్ (సంస్కృతి)'నే మనం ఒక్కటిగా ఉంచుతుంది. కబీర్, నిజాముద్దీన్ ఔలియా లాంటి వారు చేసిన బోధనలు మన అందరి బంధాన్ని గట్టిగా ముడేస్తాయి. భారత్ జోడో కోసం మన ప్రయత్నాలకు గాంధీ, మౌలానా ఆజాద్ లాంటి వారి మార్గదర్శకత్వం అవసరం.

ఐ-మెయిల్

పాపము శమించు గాక!

హైదరాబాద్ మహానగరంలో సాహిత్య సాంస్కృతిక కార్యకలాపాలు నిర్వహించడానికి నిర్మించిన భవనానికి రవీంద్ర భారతి అని పేరు పెట్టినప్పుడు గురజాడ లాంటి ఆధునిక తెలుగుజాతి వైతాళికుని పేరు పెట్టి ఉంటే బాగుండేది అని శ్రీశ్రీ లాంటి వారు అన్నారు. అంతేకాదు హైదరాబాద్‌లో ఒకప్పుడు ఫతే మైదాన్‌గా పేరు పొందిన ఆటల స్థలానికి లాల్ బహదూర్ స్టేడియం అని పేరు పెట్టినప్పుడు కూడా క్రీడాస్థలాలకు కోడి రామ్మూర్తినాయుడు లాంటి జగజ్జెట్టి పేరు పెడితే అర్థవంతంగా ఉంటుంది కదా అని కూడా శ్రీశ్రీయే అన్నారు.

తెలుగు నాట ఒక వైద్య విశ్వవిద్యాలయాన్ని ఏర్పాటు చేసిన ఆనాటి ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు దానికి యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ అని పేరు పెట్టారు. దాని వరకు ఆ పేరు అర్థవంతంగానే ఉంది. దానికి వ్యక్తుల పేర్లు పెట్టాలనే నిర్ణయం వచ్చినప్పుడు ఆ రంగంలో గుర్తు రావలసిన మొదటి పేరు డాక్టర్ ఎల్లాప్రగడ సుబ్బారావు. అనేకానేక రోగాల బారి నుండి ప్రపంచ ప్రజానీకాన్ని కాపాడిన మహనీయులలో మన తెలుగువాడైన ఎల్లాప్రగడ సుబ్బారావు ఒకరని వైద్య రంగంతో పరిచయమున్న ప్రతివారికీ తెలుసు. జాతి ఔన్నత్యాన్ని



నిలపటం కంటే తాత్కాలిక ఓట్ల సీట్ల రాజకీయ ప్రయోజనాలు ముఖ్యమైపోయిన క్షీణ యుగంలో విశాల దృష్టిని అలవర్చుకోలేని నాయకులు వస్తారు. తమ ప్రయోజనాలకు అనువైన పేర్లు పెడతారు. కాలక్రమంలో అవి ఆ పేరుతో చలామణి అవుతూ ఉంటాయి. విలువల పతనం పెరుగు తున్న కొద్దీ వెర్రిమొర్రితనాలు ఇంకా పెరుగుతూ ఉంటాయి. అలవాటు పడిన ఆ పేరు కూడా తొలగించి సిగ్గుఎగ్గులు కూడా మరచి తమ పేర్లే పెట్టుకోవడం మొదలు పెడతారు. చరిత్రలో నిలిచిన వారు వందలలో ఉంటే చెత్త బుట్టలో పడిపోయిన వారు లక్షలలో ఉన్నారని వారికి తెలియదు. త్రిపురనేని గోపీచంద్ రాసిన అసమర్థుని జీవయాత్ర నవలలో సీతారామారావుకి రామయ్య తాత చెప్పినట్లు, అవి పోగాలము దాపురించిన వారి లక్షణాలని వారికి తెలిపేవారు కూడా ఉండరు. పాపము శమించు గాక!

దివికుమార్

రగిలే విప్లవ జ్వాల భగత్‌సింగ్

యండి. ఉస్మాన్ ఖాన్

ఆంగ్లేయుల బానిసత్వం నుండి భారత దేశాన్ని విముక్తం చేయడానికి, అనేక మంది త్యాగమూర్తులు తమ తమ పద్ధతుల్లో పోరాటం కొనసాగించారు. గాంధీజీ లాంటివారు అహింసా మార్గమే శరణ్యమంటే, మరి కొందరు శాంతి సూత్రాలతో స్వాతంత్ర్యం సిద్ధించదని ఆయనతో విభేదించారు. స్వాతంత్ర్య సమరంలో విప్లవ జ్వాలలు రగిల్చిన వీరయోధుడు షహీద్ భగత్ సింగ్. మొదట గాంధీజీ ప్రసంగాలకు ఆకర్షితుడై స్వాతంత్ర్య ఉద్యమంలోకి దూకాడు. సహాయ నిరాకరణ ఉద్యమంలోనూ చురుగ్గా పాల్గొన్నాడు. విదేశీ వస్తువుల్ని తగల బెట్టాడు. సహాయ నిరాకరణ ఉద్యమం ఉధృతంగా సాగుతున్న సమయంలో చౌరీ చౌరా దగ్గర హింస చోటుకుంది. దీంతో గాంధీజీ మనస్తాపం చెంది, ఉద్యమాన్ని విరమించుకొని ప్రభుత్వానికి లొంగిపోయారు. ఇది భగత్ సింగ్ కు ఏమాత్రం నచ్చలేదు. దీంతో గాంధీజీ అహింసా విధానంతో తీవ్రంగా విభేదించి, సామ్యవాదం వైపు మొగ్గు చూపాడు. అతిచిన్న వయసులోనే దేశంకోసం ఉరితాడును ముద్దాడిన భగత్ సింగ్, పంజాబ్ రాష్ట్రంలోని ఖత్కర్ కలాన్ గ్రామంలో 1907, సెప్టెంబర్ 28 న జన్మించాడు. సర్దార్ కిషన్ సింగ్, విద్యావతి తల్లిదండ్రులు. స్వామి దయానంద సరస్వతి అనుచరుడైన తన తాత అర్జున్ సింగ్ ప్రేరణతో చిన్నప్పుడే దేశభక్తిని పుణికి పుచ్చుకున్నాడు. భగత్ సింగ్ ప్రాథమిక విద్య స్థానిక ఆంగ్లో వేదిక పాఠశాలలో, ఉన్నత విద్య లాహోర్ నేషనల్ కళాశాలలో సాగింది. భగత్ సింగ్‌కు మూడేళ్ళ వయసున్నప్పుడు ఒకసారి తండ్రి అతణ్ణి ఎత్తుకొని తన మిత్రుని తోటకు వెళ్ళాడట. భగత్ తోటలో ఆడుకుంటూ, గడ్డి పరకల్ని నాటడం మొదలు పెట్టాడు. అది చూసి ముచ్చట పడిన తండ్రి, 'ఏంచేస్తున్నావు నాన్నా.. ' అని అడిగాడట ప్రేమగా.. వెంటనే చిన్నారి భగత్, 'తుపాకీ మొక్కలు నాటుతున్నా నాన్నా.. ఇవి పెరిగి చాలా తుపాకులు కాస్తాయి. నేను వాటితో ఆంగ్లేయుల్ని కాల్చి పడేసి మన దేశాన్ని విముక్తి చేస్తా..' అని తల ఎత్తకుండానే వచ్చీరాని మాటలతో సమాధానం చెప్పాడట. దీంతో ఒక్కసారిగా అవాక్కయిన తండ్రి, తేరుకొని కొడుకుని గుండెలకు హత్తుకున్నాడు. ఇది చూసిన కిషన్ సింగ్ మిత్రుడు కొన్ని నిమిషాల పాటు అలాగే ఆగకుండా తప్పట్లు కొట్టాడట. భగత్ పదమూడేళ్ళ పిల్లవాడిగా ఉన్నప్పుడు జలియన్ వాలా బాగ్ ఉదంతం చోటుచేసుకుంది. అంతచిన్న వయసులోనే ఆ దుర్ఘ

టనకు చలించిపోయిన భగత్ జలియన్ వాలాబాగ్‌కు వెళ్ళి ప్రతీకారం తీర్చుకుంటానని రక్తాన్ని నుదుటికి రాసుకొని ప్రతిజ్ఞ చేశాడు. చిన్నప్పటినుండే విప్లవ భావాలతో పెరిగిన భగత్ సింగ్ మంచి కవి, గాయకుడు కూడా.! ముహమ్మద్ ఇఖ్బాల్ కవితలంటే చాలా ఇష్టం. 1923 లో పంజాబ్ హిందీ సాహిత్య సమ్మేళన్‌లో పాల్గొని అద్భుతమైన కవితలు వినిపించడంతో సభాధ్యక్షుడు ప్రొఫెసర్ భీమ్‌సేన్ విద్యాలంకార్‌తో పరిచయం ఏర్పడింది. అతను భగత్‌ను రాంప్రసాద్ బిస్మల్, అష్ఫాఖుల్లా ఖాన్‌ల ఆధ్వర్యంలో నడుస్తున్న హిందూస్తానీ రిపబ్లిక్ అసోషియేషన్‌లో చేరమని సలహా ఇచ్చాడు. నూనూగు మీసాలు కూడా రాని 16 సంవత్సరాల కుర్రాడు ఉద్యమంలో చేరతానంటే ఏమి చెప్పాలో బిస్మల్‌కు అర్థం కాలేదు. కానీ అష్ఫాఖ్‌కు మాత్రం భగత్‌లో సుడులు తిరుగుతున్న స్వాతంత్ర్య కాంక్ష కనబడింది. వెంటనే సభ్యత్వం ఇచ్చాడు. తరువాత 1925 లో కాకోరి రైలు దోపిడీలో భగత్ సింగ్ కూడా పాల్గొన్నాడు. లాహెూర్‌లోని నేషనల్ కాలేజీ విద్యార్థిగా ఉన్నప్పుడే భగత్ సింగ్‌కు పెళ్లి చేయాలని తల్లిదండ్రులు భావించారు. కాని ఉద్యమ స్ఫూర్తిని పుణికి పుచ్చుకున్న భగత్ సింగ్, తన జీవితాన్ని దేశానికి అంకితం చేయాలనుకుంటున్నానని, నాకు మరెలాంటి కోరికలూ లేవని ఉత్తరం రాసి ఇంట్లోంచి వెళ్ళిపోయాడు. తిరుగుబాటు దారుడిగా మారి తన స్నేహితులైన రాజ్ గురు, సుఖ్‌దేవ్‌లతో కలిసి జాతీయ అసెంబ్లీపై బాంబులు వేశాడు. ప్రముఖ స్వాతంత్ర్య సమర యోధుడు, ఉర్దూకవి మౌలానా హస్రత్ మొహానీ రూపొందించిన, తనకు అత్యంత స్ఫూర్తిదాయకమైన 'ఇంక్విలాబ్ జిందాబాద్' నినాదాన్ని ఎలుగెత్తి చాటుతూ, కరపత్రాలను పంచాడు. లాలా లజపతిరాయ్ హత్యకు ప్రతీకారంగా ఒక అధికారికి బదులు పొరపాటుగా మరో బ్రిటీష్ అధికారి సాండర్స్‌ను చంపిన కేసులో ప్రభుత్వం భగత్ సింగ్ ను అరెస్టు చేసింది. హత్యానేరం క్రింద భగత్ సింగ్, రాజ్ గురు, సుఖ్ దేవ్‌లు అరెస్టయ్యారు. కనీస సదుపాయాలు కూడా లేని జైలులో రాజకీయ ఖైదీల హక్కుల కోసం 64 రోజులు పాలకులకు వ్యతిరేకంగా భగత్ సింగ్ నిరాహారదీక్ష చేపట్టి అనూహ్యమైన ప్రజాదరణ పొందాడు. తన కుమారుడిని క్షమించమంటూ భగత్ సింగ్ తండ్రి బ్రిటీష్ ప్రభుత్వాన్ని అభ్యర్థించినప్పుడు, ' నా విడుదలకన్నా నా మరణమే బ్రిటీష్ సామ్రాజ్యాన్ని కూలదోస్తుందని ప్రగాఢంగా నమ్ముతున్నా.' అని చెప్పి, పిటిషన్‌ను ఉపసంహరించుకోవాలని తండ్రికి సూచించాడు. ఉరికి నాలుగు రోజుల ముందు, క్షమాభిక్ష ముసాయిదా పత్రంపై భగత్ సింగ్ సంతకం కోసం మిత్రుడు ప్రాణ్ నాథ్ మెహతా జైలులో అతణ్ణి కలిశాడు. కాని భగత్ సింగ్ సంతకం చేయడానికి నిరాకరిస్తూ.., మనిషిని చంపినంత మాత్రాన సిద్ధాంతాలను చంపలేరని, తన మరణం దేశ యువతకు ప్రేరణగా నిలుస్తుందని చెప్పాడు. దీంతో 1931 మార్చి 23 న భగత్ సింగ్‌తో పాటు ఆయన సహచరులు రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను లాహోర్‌లో ఉరితీశారు. భగత్ సింగ్ ఉరిని వ్యతిరేకిస్తూ నిరసన చేపడుతున్న మద్దతుదారులు ఆ క్షణమే ఆయన్ని షహీద్ (అమరుడు) గా ప్రకటించారు. దేశయువతలో దేశభక్తిని, చైతన్యస్ఫూర్తిని నింపుతూ.. భరత దేశ దాస్య శృంఖలాలను తెంచడం కోసం.. నిండు జీవితాన్ని పణంగా పెట్టి, విప్లవ జ్యోతులు వెలిగించిన యువకిశోరం, అసలు సిసలు స్వాతంత్ర్య సమరయోధుడు భగత్ సింగ్ అనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ యువ విప్లవకారుని గుండె ధైర్యం, త్యాగం నేటి యువతకు ఆదర్శం కావాలి.

(రేపు భగత్‌సింగ్ జయంతి)
వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్ట్

మేఘాలయలో

అంతరిస్తున్న ప్రాచీన ఎంబ్రాయిడరీ కళ

- పునరుద్ధరణకు నడుం కట్టిన మహిళలు
- అవగాహనకు విశేష కృషి

ముస్తోహ్: చేనేత వస్త్రాలపై వేసే 200 ఏళ్ల నాటి ఎంబ్రాయిడరీ కళను అంతరించి పోకుండా కాపాడు కునేందుకు మేఘాలయలోని ఒక గ్రామంలోని మహిళలు తీవ్రంగా శ్రమిస్తున్నారు. సంప్రదాయ, ప్రాచీనమైన చేతి వృత్తులకు సంబంధించిన ఆ కళను మరో తరానికి అందించేందుకు కృషి చేస్తున్నారు. ఒకప్పుడు చాలా మంది మహిళలకు ఆ కళపై పట్టు ఉన్నా ప్రస్తుతం ఆ తరం కనుమరుగవడంతో ఆ కళపై పట్టున్న ముగ్గురు మహిళలే తమ గ్రామానికే తలమానికమైన ఎంబ్రాయిడరీ కళను రక్షించుకునేందుకు నడుం భిగించారు. పూర్తి వివరాల్లోకి వెళితే మేఘాలయలోని తూర్పు ఖాసీ హిల్స్ జిల్లాలోని బాంగ్లాదేశ్ సరిహద్దు గ్రామమైన ముస్తోహ్ ఖ్నింగ్ అనే పేరుతో పిలిచే (ఖ్నింగ్ అంచే అంచు) ఎంబ్రాయిడరీ కళకు ఆయువుపట్టుగా ఉండేది. 200 ఏళ్ల పురాతనమైన చేతన కళ ప్రస్తుతం ఆదరణ లేకపోవడంతో అంతరించి పోయే దశకు చేరుకుంది. ఈ క్రమంలో ఆ గ్రామంలో ఆ కళ తెలిసిన ముగ్గురు మహిళలు ఖ్నింగ్ కళను పునరుద్ధరించే ప్రయత్నాలు ప్రారంభించారు. సంప్రదాయ చేనేత పట్టు చీరలు, శాలువాలు, మఫ్లర్ అంచులపై వేసే ఈ కళ చాలా తమ గ్రామానికి ప్రత్యేక మైందని ఆ గ్రామ నివాసి విక్టరీ సిన్రెమ్ తెలిపారు. గ్రామంలో ఈ కళ తెలిసిన వారు ప్రస్తుతం ముగ్గురు మాత్రమే ఉన్నారని చెప్పారు. వారితో తాను కూడా ఒకరినని పేర్కొన్నారు. ఈ కళను తాను తన అత్తగారి నుంచి నేర్చుకున్నట్టు తెలిపారు. ఈ ఎంబ్రాయిడరీ కళను నేర్చుకోవడం అంతసులభం కాదని చెప్పారు. పట్టుదలతో, కళపై ప్రేమతో నేర్చుకున్నట్టు గుర్తు చేసుకున్నారు. నార్త్ ఈస్ట్ స్లో ఫుడ్ అగ్రోబయోడైవర్సిటీ సొసైటీ వ్యవస్థాపకులు ఫ్రాంగ్ రాయ్ మాట్లాడుతూ...ఈ కళ ప్రత్యేకత తెలిసి దాన్ని ఎలాగైనా పునరుద్ధరించాలని భావించి ఆ బాధ్యతను తీసుకున్నట్టు చెప్పారు. పాచీనమైన ఈ కళ ఎలా పుట్టింది అనే విషయం గుర్తించి పూర్తి సమాచారం లభించడం లేదని చెప్పారు. ఈ కళపై ఎటువంటి డాక్యుమెంట్లు లేవని తెలిపారు. అక్కడున్న కళాకారుల ద్వారా 200 ఏళ్లనాటి ప్రాచీనమైన కళ అనేది తెలుస్తోందని చెప్పారు. ఆ కళ తెలిసిన వారి సహకారంతో 2014 నుంచి తగిన చర్యలు చేపట్టినట్టు తెలిపారు. 2019 నాటికి ఏడుగురు మహిళలకు ఖ్నింగ్ కళపై పట్టుసాధించినట్టు పేర్కొన్నారు. ప్రస్తుతం ఆ గ్రామంలో 18 మంది మహిళలకు ఖ్నింగ్ ఎంబ్రాయిడరీ పని చేయడం వస్తోందని తెలిపారు. చేనేత హస్తకళల శాఖ మాజీ డైరెక్టర్ మెండన్ పరియాట్ మాట్లాడుతూ...ఇది పూర్తిగా మహిళలపై ఆధారపడిన కళ అని పేర్కొన్నారు. ఈ కళకు తగినంత మార్కెట్టు లేకపోవడం ఇబ్బందికరంగా ఉందని పేర్కొన్నారు. అయితే సరైన మార్కెట్టు అవకాశాలు ఉంటే పునరుజ్జీవనం తప్పకుండా లభిస్తుందని పేర్కొన్నారు. చేనేత విభాగం ఇన్‌స్పెక్టర్ ఆఫైమోన్ కోంగ్లామ్ మాట్లాడుతూ...ఖ్నింగ్ ఎంబ్రాయిడరీ కళ అంతరించే దశలో ఉందన్నారు. కళను బతికించు కోవడం కోసం ప్రభుత్వం వైపు నుంచి సహకారం ఇస్తున్నట్టు తెలిపారు. సాధారణమైన వస్త్రం ధర రూ.2,500 నుంచి 3000 వేలు కాగా, ఈ ఎంబ్రాయిడరీ చేసిన వస్త్రం ధర రెట్టింపు ఉంటుందని తెలిపారు. కళను కాపాడుకోవడం కోసం ఈ ఏడాది ప్రారంభంలో ప్రభుత్వం శాఖలైన ఆర్ట్స్ అండ్ కల్చర్, టెక్స్‌టైల్స్ విభాగం తరపున ఎంబ్రాయిడరీ పోటీలను కూడా నిర్వహించినట్టు తెలిపారు. ఈ తరహా కార్యక్రమాల ద్వారా ప్రజల్లో ఆ కళ పట్ల అవగాహన కలుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

దేశ్‌ముఖ్ బెయిల్ పిటిషన్‌పై నిర్ణయం మీదే: సుప్రీం

బాంబే హైకోర్టును ఆదేశించిన అత్యున్నత న్యాయస్థానం

న్యూఢిల్లీ: మనీలాండరింగ్ కేసులో అరెస్టయిన మహారాష్ట్ర మాజీ హోంమంత్రి అనిల్ దేశ్‌ముఖ్ బెయిల్ పిటిషన్‌పై త్వరగా విచారణ జరిపి నిర్ణయం తీసుకోవాలని బాంబే హైకోర్టును సుప్రీంకోర్టు సోమవారం ఆదేశించింది. మార్చి 21 నుంచి దేశ్‌ముఖ్ బెయిల్ పిటిషన్ హైకోర్టులో పెండింగ్‌లో ఉందని న్యాయమూర్తులు డీవై చంద్రచూడ్, హిమా కోహ్లీలతో కూడిన ధర్మాసనం పేర్కొంది. ఈ వారంలోగా దరఖాస్తును విచారణకు స్వీకరించి, త్వరితగతిన నిర్ణయం తీసుకుంటామని ధర్మాసనం పేర్కొంది. కేసు మెరిట్‌లపై ఎలాంటి అభిప్రాయాన్ని వ్యక్తం చేయలేదని అత్యున్నత న్యాయస్థానం స్పష్టం చేసింది. దేశ్‌ముఖ్ బెయిల్ పిటిషన్‌ను హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎన్‌జే జమాదార్ విచారిస్తున్నారు. దేశ్‌ముఖ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నవంబర్ 2021లో అరెస్టు చేసింది. ప్రస్తుతం ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడు.

కదిలే రైలు నుంచి పడి బాస్కెట్ బాల్ రిఫరీ మృతి

ఇటావా (ఉత్తరప్రదేశ్): కాన్పూర్ సమీపంలో కదులుతున్న రైలు నుంచి పడి 25 ఏళ్ల వ్యక్తి మృతి చెందినట్లు అధికారులు సోమవారం తెలిపారు. బాస్కెట్‌బాల్ రిఫరీ యశ్వర్ధన్ రాణా సంగమ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తుండగా సెప్టెంబర్ 24-25 మధ్య రాత్రి కాన్పూర్-తుండ్ల డివిజన్‌లోని ఎక్‌దిల్-భర్తానా రైల్వే స్టేషన్‌ల మధ్య ఈ సంఘటన జరిగిందని వారు తెలిపారు. మీరట్‌లోని మోదీ స్పోర్ట్స్ అకాడమీలో శిక్షకుడిగా కూడా పనిచేస్తున్న రానా, మీరట్ జట్టుతో కలిసి చౌదరి హర్మోహన్ సింగ్ యాదవ్ పారామెడికల్ కాలేజీలో 61వ ఉత్తరప్రదేశ్ బాస్కెట్‌బాల్ పోటీల కోసం కాన్పూర్‌కు వెళ్తున్నాడు. ఇటావా పోలీస్ సూపరింటెండెంట్ (నగరం) కపిల్ దేవ్ సింగ్ తెలిపిన వివరాల ప్రకారం, రానా మీరట్‌లోని సివిల్ లైన్స్ నివాసి. బాస్కెట్‌బాల్ జట్టు ఎస్-3, ఎస్-7 కోచ్‌లలో ప్రయాణిస్తున్నప్పుడు అతను ఎస్-5 కోచ్‌లో ఉన్నాడు. ఆదివారం ఉదయం రైలు కాన్పూర్ స్టేషన్‌కు చేరుకోగా, కోచ్‌లో రానా కనిపించకపోవడంతో సెర్చ్ ఆపరేషన్ ప్రారంభించారు. తరువాత, ఇటావా జిల్లా భర్తానా స్టేషన్ సమీపంలో రైల్వే ట్రాక్ పక్కన పడి ఉన్న మృతదేహాన్ని గుర్తించారు. బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని గుర్తించారు.

హెచ్‌ఏఎల్ రాకెట్ ఇంజన్ తయారీ కేంద్రం సిద్ధం

నేడు ప్రారంభించనున్న రాష్ట్రపతి ముర్ము

బెంగళూరు: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) సరఫరా చేసేందుకు హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్‌ఏఎల్) రూ. 208 కోట్లతో ఇంటిగ్రేటెడ్ క్రయోజెనిక్ ఇంజిన్ మాన్యుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ (ఐసీఎంఎఫ్)ని ఇక్కడ ఏర్పాటు చేసింది. 4,500 చదరపు మీటర్ల విస్తీర్ణంలో నిర్మించిన అత్యాధునిక ఐసీఎంఎఫ్‌ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ప్రారంభించనున్నారు. భారతీయ రాకెట్ల కోసం క్రయోజెనిక్ (సీఈ20), సెమీ-క్రయోజెనిక్ (ఎస్ఇ2000) ఇంజిన్ల తయారీకి ఈ కేంద్రంలో 70 పైగా అత్యాధునిక పరికరాలతో పరీక్షా సౌకర్యాలను ఏర్పాటు చేశారు. హెచ్‌ఏఎల్ ఏరోస్పేస్ డివిజన్‌లో క్రయోజెనిక్ ఇంజన్ మాడ్యూళ్ల తయారీ సౌకర్యాన్ని ఏర్పాటు చేసేందుకు ఇస్రోతో ఎంవోయూ కుదిరింది. రూ.208 కోట్ల పెట్టుబడితో ఐసీఎంఎఫ్ ఏర్పాటు చేయడానికి దీనిని 2016లో సవరించారు. రాకెట్ల తయారీ అవసరమైన వస్తువులను ఉత్పత్తి చేసి అసెంబ్లింగ్ చేయడానికి కీలక ఉపకరణాలను సిద్ధం చేసినట్లు బెంగళూరులోని హెచ్‌ఏఎల్ ప్రధాన కార్యాలయం వెల్లడించింది.

ప్రీ-ప్రొడక్షన్ కార్యకలాపాలు కూడా ప్రారంభమయ్యాయని పేర్కొంది. ఐసీఎంఎఫ్ ఏర్పాటుతో రాకెట్ ఇంజిన్ తయారీ ఆసాంతం ఒకేచోట జరుగనుంది. ప్రపంచ వ్యాప్తంగా ఉపగ్రహ వాహక నౌకల్లో క్రయోజెనిక్ ఇంజిన్లనే అధికంగా వినియోగిస్తారు. దీని సంక్లిష్ట స్వభావం కారణంగా, ఇప్పటి వరకు కొన్ని దేశాలు - అమెరికా, ఫ్రాన్స్, జపాన్, చైనా, రష్యా మాత్రమే క్రయోజెనిక్ సాంకేతికతపై పట్టు సాధించాయి. జనవరి 5, 2014న భారతదేశం సొంతంగా అభివృద్ధిపర్చిన క్రయోజెనిక్ ఇంజిన్‌తో జీఎస్ఎల్వి-డి5 5ని విజయవంతంగా ప్రయోగించింది. దీంతో క్రయోజెనిక్ ఇంజిన్‌లను అభివృద్ధి చేసే ఆరవ దేశంగా అవతరించింది.

దాడికి పాల్పడిన వారు ఎక్కడున్నా పట్టుకుంటాం

కేరళ రవాణా మంత్రి ఆంటోని రాజు

తిరువనంతపురం: వ్యక్తిపై దాడికి పాల్పడిన కేఎస్ఆర్టీసీ సిబ్బంది ఎక్కడ దాక్కున్నా పట్టుకుంటామని కేరళ రవాణా శాఖ మంత్రి ఆంటోని రాజు సోమవారం మీడియా ప్రతినిధులకు తెలిపారు. సెప్టెంబర్ 20న తన కుమార్తె ఎదుటే వ్యక్తిపై దాడికి పాల్పడిన కేఎస్ఆర్టీసీ ఉద్యోగులను పట్టుకునేందుకు పోలీసులు చర్యలు తీసుకోవడం లేదన్న ఆరోపణల మధ్య మంత్రి ఈ మేరకు స్పందించారు. ఈ విషయంలో నలుగురు కేరళ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కేఎస్ఆర్టీసీ) సిబ్బందిపై నాన్‌బెయిలబుల్ కేసులు నమోదయ్యాయని, అందువల్ల వారు ఎక్కడ దాక్కున్నా పోలీసులు అదుపులోకి తీసుకుంటారని మంత్రి చెప్పారు. ఘటన జరిగిన కొన్ని గంటల్లోనే నలుగురిని సస్పెండ్ చేస్తూ రవాణా సంస్థ యాజమాన్యం ఇప్పటికే అవసరమైన చర్యలు చేపట్టిందన్నారు. చట్టం ప్రకారం విచారణ జరిపి నిందితులపై చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. విచారణ నివేదికను 45 రోజుల్లోగా సమర్పించాలని ఆదేశించినట్లు ఆయన తెలిపారు. తనపై దాడి చేసిన వారిని పట్టుకోవడంలో పోలీసులు నిష్క్రియాపర్వంగా వ్యవహరించారని దాడికి గురైన ప్రేమన్ అనే వ్యక్తి ఆరోపించారు. నిందితులను త్వరగా పట్టుకోకుంటే కోర్టును ఆశ్రయిస్తానని టీవీ ఛానెల్స్‌తో చెప్పారు. సెప్టెంబర్ 20న తిరువనంతపురం సమీపంలోని బస్ డిపోలో 55 ఏళ్ల ప్రేమన్, కళాశాలకు వెళ్లే తన కుమార్తెపై కేఎస్ఆర్టీసీ సిబ్బంది నెట్టివేసి దాడి చేశారు. అంతకు ముందు వారి మధ్య కొద్దిసేపు వాగ్వాదం చోటు చేసుకుంది. సిబ్బంది ప్రేమన్‌ను గదిలోకి నెట్టి దాడి చేయడం, వారిని ఆపడానికి ప్రయత్నించిన అతని కుమార్తెను కొట్టడానికి సంబంధించిన వీడియో క్లిప్పింగులు... సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవడం సంచలనం రేపింది. మీడియా కథనాల ఆధారంగా ఈ ఘటనపై కేరళ హైకోర్టు స్వయంగా కేసు నమోదు చేసింది.

యూపీలో రోజుకో గ్యాంగ్‌రేప్!

- మహిళలకు కరువైన రక్షణ
- తాజాగా వదినపై మరిది అత్యాచారం

లక్నో: బీజేపీ పాలిత ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మహిళలపై సామూహిక అత్యాచారాలు నిత్యకృత్యమయ్యాయి. మొన్న ఒక మహిళపై గ్యాంగ్ రేప్, నిన్న ఒక మైనర్‌పై గ్యాంగ్‌రేప్, నేడు మరో మహిళపై గ్యాంగ్‌రేప్. ఇదీ రాష్ట్రంలో మహిళలకు ఉన్న రక్షణ. ఇందులో కొన్ని ఘటనలు పోలీస్‌స్టేషన్‌కు చేరుతుండగా, అనేకం రికార్డులోకి కూడా రావడం లేదు. తాజాగా బారాబంకి జిల్లాలో మహిళకు బలవంతంగా మద్యం తాగించి నలుగురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. శనివారం ఒక వ్యక్తి బాధిత మహిళను చెరువు దగ్గరకు తీసుకెళ్లాడు. మరో ముగ్గురు వ్యక్తులు అక్కడి చేరుకొని మహిళకు బలవంతంగా మద్యం తాగించి లైంగికదాడికి పాల్పడ్డారు. బాధితురాలు ఆదివారం భర్తతో కలిసి వెళ్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుల్లో ఒకరిని పోలీసులు అరెస్టు చేశారు. మిగతావారి కోసం గాలిస్తున్నారు. ముజఫర్‌నగర్ జిల్లాలో 15 ఏళ్ల బాలికపై 21 ఏళ్ల యువకుడు లైంగికదాడికి పాల్పడ్డాడు. కోచింగ్ సెంటర్‌లో బాలికతో యువకుడు పరిచయం పెంచుకున్నాడు. మాయమాటలు చెప్పి ఈ ఏడాది జనవరిలో బాలికపై అనేకసార్లు లైంగికదాడికి పాల్పడ్డాడు. లైంగికదాడికి సంబంధించిన వీడియోలను నిందితుడు ఇటీవల సోషల్‌మీడియాలో పోస్టు చేయడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

సహరాన్‌పూర్: తల్లిలాంటి వదినపై ఆమె సొంత మరిది అత్యాచారానికి పాల్పడ్డారు. ఉత్తర ప్రదేశ్‌లోని సహరాన్‌పూర్ జిల్లాలోని దేవ్‌బంద్ పోలీసు స్టేషనులో ఈ మేరకు ఒక ఫిర్యాదు నమోదైంది. శనివారం తన మరిది కత్తితో బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడని బాధిత మహిళ పేర్కొంది, భర్త, అత్త మామలు కూలి పనుల కోసం బయటకు వెళ్లిన తరుణంలో తన మరిది అత్యాచారానికి ఒడిగట్టినట్టు తెలిపింది. రెండు సంవత్సరాల నుంచి భర్త సొంత తమ్ముళ్లు ఇద్దరూ తనను వేధిస్తున్నట్టు పేర్కొంది. 15 రోజుల క్రితమే ఒకరు తనను వేధింపులకు గురి చేసినట్టు తెలిపింది. ఆ విషయం భర్తకు తెలిపినా మందలించి వదిలేసినట్టు పేర్కొంది. శనివారం ఒకరు తనపై అత్యాచారానికి పాల్పడినట్టు పేర్కొంది. ఈ ఘటనపై జిల్లా ఎస్పీ సూరజ్ రాయ్ స్పందించారు. బాధితురాలు తన బంధువుల సహకారంలో ఆదివారం సాయంత్రం ఫోన్‌లో తమకు ఫిర్యాదు ఇచ్చినట్టు తెలిపారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్టు పేర్కొన్నారు. విషయం తెలుసుకున్న బాధితురాలి భర్త, అత్తమామలు, నిందితులు పరారైనట్టు తెలుస్తోంది.

మైసూరులో దసరా ఉత్సవాలు

ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము

మైసూరు: పదిరోజుల దసరా ఉత్సవాలు సోమవారం మైసూరులోని ప్యాలెస్‌లో ప్రారంభమయ్యాయి. భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఉత్సవాలను ప్రారంభించారు. కోవిడ్-19 మహమ్మారి దృష్ట్యా రెండేళ్లుగా అరకొరగా జరిగిన ఈ ఉత్సవాలను ఈ ఏడాది 'నాద హబ్బా' (రాష్ట్ర పండుగ)గా జరుపుకునే దసరా, ఈ సంవత్సరం కర్ణాటక గొప్ప సంస్కృతి, సంప్రదాయాలను వర్ధిస్తూ, రాజరిక వైభవాన్ని స్మరించుకునేలా ఘనంగా నిర్వహించాలని భావిస్తున్నారు. స్థానిక చాముండి కొండలపై ఉన్న చాముండేశ్వరి ఆలయ ప్రాంగణంలో వాడీ స్తోత్రాల మంత్రోచ్ఛారణల మధ్య మైసూరు రాజకుటుంబీకుల పీఠాధిపతి చాముండేశ్వరి దేవి విగ్ర హంపై పుష్పగుచ్ఛాలు ఉంచారు. అనంతరం రాష్ట్రపతి ఉత్సవాలను ప్రారంభించారు. ఇటీవలి కాలంలో మైసూరు దసరాలో పాల్గొన్న తొలి రాష్ట్రపతి ముర్ము కావడం విశేషం. ఆమెతో పాటు కర్ణాటక గవర్నర్ థావర్‌చంద్ గెహ్లాట్, ముఖ్యమంత్రి బసవరాజ్ బొమ్మై, కేంద్ర మంత్రులు ప్రహ్లాద్ జోషి, శోభా కరంద్లాజే, రాష్ట్ర మంత్రివర్గంలోని మంత్రులు ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. రాష్ట్రపతి చాముండేశ్వరి ఆలయాన్ని సందర్శించి, ప్రారంభోత్సవానికి ముందు “నాద దేవతే” (రాష్ట్ర దేవత)గా పేర్కొనబడే దేవతకు ప్రార్థనలు చేశారు. భారత రాష్ట్రపతి హోదాలో ఆమె ఇతర రాష్ట్రానికైనా వెళ్లడం ఇదే తొలిసారి. కన్నడలో తన ప్రసంగాన్ని ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, రాష్ట్ర పౌరులకు శుభాకాంక్షలు తెలిపారు. ఇటువంటి పండుగలు భారతీయ సమాజాన్ని ఒకదానితో ఒకటి బంధిస్తాయని, భిన్నత్వంలో ఏకత్వానికి ఉదాహరణ అని పేర్కొన్నారు. మైసూరు దసరా భారతదేశపు గొప్ప సంస్కృతిని చాటిచెప్పే పండుగ అని ఆమె అన్నారు. 12వ శతాబ్దంలో బసవన్న తదితరులు తమ “వచనాల” ద్వారా ప్రారంభించిన బౌద్ధ, జైన సంప్రదాయాలు, శంకరాచార్య, సూఫీ మతం, సాంఘిక సంస్కర ణోద్యమంతో రాష్ట్రానికి ఉన్న అనుబంధాన్ని సూచిస్తూ, భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయాలను ప్రతిబింబించే భూమి కర్ణాటక అని రాష్ట్రపతి అన్నారు. దయ, త్యాగానికి ప్రతీక, అన్యాయం, అహంకారాన్ని నాశనం చేసే దేవతను ఆరాధించడం ద్వారా నవరాత్రి సమయంలో “నవదుర్గా” ఆరాధనను స్త్రీత్వ వేడుకగా రాష్ట్రపతి అభివర్ణించారు. ఈ ఏడాది దసరా సందర్భంగా అంబా విలాస్ ప్యాలెస్, జగన్మోహన్ ప్యాలెస్ సహా ఎనిమిది వేదికలపై దాదాపు 290 సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అలాగే, ఆహార మేళా, ఫ్లవర్ షో, సాంస్కృతిక కార్యక్రమాలు, రైతుల దసరా, మహిళా దసరా, యువ దసరా, పిల్లల దసరా, కవితా పఠనం వంటి డజన్ల కొద్దీ కార్యక్రమాలను కూడా నిర్వహిస్తారు. ఏది ఏమైనప్పటికీ, ప్రకాశించే అంబా విలాస్ ప్యాలెస్ ముందు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రధాన ఆకర్షణగా ఉంటాయి..

రాజీవ్ హత్య కేసులో నళిని వ్యాజ్యంపై

కేంద్రం, తమిళనాడుకు సుప్రీం నోటీసులు

న్యూఢిల్లీ: రాజీవ్ గాంధీ హత్య కేసులో యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న నళిని శ్రీహరన్‌ను ముందస్తుగా విడుదల చేయాలని కోరుతూ దాఖలు చేసిన వ్యాజ్యంపై సుప్రీం కోర్టు సోమవారం కేంద్రం, తమిళనాడు ప్రభుత్వాల నుంచి స్పందన కోరింది. న్యాయమూర్తులు జస్టిస్ బి.ఆర్.గవై, బి.వి.నాగరత్నలతో కూడిన ధర్మాసనం కేంద్రం, తమిళనాడు ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేస్తూ, ఈ పిటిషన్‌పై వారి సమాధానం కోరింది. ఈ కేసులో దోషిగా ఉన్న ఆర్.పి.రవిచంద్రన్ దాఖలు చేసిన వ్యాజ్యం పై కూడా అత్యున్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ముందస్తు విడుదల కోసం తన అభ్యర్థనను తిరస్కరించిన మద్రాస్ హైకోర్టు జూన్ 17 నాటి ఉత్తర్వులను నళిని సవాలు చేశారు. సహ దోషి ఎ.జి.పెరారివాలన్‌ను విడుదల చేయాలంటూ సుప్రీం కోర్టు తీర్పును ఉదహరించారు. మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ హత్య కేసులో దోషులుగా తేలిన శ్రీహరన్, రవిచంద్రన్‌ను రాష్ట్ర గవర్నర్ అనుమతి లేకుండా విడుదల చేయాలంటూ దాఖలయిన వ్యాజ్యాన్ని హైకోర్టు జూన్ 17న తిరస్కరించింది. ఆర్టికల్ 142 ప్రకారం ప్రత్యేక అధికారాన్ని అనుభవించిన సుప్రీం కోర్టు వలె కాకుండా, రాజ్యాంగంలోని ఆర్టికల్ 226 ప్రకారం అలా చేయడానికి హైకోర్టులకు అధికారం లేదని, వారి అభ్యర్థనలను తిరస్కరిస్తూ హైకోర్టు పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 142 ప్రకారం దాని అసాధారణ అధికారాన్ని ప్రేరేపిస్తూ, 30 ఏళ్లకు పైగా జైలు శిక్ష అనుభవించిన పెరరివాలన్‌ను విడుదల చేయాలని మే 18న అత్యున్నత న్యాయస్థానం ఆదేశించింది. అతని విడుదల కోసం రాష్ట్ర మంత్రివర్గం ద్వారా రాష్ట్రపతికి తమిళనాడు గవర్నర్‌కు 'కట్టుబడి' సలహా పంపి ఉండకూడదని పేర్కొంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 161 ప్రకారం శిక్షల మార్పు/విమోచనకు సంబంధించిన విషయాల్లో రాష్ట్ర మంత్రివర్గం సలహా గవర్నర్‌కు కట్టుబడి ఉంటుందని సుప్రీం కోర్టు పేర్కొంది. ఆర్టికల్ 142 ప్రకారం, 'పూర్తి న్యాయం' అందించడానికి అవసరమైన ఏదైనా తీర్పు లేదా ఉత్తర్వును ఉన్నత న్యాయస్థానం జారీ చేయవచ్చు. మే 21, 1991 రాత్రి తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో ఎన్నికల ర్యాలీలో ధను అనే మహిళ ఆత్మాహుతి బాంబర్‌చే రాజీవ్ గాంధీ హత్యకు గురయ్యారు. మే 1999 నాటి ఉత్తర్వుల్లో నలుగురు దోషులు పెరారివాలన్, మురుగన్, సంతన్, నళిని మరణశిక్షను సుప్రీం కోర్టు సమర్థించింది. అయితే, 2014లో, వారి క్షమాభిక్ష పిటిషన్‌పై నిర్ణయం తీసుకోవడంలో జాప్యం కారణంగా సంతాన్, మురుగన్‌లతో పాటు పెరరివాలన్ మరణశిక్షను జీవిత ఖైదుగా మార్చింది. అలాగే 2001లో నళిని మరణశిక్షను యావజ్జీవ కారాగార శిక్షగా మార్చారు.

ట్రాక్టర్ ట్రాలీ బోల్తాపడి 10మంది మృతి

37మందికి గాయాలు

లక్నో: ట్రాక్టర్-ట్రాలీ బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న 10 మంది మృతి చెందగా, 37మంది గాయపడ్డారు. ఈ ఘటన సోమవారం చోటుచేసుకున్నట్టు జిల్లా సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. 'ముందన్' వేడుక కోసం ఉన్నయీ గ్రామంలోని దుర్గాదేవి ఆలయానికి వెళుతున్న ట్రాక్టర్‌లో సుమారు 47 మంది ప్రయాణిస్తున్నారని జిల్లా మేజిస్ట్రేట్ (లక్నో) సూర్యపాల్ గంగ్వార్ తెలిపారు. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మహిళలు, ఇద్దరు చిన్నారులు మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుల కుటుంబానికి ఒక్కొక్కరికి రూ.4 లక్షల చొప్పున ఆర్థికసాయం అందిస్తున్నారు. తీవ్ర గాయాలతో గాయపడిన వారిలో ఒకరిని కింగ్ జార్జ్ మెడికల్ యూనివర్సిటీ (కేజీఎంయూ) ఆసుపత్రిలో చేర్పించగా, ఇటౌంజాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో చికిత్స పొందుతున్న మరికొందరికి ప్రాణాపాయం లేదని డీఎం తెలిపారు. చెరువులో ఎవరూ చిక్కుకోకుండా చూసేందుకు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం (ఎస్‌డీఆర్ఎఫ్) గాలిపు చర్యలు ముమ్మరం చేసినట్టు పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలను తెలుసుకునేందుకు దర్యాప్తు జరుపుతున్నామని, ప్రత్యక్ష సాక్షుల నుంచి సమాచారం సేకరించామని తెలిపారు. జిల్లా మేజిస్ట్రేట్‌తో పాటు, జిల్లా ఉన్నతాధికారులు, పోలీసు అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులను అన్ని విధాలా ఆదుకోవాలని అధికారులను ఆదేశించారు. సీహెచ్‌సీ ఇటౌంజాలో చేరిన బాధితులను ఆయన కలుసుకుని వారి పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

నవంబరులో గుజరాత్ ఎన్నికలు: బీజేపీ

రాజ్యాంగ వ్యవస్థల హైజాక్: కాంగ్రెస్

అహ్మదాబాద్: గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలు నవంబరు చివరలో జరగవచ్చని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సీఆర్ పాటిల్ సోమవారం చెప్పారు. ఇంతకుముందు రెండుసార్లు అసెంబ్లీ ఎన్నికలు డిసెంబరు రెండో వారంలో జరిగాయని గుర్తుచేశారు. ఇది కేవలం తన రాజకీయ అంచనా మాత్రమేనని, ఎన్నికల సంఘం తరపున తాను మాట్లాడటం లేదని అన్నారు. అహ్మదాబాద్‌కు 80 కిలోమీటర్ల దూరంలోగల ఆనంద్ నగరంలో జరిగిన ఓ కార్యక్రమంలో పాటిల్ మాట్లాడారు. మరోవైపు, పాటిల్ ప్రకటనపై కాంగ్రెస్ మండిపడింది. ఎన్నికల కమిషన్ వంటి రాజ్యాంగ సంస్థలను మోదీ సర్కారు బలహీనపరుస్తోందని, హైజాక్ చేస్తోందని కాంగ్రెస్ సీనియర్ నేత దీపక్ బబారియా విమర్శించారు. 'నవంబరు చివరలో అసెంబ్లీ ఎన్నికలు జరగవచ్చు. 2012, 2017 ఎన్నికలు డిసెంబరు 12కి ముగిశాయి. ఈ విషయాన్ని ఎవరూ నాకు చెప్పలేదు. ఎవరితోనూ నేను మాట్లాడలేదు' అని పాటిల్ చెప్పారు. 2017 అసెంబ్లీ ఎన్నికలు డిసెంబరు 13, 17 తేదీల్లో రెండు విడతలుగా జరగగా డిసెంబరు 20న ఫలి తాలు ప్రకటించారు. ప్రస్తుత అసెంబ్లీ కాల పరిమితి 2023 ఫిబ్రవరి 18 నాటికి ముగు స్తుంది. ఎన్నికల తేదీలను తాను అధికారి కంగా ప్రకటించడం లేదని, అప్రమత్తంగా ఉండాలని కార్యకర్తలకు సూచిస్తున్నానని పాటిల్ చెప్పారు. కాంగ్రెస్ నుంచి విమర్శలు రావడంతో పాటిల్ వెనక్కి తగ్గి గుజరాత్, హిమాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు సంబం ధించి కేంద్ర ఎన్నికల సంఘం చేపట్టిన కసరత్తు ఆధారంగానే తాను ఈ ప్రకటన చేశానని పాటిల్ వివరణ ఇచ్చారు. పాటిల్ వ్యాఖ్యలపై దీపక్ బబారియా స్పందిస్తూ రాజ్యాంగ సంస్థలను కేంద్ర ప్రభుత్వం ఏ విధంగా బలహీనపరుస్తోంది? ఎలా హైజాక్ చేస్తోందో ఈ ప్రకటన రుజువు చేస్తున్నదని విమర్శించారు. ఎన్నికల కమిషన్ అధికారులను ఏ విధంగా ఆదేశిస్తోందో చెప్పడానికి ఇది ఓ ఉదాహరణ అని వ్యాఖ్యానించారు.

ఉత్తరాఖండ్‌లో ఉద్యోగాల కుంభకోణం

అసెంబ్లీలో అక్రమ భర్తీలు

250 మంది ఉద్యోగుల తొలగింపు

డెహ్రాడూన్: డబుల్ ఇంజిన్ ప్రభుత్వాల్లో ఏ రీతిన అక్ర మాలు జరుగుతున్నాయో ఉత్తరాఖండ్ అసెంబ్లీ ఉద్యోగుల కుంభకోణం బట్టబయలు చేసింది. ఉత్తరాఖండ్ అసెంబ్లీలో ఉద్యోగుల నియమాకాలు అక్రమంగా జరిగాయని శాసన సభా కమిటీ తేల్చడంతో శాసనసభ కార్యదర్శి ముకేశ్ సింఘాల్ సహా, 250 మంది ఉద్యోగులను స్పీకర్ రీతు ఖండూరీ భూషణ్ తొలగించక తప్పలేదు. బీజేపీ పాలిత ఉత్తరాఖండ్‌లో అసెంబ్లీ సెక్రటరీ లాంటి ఉన్నత పదవిలోని అధికారిని ఈ ఉదంతంలో సస్పెండ్ చేయాల్సి రావటం దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఇంత పెద్ద సంఖ్యలో ఒకేసారి అసెంబ్లీ ఉద్యోగులను తొలగించడం ఏ రాష్ట్రంలో జరగలేదని రాజ కీయ విశ్లేషకులు అంటున్నారు. అసెంబ్లీ ఉద్యోగుల భర్తీపై విచా రణ జరిపిన ఉత్తరాఖండ్ శాసనసభా కమిటీ భర్తీ ప్రక్రియను తప్పుపట్టింది. నియమాలకు విరుద్ధంగా భర్తీ జరిగిందని తేల్చింది. నియామకాల కోసం ఎలాంటి ప్రకటన ఇవ్వకపోవ టంతోపాటు, కనీసం ఉపాధికల్పన కార్యాలయాన్ని కూడా సంప్ర దించలేదని నివేదికలో తప్పుపట్టింది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 16కు ఇది పూర్తి విరుద్ధమని పేర్కొన్నది. తొలగించిన వారిలో 228 మంది కాంట్రాక్టు ఉద్యోగులు కాగా, మిగతావారు స్వల్పకాలిక ఉద్యోగులు. 2011కు ముందు జరిగిన భర్తీలోనూ అవకతవకలు జరిగాయన్న అనుమానం వ్యక్తమవుతున్నది.

లోయలో పడిన వాహనం... ఏడుగురి దుర్మరణం

షిమ్లా: హిమాచల్‌ప్రదేశ్‌లోని కులు జిల్లాలో టెంపో ట్రావెలర్ లోయలో పడి ఏడుగురు పర్యాటకులు మృతి చెందగా, 10 మంది గాయపడినట్లు అధికారులు సోమవారం తెలిపారు. బంజర్ సబ్‌డివిజన్‌లోని ఘియాఘి సమీపంలో ఆదివారం రాత్రి 8:30 గంటలకు ఈ ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. ఐదుగురు పర్యాటకులు అక్కడికక్కడే మరణించగా, మరో ఇద్దరు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. మృతులను ఢిల్లీ, ఉత్తర ప్రదేశ్‌కు చెందిన వారిగా గుర్తించినట్టు కులు ఎస్పీ గురుదేవ్ శర్మ తెలిపారు. బంజర్‌కు చెందిన బీజేపీ ఎమ్మెల్యే సురేందర్ శౌరీ సోమవారం అర్ధరాత్రి 12.45 గంటలకు తన నియోజకవర్గంలో జరిగిన ప్రమాదం గురించి ప్రజలకు తెలియజేస్తూ ఫేస్‌బుక్‌లో వీడియో ప్రసారం చేశారు. గాయపడ్డ వారిని మొదట బంజర్ ఆసుపత్రికి తరలించి అక్కడి నుంచి ప్రథమ చికిత్స అనంతరం కులు ప్రాంతీయ ఆసుపత్రికి తరలించినట్లు ఎమ్మెల్యే వివరించారు. అంధకారంలో ఉన్నప్పటికీ రెస్క్యూ ఆపరేషన్ చేపట్టినందుకు జిల్లా యంత్రాంగానికి, స్థానికులకు బంజర్ ఎమ్మెల్యే కృతజ్ఞతలు తెలిపారు. హిమాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రి జై రామ్ ఠాకూర్, రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్ ఘటనపై విచారం వ్యక్తం చేశారు.

మహా పాదయాత్రకు జన సంఘీభావం

- పశ్చిమ గోదావరి జిల్లా కొత్తూరు వద్ద 15వ రోజు ముగింపు
- బొత్స వ్యాఖ్యలపై మండిపడ్డ అమరావతి జేఏసీ
- మహాపాదయాత్రకు సీపీఐ సంఘీభావం

దెందులూరు: అమరావతి పరిరక్షణకోసం రాజధాని ప్రాంత రైతులు, మహిళలు చేపట్టిన మహాపాదయాత్ర 15వ రోజుకు చేరుకుంది. ఆదివారం సాయంత్రం కృష్ణాజిల్లా నుంచి ఏలూరు జిల్లాలోకి ప్రవేశించింది. సోమవారం దెందులూరు నియోజకవర్గం కొనికి నుంచి రైతులు పాదయాత్ర ప్రారంభించారు. రైతులకు సంఘీభావం తెలిపేందుకు ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు, ఎమ్మెల్యేలు నిమ్మల రామానాయుడు, రామరాజు, మాజీ మంత్రి జవహర్, మాజీ ఎంపీ మాగంటి బాబు, జిల్లా కార్యాలయ కార్యదర్శి పాలి ప్రసాద్, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ కొక్కిరిగడ్డ జయరాజు, దెందులూరు మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అనేకమంది నాయకులు, కార్యకర్తలు తరలివచ్చారు. ఈ సందర్భంగా కేహెచ్ జవహర్, జయరాజు, వీరాంజనేయులు, డప్పు వాయించి అక్కడ అందర్నీ ఉత్సాహపరిచారు. జనసేన, వామపక్ష నేతలు కూడా పాదయాత్రలో పాల్గొని రైతులకు మద్దతు తెలిపారు. కొనికి నుంచి ప్రారంభమైన పాదయాత్ర కడిమికుంట, సకల కొత్తపల్లి, సత్యవోలు, నాయుడుగూడెం, పెదపాడు, సత్యనారాయణపురం, అందేఖాన్ చెరువు మీదుగా ఏలూరు మండలం కొత్తూరు వరకు మొత్తం 15 కిలోమీటర్ల మేర సాగనుంది. మధ్యాహ్నం పెదపాడులో భోజనం విరామం తీసుకున్నారు. సాయంత్రం 6 గంటలకు కొత్తూరు వద్ద 15వ రోజు పాదయాత్ర ముగిసింది.

అంతకుముందు అమరావతీ జేఏసీ నేతలు మీడియాతో మాట్లాడారు. కన్నెర్ర జేస్తే ఐదు నిమిషాల్లో యాత్రలు ఆగిపోతాయని, చేతులు ముడుచుకొని కూర్చుంటే ఉత్తరాంధ్ర ప్రజలకు తీవ్ర అన్యాయం జరుగుతుందంటూ మంత్రి బొత్స సత్యనారాయణ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు. అబద్ధాలు ప్రచారం చేస్తూ ప్రాంతాల మధ్య చిచ్చుపెట్టేందుకు ఈ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయలేని పాలకులు విభేదాలు సృష్టించి తమ పబ్బం గడుపుకొంటున్నారని ధ్వజమెత్తారు. ఈ అసమర్థ ప్రభుత్వానికి ప్రజలు త్వరలోనే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. రాజధాని రైతుల మహా పాదయాత్రకు జనం నీరాజనాలు పలికారు. దారిపొడవునా స్థానికులు, విద్యార్థులు వారితో కలిసి పాదం కదిపారు. మూడు రాజధానుల పేరిట నాటకాలాడుతున్న ముఖ్యమంత్రి ఆటలు కట్టిపెట్టి.. ఏకైక రాజధానిగా అమరావతిని కొనసాగించాలని రైతులు డిమాండ్ చేశారు. ఆదివారం గుడివాడలో ఉద్రిక్తతల మధ్య జరిగిన యాత్ర.. సోమవారం నాగవరప్పాడు నుంచి ప్రారంభమైంది. టీడీపీ సీనియర్ నేతలు దేవినేని ఉమామహేశ్వరరావు, రావి వెంకటేశ్వరరావు యాత్రలో పాల్గొన్నారు. స్థానికులు, విద్యార్థులు దారిపొడవునా రైతులకు ఘనస్వాగతం పలికారు. 'జై అమరావతి' నినాదాలతో మార్మో గించారు. ఏకైక రాజధానిగా అమరావతే ఉండాలనే అభిప్రా యాన్ని వ్యక్తం చేశారు. జగన్నాథపురం, నందివాడ గ్రామాల ప్రజలు అమరావతి రైతుల స్వామివారి రథానికి గుమ్మడి కాయలు,కొబ్బరి కాయలు కొట్టి సాదరంగా ఆహ్వానించారు. రైతులతో అడుగులో అడుగువేసి సంఘీభావం తెలిపారు.

సీపీఐ సంఘీభావం

సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డేగా ప్రభాకర్, సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ కార్యదర్శి బండి వెంకటేశ్వరరావు, కార్యకర్తలు పాదయాత్రకు స్వాగతం పలికి ప్రత్యక్షంగా పాల్గొన్నారు. జిల్లా నలుమూలల నుంచి తరలివచ్చిన ప్రజలు, నాయకులు అమరావతి రైతులకు సంఘీభావం ప్రకటించారు. సీపీఐ నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మూడు రాజధానులు అంటూ మూడు ముక్కలాట ప్రారంభించిందని ఎద్దేవా చేశారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి జగన్ 13 జిల్లాల రాష్ట్రానికి అమరావతి రాజధానిగా ఉండాలని 30 వేల ఎకరాలతో రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత కుల, ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడుతున్నారని విమర్శిం చారు. దేశంలో కోర్టుతో అనేకసార్లు చివాట్లు తిన్న ముఖ్యమంత్రి జగన్ తప్ప మరొకరు లేరన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన మ్యాప్‌లో అమరావతిని రాజధానిగా గుర్తించి, రాష్ట్ర అత్యున్నత న్యాయ స్థానం అమరావతిని ఏకైక రాజధానిగా పరిగణిం చినప్పటికీ అసెంబ్లీ సాక్షిగా మూడు రాజధానులకు కట్టుబడి ఉన్నామంటూ ముఖ్యమంత్రి ప్రకటించడం నియంతృత్వ పోకడలకు నిదర్శనం అన్నారు. ఈ పాదయాత్రలో సీపీఐ ఏలూరు జిల్లా కార్యవర్గ సభ్యుడు పుప్పాల కన్నబాబు, కొండేటి బేబి, మన్నవ లక్ష్మీ సౌభాగ్యం, అడ్డగర్ల ఇందిర, మన్నవ యామిని, ఎం.తులసి, సాయన బాలు, పిచ్చేటి శ్రీను, సోమేశ్వరరావు, ఆర్ పెద్దిరాజు, రాజు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అందరికీ 62 ఏళ్లు వర్తింపజేయాలి

ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులతోపాటు ప్రభుత్వ రంగ ఉద్యోగులందరికీ 60 నుంచి 62 ఏళ్ల పదవీ విరమణ వయసు పెంపును వర్తింపజేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేస్తూ ఆర్థికశాఖ 2022 జనవరి 31న ఉద్యోగుల పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ ఉత్తర్వులు జారీచేసిందని గుర్తుచేశారు. దీని అమలు కోసం ఈనెల 23న మెమో నంబరు-1813129(ఫైల్ నెంబర్1/212 హెచ్ఆర్ 4)ను ప్రభుత్వం విడుదల చేసిందని వివరించారు. 62 ఏళ్ల వయసు పెంపును నాలుగు విభాగాల ప్రభుత్వ ఉద్యోగులకే పరిమితం చేసి, మిగతా ప్రభుత్వ రంగ సంస్థలు, కార్పొరేషన్లు, ఇనిస్టిట్యూట్లు, కంపెనీలు, సొసైటీలు, విద్యా సంస్థలు, విశ్వవిద్యాలయాల బోధనేతర సిబ్బందికి వర్తించబోదని పేర్కొనడం అన్యాయమనీ, దీనిని ఏఐటీయూసీ ఖండిస్తోందన్నారు. ఇది పూర్తిగా వివక్షతతో కూడిన నిర్ణయమని, ఉత్తర్వులను సవరించి, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు సహా అందరికీ 62 ఏళ్ల వయసును వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. వేతన ఒప్పందం సమయంలో ఉద్యోగులకు దక్కాల్సిన న్యాయమైన ఫిట్‌మెంట్ ప్రయోజనాలను పక్కదారి పట్టించడానికిగాను అడగకపోయినా పదవీ విరమణ వయసును 60 నుంచి 62 ఏళ్లకు పొడిగిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చిందని, దీని ద్వారా ఉద్యోగులకు తీరని నష్టం జరిగిందని విమర్శించారు. పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి...చేతులెత్తేసిందని, తెరపైకి జీపీఎస్ తీసుకొచ్చి కొత్త నాటకాలాడుతోందని మండిపడ్డారు. గతంలో 58 నుంచి 60 ఏళ్లకు వయసు పెంచినప్పుడు దశలవారీగా అన్ని విభాగాలకు దీనిని వర్తింపచేశారని గుర్తుచేశారు. ఈ విధానాన్ని జగన్ ప్రభుత్వం పాటించాలని, లేకుంటే ఉద్యమానికి సమాయత్తమవుతామని హెచ్చరించారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

మంత్రి బొత్సకు ఎస్టీయూ వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: పురపాలక/నగర పాలక సంస్థల పాఠశాల ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని ఎస్టీయూ డిమాండ్ చేసింది. విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణకు ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.సాయిశ్రీనివాస్, హెచ్.తిమ్మన్న సోమవారం వివిధ సమస్యలపై వినతిపత్రం అందజేశారు. పురపాలక ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు డీడీవో అధికారాలిచ్చి, అక్టోబర్ నుంచి వేతనాలు డ్రా చేసేలా చర్యలు తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు ఎంఈవో ద్వారా వేతనాలు చెల్లిస్తామన్నారు. భవిష్యత్తులో పట్టణ విద్యాధికారుల పోస్టుల భర్తీకి చర్యలు తీసుకుంటామని, మున్సిపల్ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ప్రతిపక్షాల ఐక్యత అవశ్యం : నితీశ్

న్యూఢిల్లీ: 2024 లోక్‌సభ ఎన్నికల్లో ప్రతిపక్షాలు కలిసి పోరాడే అవకాశాలు మెండుగా ఉన్నాయని బీహార్ ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్ సోమవారం మీడియాకు వెల్లడించారు. తాను చాలామంది ప్రతిపక్ష నేతలతో చర్చలు జరిపానని, క్రమంగా అందరూ చేతులు కలుపుతారని స్పష్టం చేశారు. తన ఐక్యతా చర్చలను బీజేపీ ఎగతాళి చేయడాన్ని ఆయన కొట్టిపడేశారు. అధికార పార్టీకి చాలా సమస్యలు ఉన్నాయని, వారు చేయగలిగిందల్లా పగలు రాత్రి మాట్లాడటమేనని విమర్శించారు. వివిధ పార్టీల నాయకులతో తన చర్చలు సుహృద్భావంగా జరిగినట్లు నితీశ్ వెల్లడించారు. కాంగ్రెస్‌ను వ్యతిరేకించే తృణమూల్ కాంగ్రెస్, ఆమ్ ఆద్మీ పార్టీలు కూడా ప్రతిపక్షాల కూటమిలో భాగమవుతాయా అని అడగ్గా... పొత్తు గురించి ఒక ఒప్పందం కుదిరిన తర్వాత మాత్రమే ఏదైనా నిర్దిష్టంగా చెప్పగలమని నితీశ్ అన్నారు. అదే సమయంలో తాను కలిసిన నేతలందరి గురించి మీడియాకు తెలిసే ఉంటుందన్నారు. ఆదివారం ఆర్జేడీ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్‌తో కలిసి కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా గాంధీని కుమార్ కలిశారు. ఇంతకుముందు ఢిల్లీ వచ్చినప్పుడు నితీశ్... ఆప్ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌ను కలిశారు. కాగా నితీశ్‌కుమార్, ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్, ఎస్పీ అధినేత అఖిలేశ్‌యాదవ్‌లతో కలిసి బీజేపీని ఓడిస్తామని టీఎంసీ అధినేత్రి, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా ఇటీవలే చెప్పారు. కాగా ఆదివారం ఫతేహాబాద్‌లో జరిగిన ర్యాలీలో నితీశ్‌కుమార్, ఎన్సీపీ అధినాయకుడు శరద్ పవార్, ఇతర ప్రముఖ ప్రతిపక్ష నాయకులు పాల్గొన్నారు. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీని ఓడించేందుకు కాంగ్రెస్‌తో కూడిన కొత్త కూటమికి వీరంతా పిలుపునిచ్చారు.

విరాళాలిచ్చి మహాసభలు జయప్రదం చేయండి

- గడపగడపకూ సీపీఐ మాస్ క్యాంపెయిన్ ప్రారంభం
- ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడేది ఎర్రజెండానే
- సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య

విశాలాంధ్ర-కడప: సీపీఐ 24వ జాతీయ మహాసభలు అక్టోబర్ 14 నుంచి 18 వరకు విజయవాడలో జరగనున్న తరుణంలో ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సీపీఐ, మహాసభల జయప్రదం కోసం సోమవారం బద్వేల్ పట్టణంలో గడపగడపకు-సీపీఐ(మాస్ క్యాంపెయిన్) కార్యక్రమాన్ని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గుజ్జుల ఈశ్వరయ్య ప్రారంభించారు. దేశంలో రెండోసారి బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని, అదానిలాంటి వ్యక్తిని ప్రపంచ కుబేరులుగా మార్చిన ఘనత మోదీకే దక్కిందని ఈశ్వరయ్య అన్నారు. బీజేపీ పాలనలో దేశ ప్రజలందరికీ సరైన తిండి, పని భద్రతలేక అవస్థలు పడుతున్నారని తెలిపారు. మహిళలపై, విద్యార్థినిలపై దాడులు అధికమయ్యాయనీ, ఉత్తరాఖండ్‌లో బీజేపీ నేత కుమారుడు, యువతిని హత్యచేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడనీ, అంటే వారికి బీజేపీ అండ దండలు ఎలా ఉన్నాయో అర్థమవుతోందన్నారు. ప్రజాస్వామ్య లౌకిక వాదాన్ని అపహాస్యం చేస్తూ మను ధర్మ రాజ్యాంగాన్ని అమలు చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తోందని, అక్టోబర్‌లో జరగబోయే జాతీయ మహాసభలో ప్రత్యామ్నాయ రాజకీయాల వైపు అడుగులు వేయడానికి అన్ని రాజకీయ పార్టీలను ఏకం చేసి బీజేపీని అంతమొందించడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. రాష్ట్రంలో జగన్ ప్రభుత్వం ల్యాండ్ మాఫియా, వైన్ మాఫియాకు పాల్పడుతూ ఇది చాలదన్నట్లు వ్యక్తిగత స్వార్థంతో ప్రతి పథకానికి తన మార్కు ఉండే ప్రయత్నం చేస్తున్నారని, ఉన్నత విద్య అభ్యసించే వైద్యుల యూనివర్సిటీకి సైతం పేరు మార్చడానికి రాత్రికి రాత్రే బిల్లు ప్రవేశ పెట్టడం అసహ్యంగా ఉందని, ఇలాంటి ముఖ్యమంత్రి పక్కనున్న తమిళనాడు ప్రభుత్వాన్ని అయినా చూసి బుద్ధి తెచ్చుకోవాలని, ప్రతిపక్షాలను ప్రజలను విస్మరించిన ఏ ప్రభుత్వాలు బతికి బట్ట కట్టిన దాఖలాలు లేవన్నారు. మిగిలిన రెండేళ్ల కాలంలోనైనా ప్రజారంజక పాలన చేస్తే ప్రజలే రక్షిస్తారని, లేకుండా చంద్రబాబు గతే పడుతుందని హెచ్చరించారు. బద్వేలు నియోజకవర్గంలో నిరంతరం ప్రజా సమస్యలపై గళం విప్పుతున్న సీపీఐ ప్రజల నుంచి వారికి తోచిన విధంగా ఆర్థిక సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ విరాళాల సేకరణ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు వీర శేఖర్, ఏరియా కార్యదర్శి జకరయ్య, పట్టణ కార్యదర్శి బాలు, టీం లీడర్స్ సంజీవ రాయుడు, పెంచలయ్య, ఇమ్మానియేల్, కాకి మల్ల సుబ్బరాయుడు, పట్టణ నాయకులు సుబ్రమణ్యం, నాగ సుబ్బయ్య, సుబ్బారెడ్డి, మునగల సుబ్బరాయుడు, మురలక్ష్మమ్మ, ఖైరున్నీసా, పాండు దేవదాసు, రమణయ్య, ఏఐఎస్ఎఫ్ నాయకులు లక్ష్మణ్ పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభలకు

ఏఐటీయూసీ విజయనగరం జిల్లా సమితి రూ.లక్ష విరాళం

విశాలాంధ్ర-విజయనగరం రూరల్: సీపీఐ జాతీయ మహాసభల నిర్వహణ కోసం ఏఐటీయూసీ రాష్ట్ర సమితికి విజయనగరం జిల్లా సమితి నుంచి ఎస్.రంగరాజు, బుగత అశోక్, పురం అప్పారావు లక్ష రూపాయల నగదును ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్‌కు అందజేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ, నాయకులు కె.స్రవంతి, ఎస్ రామ చంద్రరావు, టీవీ రమణ, టి.జీవన్, ఆర్గనైజింగ్ కార్యదర్శి ఎం.మురళీధర్, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

సీపీఐ జాతీయ మహాసభల జయప్రదానికి

ఏఐటీయూసీ విస్తృత ప్రచారం

విశాలాంధ్ర-తెనాలి: ప్రజల హక్కులు, ప్రజాస్వామ్యం, లౌకిక, రాజ్యాంగ వ్యవస్థ పరిరక్షణ కోసం వామపక్ష ఉద్యమాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని వెలుగూరి రాధాకృష్ణమూర్తి స్పష్టంచేశారు. ఇందుకోసం సీపీఐని పటిష్ఠమంతం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని వ్యాఖ్యానించారు. సీపీఐ 24వ జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ తెనాలి పట్టణ పరిధిలో సోమవారం విస్తృత ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ జాతీయోద్యమ కాలం నుండి కమ్యూనిస్టు పార్టీ ఉద్యమాలు, ప్రజాపోరాటాలు చేస్తోందన్నారు. నరేంద్రమోదీ అధికారంలోకి వచ్చాక ప్రజాకంటక విధానాలు అమలు చేస్తున్నారని, ప్రభుత్వ రంగ సంస్థలను కారుచౌకగా కార్పొరేట్ శక్తులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. మోదీ సర్కారు ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలపై సీపీఐ జాతీయ మహాసభలు స్పష్టమైన కార్యాచరణ రూపొందిస్తాయని తెలిపారు. ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి హనుమంతరావు మాట్లాడుతూ శ్రమ దోపిడికి వ్యతిరేకంగా, పెట్టుబడిదారీ వర్గాల పాలిట సింహస్వప్నంగా కమ్యూనిస్టు పార్టీ నిలిచిందన్నారు. అక్టోబరు 14వ తేదీన విజయవాడలో జరిగే భారీ ప్రదర్శనను జయప్రదం చేయాలని కోరారు. మహాసభల జయప్రదం కోసం విరాళాలు అందించాలని పిలుపునిచ్చారు. ఏఐటీయూస తెనాలి ఏరియా అధ్యక్ష, కార్యదర్శులు గురుబ్రహ్మం, బీవీ రావు, బాలస్వామి, శ్రీకాంత్, మాచర్ల శివయ్య, తదితరులు పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా దసరా ఉత్సవాలు

దుర్గమ్మను దర్శించుకున్న గవర్నర్ దంపతులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలు సోమవారం అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 9 గంటలకు ప్రత్యేక పూజలు నిర్వహించి దుర్గమ్మను దర్శించుకునేందుకు భక్తులకు అనుమతిచ్చారు. తొలిరోజు కనకదుర్గమ్మ స్వర్ణ కవచాలంకృత దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. భక్తులు వినాయక గుడి నుంచి క్యూలైన్ల మార్గం ద్వారా ఇంద్రకీలాద్రి చేరుకుని దుర్గమ్మను దర్శించుకున్నారు. తొలుత అమ్మవారిని గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్ దంపతులు దర్శించుకున్నారు. అంతకుముందు ఇంద్రకీలాద్రి చేరుకున్న గవర్నర్ పంపతులకు దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఆలయ ఈవో డీ.భ్రమరాంబ స్వాగతం పలికారు. అమ్మకు మంగళ ద్రవ్యాలను గవర్నర్ దంపతులు సమర్పించారు. విశ్వ భూషణ్ దంపతులకు వేదపండితులు ఆశీర్వచనం అందిం చారు. రాష్ట్ర ప్రజలకు గవర్నర్ దసరా శుభాకాంక్షలు తెలియజేశారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు.

అందుబాటులోకి రాని వీఐపీ టికెట్లు!

శరన్నవరాత్రుల తొలి రోజైన సోమవారం వీఐపీ టికెట్లు అందుబాటులో రాలేదు. రూ.500 మాన్యువల్, ఆన్‌లైన్ టికెట్ల స్లాట్ ఓపెన్ చేయలేదు. విషయం తెలుసుకున్న దేవాదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ వీఐపీ టికెట్ కౌంటర్ వద్దకు వెళ్లి పరిశీలించారు. మాన్యువల్, ఆన్‌లైన్ టికెట్లు ఎందుకు అందుబాటులోకి రాలేదని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈవో భ్రమరాంబతో ఫోన్‌లో సంభాషించారు. వెంటనే ఆన్‌లైన్ స్లాట్ టికెట్లు ఓపెన్ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. తొలి రోజు వీఐపీ టికెట్లు లేకుండానే చాలామంది అమ్మను దర్శించుకున్నారు.

భర్త కళ్లెదుటే సామూహిక అత్యాచారం

మెదినీనగర్(జార్ఖండ్): జార్ఖండ్‌లోని పాలము జిల్లాలో 22 ఏళ్ల మహిళపై ఆమె భర్త ఎదుట ఆరుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారని పోలీసులు సోమవారం తెలిపారు. నిందితులను అరెస్టు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు. ఈ ఘటన సత్బర్వా పోలీస్‌స్టేషన్ పరిధిలోని బకోరియా భలువాహి లోయ సమీపంలో జరిగిందని పాలము ఎస్పీ చందన్ కుమార్ సిన్హా తెలిపారు. పలాము జిల్లాలోని పటాన్ పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని తన అత్తమామల నివాసంలో గొడవ జరిగిన నేపథ్యంలో ఆ మహిళ శనివారం కాలినడకన లాతేహార్ జిల్లాలోని మానికా పోలీస్ స్టేషన్ ప్రాంతంలోని తన తండ్రి ఇంటికి బయలుదేరింది. మహిళ కోసం వెతకడానికి ఆమె భర్త, అతని బంధువుల్లో ఒకరు మోటార్ సైకిల్‌పై బయలుదేరారు. మహిళ భర్త పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలం ప్రకారం, అతను ఇంటికి తిరిగి రావాలని ఆమెను ఒప్పిస్తుండగా, ఆరుగురు వ్యక్తులు మోటారు సైకిళ్లపై వచ్చి, అతడిని, బంధువుపై తీవ్రంగా దాడిచేసి, అతని భార్యను సమీపంలోని ప్రదేశానికి తీసుకువెళ్లి అతడు చూస్తుండగానే ఆమెపై అత్యాచారం చేశారు.



ఆరుగురు నిందితుల్లో ఇద్దరు



"కిరాతక పాలకుల స్థానంలో
మరింత కర్కోటక
పాలకులే వస్తారు"
- చేగువేర



సీపీఐ 24వ జాతీయ మహాసభలు

అక్టోబర్ 14-18, 2022
విజయవాడ

ఆంధ్ర మహాసభను రాజకీయ బాట పట్టించిన

రావి నారాయణ రెడ్డి

తెలుగువారికి రావి నారాయణ రెడ్డి (1908 జూన్ 5 – 1991 సెప్టెంబర్ 7) ఎవరో ప్రత్యేకంగా చెప్పవలసిన అగత్యం లేదు. ఆయన పెద్ద భూస్వామ్య కుటుంబలో పుట్టినా తన కుటుంబ అవసరాల మేరకు మాత్రమే కొద్దిపాటి భూమి ఉంచుకుని మిగతాతాదంతా పేదలకు పంచి పెట్టారనీ చెప్పాల్సిన పని లేదు. ఆయన తెలంగాణ సాయుధ సమర సేనాని అని కూడా తెలియజేయాల్సిన అవసరం లేదు. 1952లో మొట్ట మొదటి సార్వత్రిక ఎన్నికలలో నెహ్రూ కన్నా ఎక్కువ ఓట్లు సంపాదించి రికార్డు నెలకొల్పారని చెప్పడమూ చర్విత చర్వణమే అవుతుంది.

రావి నారాయణ రెడ్డి తెలంగాణ ప్రజలను జాగృతం చేసి సాయుధ పోరాటానికి సమాయత్తం చేసే దశకు ఎలా చేర్చగలిగారన్నదే భావి తరాలు గ్రహించవలసిన విషయం. 1930లో ఆంధ్ర మహాసభ ఏర్పడినప్పటి నుంచీ ఆయనకు దానితో సంబంధం ఉంది. 1931లో దేవరకొండలో జరిగిన రెండవ ఆంధ్ర మహాసభకు తోటి యువకులను వెంట తీసుకుని 90 కిలోమీటర్లు పాదయాత్ర చేసి వెళ్లిన సాహసి ఆయన.

ఆఖరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ నిరంకుశ పాలనలో తెలుగు భాషా సంస్కృతులను అణగదొక్కారు. తెలుగుకు అస్తిత్వమే లేకుండా పోయే దశలో మొదట ఆంధ్ర జన సంఘం ఏర్పడింది. అదే ఆంధ్ర మహాసభగా పరివర్తన చెందింది. ఆంధ్ర మహాసభలు నిర్వహించుకోవడానికి నిజాం ప్రభుత్వం అనుమతి సంపాదించడమే దుర్లభమైన రోజులవి. ఆంధ్ర మహాసభలో సాంఘిక అంశాలు తప్ప రాజకీయాంశాలు చర్చించడానికి వీల్లేదన్న ఆంక్ష ఉండేది. కానీ రావి నారాయణ రెడ్డి ఆయన సహచరులు 1934 నుంచి ఆంధ్ర మహాసభ స్వరూపాన్నే క్రమంగా మార్చగలిగారు. ఆంధ్ర మహాసభ చర్చల్లో రావి నారాయణ రెడ్డి చాలా క్రియాశీలంగా ఉండేవారు. తెలుగు భాషా సంస్కృతుల పరిరక్షణ పేరుతో భాషా దురభిమానం

వ్యక్తం చేసే ధోరణిని ఆయన ఎదుర్కొన్నారు. రావి నారాయణ రెడ్డి లాంటి వారి చొరవవల్లే 1937లో నిజామాబాద్‌లో జరిగిన ఆంధ్ర మహాసభలో బాధ్యతాయుత ప్రభుత్వం ఏర్పాడాలని తీర్మానం ఆమోదించారు. పైకి బాధ్యతాయుత ప్రభుత్వం అని సౌమ్యంగా చెప్పినా అది నిజాం నిరంకుశత్వాన్ని అంతమొందించాలని కోరడమే. దీనితో ఆంధ్ర మహాసభ రాజకీయ చర్చలకు వేదిక అయింది.

ఆంధ్రమహాసభల్లో రావి నారాయణ రెడ్డి ఎప్పుడు మాట్లాడినా అంతర్జాతీయ సమస్యలు, ప్రపంచ ఆర్థిక పరిస్థితి మొదలైన అంశాలు ప్రస్తావించకుండా ఉండే వారు కాదు. రావి నారాయణ రెడ్డి రాజకీయ పరిణామంలో క్రమోన్మీలనం విశిష్టమైంది. ఆంధ్రమహాసభ ప్రారంభించిన సాంస్కృతికోద్యమాన్ని ఆయన క్రమంగా సాయుధ పోరాటంగా పరివర్తించేట్టు చేసిన గొప్ప నాయకుడు.

1946-48 కాలంలో హైదరాబాదు సంస్థానంలో మతదురహంకారులైన రజాకార్ల ఆగడాలను అరికట్టడానికి అజ్ఞాతంగా ఎన్నో గెరిల్లా దళాలను ఏర్పాటుచేసాడు. 1941, 1944, 1945 లో రావి నారాయణ రెడ్డి ఆంధ్ర మహాసభ అధ్యక్షులయ్యారు. రావి నారాయణ రెడ్డి రెండేళ్లు జైలులోనూ, అయిదేళ్లు అజ్ఞాతంగాను గడిపారు.

1957లో భువనగిరి నుంచి శాసనసభ్యులయ్యారు. 1962లో రెండో సారి లోకసభకు ఎన్నికయ్యారు. అరవై ఏళ్ల వయసు రాగానే ప్రజా జీవితంలోని అన్ని బాధ్యతలనుంచి స్వచ్ఛందంగా తప్పుకున్నారు. తెలంగాణ సాయుధ పోరాటంలో పాల్గొన్న వారూ స్వాతంత్ర్య సమరయోధులేనని కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించినందువల్లే అనేక మందికి పింఛన్లు దక్కాయి.

తొలి పార్లమెంటు సమావేశాలు 1952 ఏప్రిల్ 17న మొదలయ్యాయి. అప్పుడు పార్లమెంటు హాలులోకి మొట్ట మొదట అడుగుపెట్టిన వ్యక్తి పండిత్ నెహ్రూ కాదు. సర్దార్ పటేలూ కాదు. ఆ మొదటి కాలు మోపిన వ్యక్తి రావి నాయాన రెడ్డి. లోకసభకు ఎన్నికైన వారందరికన్నా ఎక్కువ ఓట్లు సంపాదించినందుకు ఆయనకు ఆ గౌరవం దక్కింది. 1946 నుంచి సాగిన తెలంగాణ సాయుధ రైతాంగ సమర సేనాని ఆయన. తొలి పార్లమెంటు ఎన్నికలలో దేశంలో అందరు ఎంపీలకన్నా, ఆ మాటకొస్తే పండిత్ నెహ్రూకన్నా ఎక్కువ ఓట్లు సంపాదించినందుకు రావి నాయాయణ రెడ్డికి పార్లమెంటులో మొదటి అడుగు మోపే అవకాశం వచ్చింది.

– భరద్వాజ

ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం సృష్టికర్త హస్రత్ మోహానీ

ఇంక్విలాబ్ జిందాబాద్ నినాదం విన్నారా.... భారత స్వాతంత్ర సంగ్రామ సమయంలో పుట్టిన ఈ నినాదాన్ని ఎవరు పుట్టించారో తెలుసా... ఈ ఒక్క నినాదానికి దేశం యావత్తు వెన్నుముక మీద నిటారుగా నిలబడి బ్రిటీష్ వారిని దేశం నుంచి తరిమికొట్టిన సంగతి గుర్తుందా! దీని సృష్టికర్త, ఈ నినాదానికి పురుడు పోసిన ధీరుడు మౌలానా హస్రత్ మోహాని. నా జీవితమంతా విప్లవమే. అదే నా మతం అని ప్రపంచానికి చాటి చెప్పిన కమ్యూనిస్టు మౌలానా హస్రత్ మొహాని. దేశానికి సంపూర్ణ స్వాతంత్ర రావాలని కలలు కన్నవాడు. ఆ కల నిజం కావడం కోసం స్వాతంత్ర సంగ్రామంలో పాల్గొన్న దేశ భక్తుడు. తన గజల్స్‌తో యువతరాన్ని ఉద్రూతలూగించిన మౌలానా హస్రత్ మొహాని తాను భారతదేశ ముస్లింనని సగర్వంగా చెప్పుకునే వారు. స్వాతంత్ర సంగ్రామ సమయంలో ఆనాటి కాంగ్రెస్ పార్టీలో చురుకైన పాత్ర పోషించిన మౌలానా ముస్లీం లీగ్లోనూ కీలకంగా వ్యవహరించారు.



1925లో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) ఆవిర్భావానికి కృషి చేసిన మహనీయుల్లో మౌలానా హస్రత్ మొహానీ కూడా ఒకరు. తన పురిటిగడ్డ కాన్పూరులో మొట్టమొదటగా సిపీఐ పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయడంతో పాటు ఈ కార్యాలయంపై ఎర్రజెండాను ఎగురవేసింది కూడా ఆయనే. ఈ విషయాన్ని ఆయన తాను బతికి ఉన్నన్ని రోజులూ చాలా గర్వంగా చెప్పుకునే వారు. సిపిఐ పురుడు పోసుకున్న 1925 సంవత్సరం డిసెంబర్ 25, 26 తేదిల్లో కాన్పూర్లో జరిగిన తొలి సమావేశానికి ఆహ్వాన కమిటికి అధ్యక్షుడిగా వ్యవహరించిందీ మౌలానా హస్రత్ మొహాని కావడం పార్టీ ఆయనికిచ్చిన గౌరవం. ఆ సమావేశంలో ప్రారంభోపన్యాసం చేసిన మౌలానా పార్టీ పట్ల తన విధేయతను ప్రకటించడమే కాదు పార్టీకి దిశనిర్దేశం కూడా చేశారు. "కమ్యూనిస్టు పార్టీ రైతులు, కార్మికుల పక్షాన పని చేస్తుంది. దేశ ప్రజలు కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతాలకు, కార్యచరణకు మద్దతు పలుకుతారు. కాని కొన్ని వర్గాల వారు మాత్రంకొన్ని అపోహల కారణంగా కమ్యూనిజం అనే పదం వింటేనే భయపడిపోతారు. ఈ అపోహలను కారణాలుగా చూపిస్తూ కమ్యూనిజం పట్ల పెట్టుబడిదారులు వ్యతిరేక ప్రచారం చేస్తారు. దీన్ని సమర్థవంతంగా తిప్పికొట్టగలగాలి" అన్నారు. దేశానికి స్వాతంత్ర్యం రావడమంటే సంపూర్ణంగా స్వేచ్ఛ సిద్ధించడమేనని, అలాంటి స్వేచ్ఛ వచ్చిన తర్వాత దేశంలో సోవియట్ రిపబ్లిక్లో అవలంబిస్తున్న విధి విధానాలు ఇక్కడ కూడా అమలయ్యేలా చూడాలని కుండ బద్దలు కొట్టినట్లుగా తన అభిప్రాయాలను చెప్పారు మౌలానా. మరోవైపు దేశ స్వాతంత్ర కోసం పోరాడుతూనే దేశంలోని రైతులు, కార్మికుల సంక్షేమం కోసం పోరాడాల్సిన ఆవశ్యకతను గట్టిగా వినిపించేవారు. భారత కమ్యూనిస్టు పార్టీ పూర్తిగా భారతదేశానికి చెందినదేనని, అయితే ఇతర దేశాలలో... ముఖ్యంగా మూడో ప్రపంచ దేశాలలో జరిగే ఉద్యమాలకు మాత్రం సంఘీభావం తెలపాల్సిందేనని నిక్కచ్చిగా చెప్పిన అచ్చమైన కమ్యూనిస్టు మౌలానా.

అలాగే కమ్యూనిస్టు పార్టీ పట్ల కొందరు ముస్లింలలో ఉన్న అపోహలను సైతం తప్పుగా అభివర్ణించారు. కమ్యూనిజం ఇస్లాంకు వ్యతిరేకమని కొందరు ముస్లీం నాయకులు భావిస్తారు. అది పూర్తిగా అవాస్తవం అని దానికి ఉదాహరణలు సైతం చూపించారు. ఇస్లాం మతం పెట్టుబడిదారీ విధానాలకు పూర్తి వ్యతిరేకం అంటూ ఇస్లాంలో ఉన్న వారి అపోహలను సైతం తొలగించే ప్రయత్నం చేశారాయన. "నేను మొదట జాతీయ వాదిని. కాని 1925 నాటికి నేనే దాన్ని వదిలేశాను. కమ్యూనిస్టు పార్టీ సభ్యుడ్ని అయ్యాను. అవును నేను పూర్తిస్థాయి కమ్యూనిస్టుని" అని చెప్పుకున్న మౌలానా హస్రత్ మొహానీ జీవితాంతం కమ్యూనిస్టుగానే గడిపిన మౌలానా సోషలిజంపై రాసిన వాస్యాలు చాలా ప్రాచుర్యం పొందాయి. ముఖ్యంగా పండిత్ నెహ్రు అండ్ సోషలిజం, ఇస్లాం అండ్ సోషలిజం వ్యాసాలు సిద్ధాంతపరంగాను, రెంటి మధ్య వైరుధ్యాలను కళ్లకు కట్టినట్లు ఉంటాయి. సామాజిక కార్యకర్తగా, కమ్యూనిస్టుగా, జర్నలిస్టుగా, కవిగా, విమర్శకుడిగా బహుముఖీనంగా జీవించిన మౌలానా తన చివరి శ్వాస వరకూ పరిపూర్ణమైన మానవుడిగానే ఉన్నారు. 1951 వ సంవత్సరం మే 13న లక్నోలో తుది శ్వాస విడిచారాయన. ఆయన మరణానంతరం భారతదేశంలోనే కాదు పొరుగు దేశమైన పాకిస్థాన్లో స్మారక హాల్, ఓ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసింది అక్కడి ప్రభుత్వం. మౌలానా హస్రత్ మోహనీ తన సేవలతో అటు దేశానికి, ఇటు కమ్యూనిస్టు పార్టీకి కూడా చిరస్మరణీయుడిగానే మిగిలారు.

– సి.ఎం.

1955లో సీపీఐ కేంద్ర కమిటీ సభ్యుల గ్రూప్ ఫోటో

వర్తమానం

ప్రశ్నించడం
పిడికిలి బిగించడం
చేయెత్తి నినదించడం
ఇప్పుడివేమిలేవు

ఆకాశానికి నిచ్చెన వేయడం
పైకెక్కే వాడిని కిందకు లాగడం
నవ్వుతువెన్నునపోటు పొడవడం
ఇప్పుడున్నవివే!
తోటి మనిషిని ప్రేమించడం
సాటి మనిషికి సాయపడడం
కరుణతొ గుండె తడవడం
ఇప్పుడివేమిలేవు

అడ్డదారులు తొక్కడం
అవినీతికి గులాములవడం
అమానుషత్వం తలకెక్కడం
ఇప్పుడున్నవివే!

సిద్ధాంతాలను గౌరవించడం
ఆదర్శాలకు పాటు పడడం
నమ్మిన వారికి దారి చూపడం
ఇప్పుడివేమిలేవు

ఇతరుల సొమ్మును దోచుకోవడం
పరుల నాశనం కోరుకోవడం
తరగని ఆస్తులు కూడబెట్టడం
ఇప్పుడున్నవివే !

అడవులు నరికి గుట్టలు తొలిచి
గాలీ నీరు ప్రకృతి చెరచి
శాంతీ సౌఖ్యం పాతర వేసీ
విషపు చుక్కలొకటొకటిగ వేసి
విశ్వమునంతను వేడెక్కించిన
మనిషి మనుగడకు భద్రతలేదు
ఇప్పుడున్నవివే!

– చింతపట్ల సుదర్శన్

రాజాజీని నల్లకళ్ల జోళ్లు తీయమన్న పిల్లలమర్రి

గుంటూరు జిల్లా మంచాడ అగ్రహారంలో 1912లో జన్మించిన పిల్లలమర్రి వెంకటేశ్వర్లు 1946 నుంచి 1967 దాకా రెండు దశాబ్దాలకు పైన శాసనసభ్యుడిగా ఉన్నారు. కోస్తా ఆంధ్ర ప్రాంతం ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో అంతర్భాగంగా ఉన్నప్పటి నుంచి, 1953లో ఆంధ్ర రాష్ట్రం ఏర్పడినప్పుడు, ఆ తరవాత ఆంధ్రప్రదేశ్ లోనూ పిల్లలమర్రి కమ్యూనిస్టు పార్టీ తరఫున శాసనసభ్యుడిగా పని చేశారు.

ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో ఉన్నప్పుడు రాజాజీ ముఖ్యమంత్రి. అప్పుడు తెలుగు వారి తరఫున ఎన్నికైన ఏకైక కమ్యూనిస్టు సభ్యుడు పిల్లమర్రే. అయినా శాసనసభలో రాజాజీని గడగడలాడించే వారు. ఒక సారి "ఆ నల్ల కళ్లజోళ్లు తీసి చూడండి" అని నిలదీయగలిగారు. పిల్లలమర్రికి పై చదువులు లేవన్న లోటే తప్ప అధ్యయనానికి కొదవ లేదు. గంటలు గంటలు గ్రంథాలయంలో గడిపి దొరికిన ఇంగ్లీషు, తెలుగు పత్రికలు చదివేవారు. మోడరన్ రివ్యూ, యంగ్ ఇండియా, కాంగ్రెస్ లోని అతివాదులు నడిపే పత్రికలు చదువుతూ ఉండే వారు. కాంగ్రెస్ నాయకులతో ఆ పార్టీ విధనాల గురించి చర్చించేవారు.

భగత్ సింగ్‌కు మరణశిక్ష విధించిన సమయంలోనే గాంధీ రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరు కావడానికి వెళ్తున్నారు. ఆ మరణశిక్ష రద్దు చేయాలని దేశమంతా ఆందోళనలు జరిగాయి. రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనటానికి భగత్ సింగ్, తదితరుల పై మరణశిక్షను రద్దుచేయాలని గాంధీ షరతు పెట్టాలని యువజనులు భావించారు. కాని, మహాత్మాగాంధీ అలా చేయనందువల్ల యువజనులలో కాంగ్రెస్ పై తీవ్ర అసంతృప్తి, టెర్రరిస్టు ఉద్యమం పై అభిమానం పెల్లుబికాయి. ఆ అసంతృప్తి పిల్లమర్రిని కూడా ఆలోచింపచేసింది.

పోలే పెద్ది నరసింహమూర్తి సాహచర్యం పిల్లలమర్రిని మార్క్సిజంవేపు ఆకర్షించింది. గోర్కీ అమ్మ నవల, యూత్ ఇన్ సోవియట్ రష్యా, లెనిన్ ఆన్ రెలిజియన్, స్టేట్ అండ్ రెవల్యూషన్, పారిస్ కమ్యూన్, గతి తార్కిక భౌతికవాదం, చారిత్రక భౌతికవాదం మొదలైన పుస్తకాలు చదివి పిల్లలమర్రి మార్క్సిజం అర్థం చేసుకున్నారు. పోలేపెద్ది నరసిం హమూర్తి ప్రోత్సాహంతో పిల్లలమర్రి క్రమంగా కార్మిక సంఘాలలో పని చేయడం మొదలు పెట్టారు. కొంతకాలం తరువాత త్యాగమూర్తి, పార్టీ నిర్మాత అయిన పుచ్చలపల్లి సుందరయ్యతో పరిచయం కలిగింది. గుంటూరులో ఆనాడు కమ్యూనిస్టు పార్టీ నాయకులైన జొన్నలగడ్డ రామలింగయ్య, దుర్భా కృష్ణ మూర్తి, ప్రతాప రామసుబ్బయ్యతో కలిసి పిల్లలమర్రి పని చేశారు. పార్టీ ఆఫీసులోనే ఉంటూ పార్టీ కార్యకలాపాలు నిర్వహించారు.

1936లో రాజమండ్రిలో జరిగిన కాంగ్రెస్ సోషలిస్టు మహాసభలో పాల్గొన్నారు. రాష్ట్ర యువజనోద్యమంలో ఆయన పాత్ర విశేషమైంది. యువజన సంఘానికి గట్టిపునాదులు వేశారు. తరువాత పార్టీలో, ఆంధ్రదేశంలో కార్మికోద్యముం నిర్మించడంలో చాలా ప్రముఖమైన పాత్ర నిర్వహించారు. లేబర్ ప్రొటెక్షన్ లీగ్ ఏర్పాటు చేశారు. ఇదే తరువాత రాష్ట్ర ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ గా అభివృద్ధి చెందింది. ఈ సంస్థ ఆధ్వర్యంలో విజయవాడలో తోళ్ళ పనివారి సంఘం, స్టేట్ ప్రెస్ వర్కర్స్ యూనియన్, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏర్పరచి వాటిని బలవత్తరమైన సంస్థలుగా రూపుదిద్దడంలో పిల్లలమర్రి పాత్ర చెప్పుకోదగ్గది. ప్రెస్ వర్కర్స్ యూనియన్ అధ్వర్యంలో బెజవాడలో అనేక సమ్మెలు నడిపి, రాష్ట్ర మొత్తంమీద ప్రెస్ వర్కర్స్ యూనియన్ ని

స్థాపించి, ముఖ్యమైన పట్టణాలైన గుంటూరు, తెనాలి, ఏలూరు, రాజమండ్రి, కాకినాడ మొదలైనచోట్ల బలమైన కేంద్రాలుగా మలిచారు. ఏలూరులో జూట్ వర్కర్స్ యూనియన్ నిర్మాణంలోనూ, చీరాలలో టొబాకో వర్కర్స్ యూనియన్ నిర్మాణంలోనూ కృషి చేసి బలమైన యూనియన్ లను ఏర్పాటు చేశారు. ఫ్యాక్టరీల చట్టం, వర్కర్స్ కాంపెన్సేషన్ చట్టం, మెటర్నిటీ బెనిఫిట్సు చట్టాలవంటి వాటిని తెలుగులో అందించడానికి పిల్లలమర్రి కృషి అపారమైంది. 1952 ఎన్నికలలో పిల్లలమర్రి కమ్యూనిస్టు పార్టీ అభ్యర్థిగా జగ్గయ్యపేట నుంచి శాసనసభ్యుడయ్యారు. ఆయన 50 సంవత్సరాల రాజకీయ జీవితంలో 20 ఏళ్ల పైన శాసనసభలో గడిచింది. శాసనసభ్యుడిగా ఉన్నంత కాలం పిల్లలమర్రి ప్రజా ఉద్యమాల్లో పాల్గొంటూ, ఆ ఉద్యమాలను అసెంబ్లీలో లేవనెత్తే వారు. పెద్దగా చదువుకోక పోయినా పార్టీ సాహిత్యం చదవడం, ఇతర పార్టీలను గురించి కూడా అధ్యయనం చేయడంవల్ల శాసనసభలో రాణించారు.

– భరణి

మరపురాని మహోజ్వల ఘట్టం చిట్టగాంగ్ తిరుగుబాటు

తూర్పు బెంగాల్ (బంగ్లాదేశ్)లోని ఒక రేవు పట్టణం చిట్టగాంగ్. 1930 ఏప్రిల్ 18వ తేదీన తూర్పు బెంగాల్‌లోని చిట్టగాంగ్‌లో విప్లవ వీరులు బ్రిటీష్ ఆయుధాగారం ముట్టడించి ఒక దానిని దోచుకోవటం, ఒక దానిని తగలబెట్టటం ఎంతో సాహసంతో కూడుకున్న విప్లవ కార్యాచరణ చిట్టగాంగ్ తిరగుబాటు ఒక సాహస గాథ. ఇది గొప్ప తిరుగుబాటు. దీని ఫలితాలు స్వాతంత్ర్య ఉద్యమాన్ని ఎంతో ప్రభావితం చేశాయి. నిత్యం సైనిక పహారాలో కట్టుదిట్టమైన రక్షణలో ఉన్న ఒక ఆయుధాగారంపై దాడి. ప్రభుత్వ భవనాలు, టెలిగ్రాఫ్, రైల్వే రాకపోకలు భగ్నం చేసి, టెలిఫోన్ భవనాన్ని తగలబెట్టగలరని గాని పాలకులు భావించలేదు. ఈ తిరుగుబాటు ద్వారా విదేశీ బానిసత్వం తొలగించి స్వతంత్ర విప్లవ ప్రభుత్వం నెలకొల్పాలని విప్లవ నాయకుడు సూర్యసేన్ నేతృత్వాన ఒక పథకం వేశారు. మిలటరీ రక్షణలోని ఆయుధాగారం బద్దలు కొట్టి 500 రైఫిళ్లు, డజన్ల కొద్ది రివాల్వర్లు విప్లవకారులకు అందజేశారు. ఆగ్జిలరీ ఫోర్సు ఆయుధాగారాన్ని వశపరుచుకున్నారు. ఇక్కడ దాడిలో సెంట్రీలు ఇద్దరు, సార్జంట్ మేజరు పారెల్ చనిపోయారు. 303 సైనిక రైఫిళ్లు, లూయిగన్లు, అనేక రివాల్వర్లు దొరికాయి. టెలిఫోన్ బోర్డు నాశనం చేసి తగలబెట్టారు. రైల్వేలైన్స్ విధ్వంసం వల్ల ధూమ్స్ స్టేషన్ వద్ద గూడ్స్ రైలు పడిపోయింది. పోలీసు ఆయుధాగారం వద్ద తాత్కాలిక స్వతంత్ర ప్రభుత్వాన్ని ఏర్పరచినట్లు సూర్యసేన్ ప్రకటించారు.

ఏప్రిల్ 22న వేలాది సైన్యం పట్టణ శివారులోని కొండ ప్రాంతంలో సూర్యసేన్ విప్లవ దళం కోసం జలాలాబాద్‌కు చేరుకున్నారు. అక్కడ మెషిన్ గన్‌లతో సూర్యసేన్ అనుయాయులపై గుళ్ల వర్షం కురిపించారు. 12 మంది స్వాతంత్ర్య యోధులు, 83 మంది సైనికులు మరణించారు. దీనితో గెరిల్లా పోరాటం ప్రారంభించాలనిసూర్యసేన్ నిశ్చయించాడు. దాదాపు నమ్మకమైన అనుచరులు ఉన్న మూడేళ్ల గ్రామాలను కేంద్రంగా చేసుకుని సూర్యసేన్ నాయకత్వంలో గెరిల్లా పోరాటం జరిగింది. బ్రిటీష్ సైనికులపైన, వారి ఉద్యోగుల పైన దాడులు చేస్తూ గ్రామాలలో రక్షణ పొందేవారు. గ్రామాలలో హిందూ,



ముస్లిం స్త్రీలు ఎంతో సాహసంతో విప్లవకారుల ప్రాణాలు కాపాడుతూ వచ్చారు. 1980 న నవంబరులో పోలీసు ఉన్నతాధికారి క్రెయిగ్ కలకత్తా వెళ్లే రైలులో ప్రయాణిస్తుండగా అతనిపై కాల్పులు జరపగా తరుణీముఖర్జీ అనే ఇన్స్‌పెక్టరు చనిపోయాడు. ఈ ఘటనలో పట్టుబడిన రామకృష్ణ విశ్వాస్‌ను విచారించి 1931 లో ఉరి తీశారు. ఆయుధాగారంపై దాడి



మొదటి కేసులో 32 మంది ముద్దాయిల విడుదలకు వేసిన పథకం విఫలమైంది. అసనుల్లాఖాన్ అనే పోలీసు ఆఫీసరు కామవాంఛతో అరాచకం చేస్తుంటే లక్ష మంది ప్రేక్షకుల సమక్షంలో ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో హత్య చేశారు. పదమూడేళ్ల బాలుడిని అరెస్టు చేసి యావజ్జీవ శిక్ష విధించారు.

1932 జూన్‌లో సూర్యసేన్, నిర్మల్‌సేన్, ప్రీతిలత వడ్డీదార్ థాల్‌ఘాట్ అనే గ్రామంలో ఒక యింటిలో ఉండగా సైనికులు చుట్టుముట్టారు. ఘర్షణలో సైనికోద్యోగి చనిపోయాడు. విప్లవ వాదులు నిర్మల్‌సేన్, అపూర్వసేన్ వీర మరణం చెందారు. స్యూసేన్, ప్రీతిలత తప్పించుకుని పారిపోయారు. కుమారి ప్రీతిలత నాయకత్వాన యూరోపియన్ క్లబ్‌పై దాడి జరిగింది. క్లబ్ లోపలి వారు చాలామంది చనిపోయారు. సైన్యం ప్రతిదాడి చేసి వెంటపడగా ప్రీతిలత వారికి దొరకకుండా పొటాషియం సైనేడ్ తీసుకుని మరణించింది. 1932 ఫిబ్రవరి 16న గొయిరాల గ్రామంలో సూర్యసేన్ అరెస్టు అయ్యాడు. సూర్యసేన్ తరువాత తారకేశ్వర దస్తిదార్ విప్లవోద్యమానికి నాయకత్వం వహించాడు. 1931 మే 18న గొహిరా గ్రామంలో జరిగిన దాడిలో మనోరంజన్‌దాస్ చనిపోయాడు . వీరు ఉన్న ఇంటి యజమాని కూడా కాల్పులలో చనిపోవటంతో తారకేశ్వర దస్తిదార్, కల్పనాదత్‌లు సైనికులకు లొంగిపోయారు. ఆయుధాగారంపై మూడవ దాడి కేసు 1933 జూన్‌లో విచారణ ప్రారంభించి ఆగస్టు 14 న తీర్పు వెలువరించారు. సూర్యసేన్, తారకేశ్వర్‌లను 1934 జనవరి 12న చిట్టగాంగ్ జైలులో ఉరి తీశారు. వారి శవాలను 'దిరినౌక్' అనే క్రూయిజర్ నౌకపై ఉంచి బంగాళాఖాతంలో భారత సరిహద్దులకు వందల మైళ్ల దూరంలో పారవేశారు.

చిట్టగాంగ్ వీర యోధురాలు కుమారి కల్పనాదత్ జైలు నుండి విడుదలై కమ్యూనిస్టు పార్టీలో చేరారు. కమ్యూనిస్టు పార్టీ నాయకుడు పి.సి.జోషీని వివాహం చేసుకున్నారు. ఈమె చిట్టగాంగ్ విరులపై ఒక పుస్తకం కూడా రాశారు. కమ్యూనిస్టు పార్టీ కార్యక్రమంలో పాల్గొన్న సూర్యసేన్ త్యాగం అజరామరం. ఇండియన్ రిపబ్లికన్ ఆర్మీ చిటగాంగ్ శాఖకు నాయకత్వం వహించి అనేక దాడులకు ప్రత్యేకంగా నాయకత్వం వహించారు. భారత స్వాతంత్ర్య పోరాట చరిత్రలో చిటగాంగ్ తిరుగుబాటు, సాయుధ గెరిల్లా పోరాటం దానికి నాయకత్వం వహించిన సూర్యసేన్ చరిత్ర ఒక మరపురాని మహోజ్వల ఘట్టంగా సువర్ణాక్షరాలతో లిఖించదగింది.

– చలసాని వెంకటరామారావు

నాకు అందరి మద్దతు: థరూర్

పలక్కడ్: ఏఐసీసీ అధ్యక్ష ఎన్నికల కోసం పోటీ చేస్తున్న తనకు దేశవ్యాప్తంగా పార్టీ కార్యకర్తల మద్దతు ఉందని కాంగ్రెస్ పార్టీ నాయకుడు శశిథరూర్ సోమవారం చెప్పారు. అధ్యక్ష పదవికి రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లోట్ అభ్యర్థిత్వంపై అనిశ్చితి కొనసాగుతున్న వేళ పలక్కడ్ జిల్లాలో రాహుల్‌గాంధీని థరూర్ కలిశారు. రాహుల్‌గాంధీ తన జిల్లాకు వచ్చినందున మర్యాదపూర్వకంగానే తాను కలిశానని థరూర్ చెప్పారు. 'నామినేషన్ దాఖలు సమయంలో నాకు లభించే మద్దతును మీరు చూస్తారు. అత్యధిక రాష్ట్రాల నుంచి కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల మద్దతు పొందగలిగితేనే నేను పోటీ చేస్తాను. కాంగ్రెస్ అధ్యక్ష పదవికి పోటీ చేయాలని దేశంలోని చాలా ప్రాంతాల నుంచి నాకు విజ్ఞప్తి చేస్తున్నారు' అని థరూర్ విలేకరులతో మాట్లాడుతూ చెప్పారు. ఎన్నికల్లో పోటీపై తాను ఆసక్తిగా ఉన్నానని, అయితే సెప్టెంబరు 30 తర్వాత ఓ స్పష్టత వస్తుందని ఆయన తెలిపారు. అభ్యర్థి ఎవరైనా ఎన్నికల్లో పూర్తి విశ్వాసంతో పోరాటం చేయాలని పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో నెహ్రూ-గాంధీ కుటుంబం మద్దతు మీకు ఉందా అని ప్రశ్నించగా సోనియా, రాహుల్, ప్రియాంకతో తాను చర్చించానని, ఎలాంటి సమస్యలు ఉండబోవని ఆ ముగ్గురు స్పష్టంచేశారని తెలిపారు. కేరళ పార్టీ నాయకులు, కార్యకర్తల మద్దతు తనకు ఉందన్నారు. వారం క్రితం సోనియాతో థరూర్ సమావేశమయ్యారు. ఎన్నికల్లో పోటీపై ఆమెకు వివరించారు. ఈ ఎన్నికల్లో తాను తటస్థంగా ఉంటానని సోనియా హామీ ఇచ్చినట్లు ఆయన చెప్పుకున్నారు.

కేజ్రీవాల్ నివాసంలో పారిశుధ్య కార్మికుడికి విందు

న్యూఢిల్లీ: గుజరాత్‌కు చెందిన పారిశుధ్య కార్మికుడి కుటుంబాన్ని ఢిల్లీలోని తన నివాసానికి ఆహ్వానించిన సీఎం కేజ్రీవాల్ సోమవారం ఆ కుటుంబంతో కలసి భోజనం చేసినట్టు అధికారులు తెలిపారు. గుజరాత్‌కు చెందిన హర్ష సోలంకి అనే వెనుకబడిన వర్గాలకు చెందిన పారిశుధ్య కార్మికుడు తన కుటుంబంతో సహా ఢిల్లీ వచ్చారని, ఇక్కడి ప్రభుత్వ పాఠశాలలు, ఆసుపత్రులను సందర్శించినట్టు పేర్కొన్నారు. అనంతరం సీఎం నివాసానికి వెళ్లి వారి కుటుంబంతో కలసి భోజనం చేసినట్టు పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోలంకి రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేద్కర్ చిత్రాన్ని సీఎం కేజ్రీవాల్‌కు అందించినట్టు తెలిపారు. ఇదిలా ఉండగా ఆదివారం గుజరాత్ పర్యటనలో భాగంగా అహ్మదాబాద్‌లో పని చేస్తున్న వెనుకబడిన వర్గాలకు చెందిన పారిశుధ్య కార్మికులతో సమావేశమయ్యారు. ఈ తరుణంలో సోలంకి ఆహ్వానం మేరకు కార్మికుడి నివాసానికి చేరుకుని అక్కడే భోజనం చేశారు.

క్రమశిక్షణారాహిత్యం

గెహ్లోట్ వర్గ ఎమ్మెల్యేలపై మాకెన్ ఆగ్రహం

జైపూర్: రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గెహ్లోట్ వర్గానికి చెందిన శాసనసభ్యులపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి అజయ్ మాకెన్ సోమవారం మండిపడ్డారు. పార్టీ తీర్మానాన్ని అనుసరించడానికి బదులు షరతులు పెట్టడాన్ని తీవ్రంగా గర్హించారు. ఇది ముమ్మాటికీ పార్టీతో ఘర్షణకు దిగడమేనని మాకెన్ స్పష్టంచేశారు. గెహ్లోట్ అనుకూల ఎమ్మెల్యేలు సమాంతర సమావేశం నిర్వహించాలన్న నిర్ణయం క్రమశిక్షణా రాహిత్యమేనని ఆయన వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రిగా సచిన్ పైలట్‌ను నియమించే అవకాశాలు ఉన్నాయన్న భావనతో గెహ్లోట్ వర్గం ఎమ్మెల్యేలు ఆదివారం అర్ధరాత్రి రాజీనామా లేఖలను స్పీకర్‌కు అందజేశారు. పార్టీ కేంద్ర పరిశీలకులు మాకెన్, మల్లికార్జున ఖర్గె నిర్వహించిన శాసనసభాపక్ష సమావేశానికి దూరంగా ఉన్నారు. '75 ఏళ్ల కాంగ్రెస్ పార్టీ చరిత్రలో షరతులతో కూడిన తీర్మానాన్ని ఎన్నడూ చూడలేదు. తీర్మానం అనేది కేవలం ఏకవాక్యంతో కూడినది మాత్రమే. కాంగ్రెస్ అధ్యక్షురాలికి అన్ని విషయాలు చెబుతాం. ఆ తర్వాత

నిర్ణయం తీసుకుంటాం' అని ఢిల్లీ వెళ్లడానికి ముందు మాకెన్ విలేకరులతో చెప్పారు. 'తీర్మానం ఘర్షణాత్మక వైఖరితో ఉండరాదు. ఎవరైతే ఎన్నికల్లో పోటీ చేస్తారో...వారు రేపు పార్టీ అధ్యక్షులు అవుతారు. తీర్మానంపై వారు నిర్ణయం తీసుకుంటారు. ఇది ప్రయోజనాలతో కూడిన ఘర్షణ. అందువల్ల ఇది సరైంది కాదు' అని గెహ్లోట్ పేరు ప్రస్తావించకుండా చెప్పారు. గెహ్లోట్ వర్గం ఎమ్మెల్యేల సందేశాన్ని మాకెన్, ఖర్గెలకు ఆదివారం రాత్రి రాష్ట్ర మంత్రులు శాంతి దరివాల్, మహేశ్ జోషి, ప్రతాప్‌సింగ్ కచారియవాస్ తెలిపారు. దీనిపై మాకెన్ స్పందిస్తూ మంత్రుల బృందం మూడు షరతులను తమ ముందుంచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడి ఎన్నిక తర్వాతే ముఖ్యమంత్రి ఎంపికపై నిర్ణయం తీసుకోవాలని, 2020 రాజకీయ సంక్షోభ సమయంలో ప్రభుత్వానికి మద్దతుగా నిలిచిన ఎమ్మెల్యేలలో ఒకరిని ముఖ్యమంత్రిని చేయాలని, సచిన్ పైలట్ వర్గాన్ని కాదని, శాసనసభ్యులతో ముఖాముఖి చర్చలు కాకుండా బృందాలుగా సమావేశాలు నిర్వహించాలన్న షరతులను పార్టీ ముందుం చినట్లు మాకెన్ వివరించారు. 'అందరి అభిప్రాయాలు తీసుకుంటాం. ఇంకా నిర్ణయం తీసు కోలేదు. మీరు ఏమి చెప్పాలనుకుంటే... ఆ విషయాన్ని ఢిల్లీకి తెలియజేయండి. ఎమ్మెల్యేలతో ముఖాముఖి మాట్లాడమని మాకు ఆదేశాలు ఉన్నాయి. అప్పుడే ఎమ్మెల్యేలు నిర్మొహ మాటంగా తమ అభిప్రాయాలు చెబుతారు' అని ఆయన తెలిపారు.

రాహుల్ పాదయాత్రకు యువత మద్దతు

పలక్కాడ్: రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర పలక్కాడ్ జిల్లాలోకి ప్రవేశించింది. వందలాదిమంది పార్టీ కార్యకర్తలతో కలిసి రాహుల్‌గాంధీ తన పాదయాత్రను జిల్లాలోని షోర్నూర్ నుంచి సోమవారం ప్రారంభించారు. రాహుల్ యాత్ర 19వ రోజుకు చేరింది. ఉత్సాహం, ఉద్వేగభరితం, ఆశాభావంతో రాహుల్ పాదయాత్ర పలక్కాడ్ జిల్లాలోకి ప్రవేశించినట్లు కాంగ్రెస్ పార్టీ ట్వీట్ చేసింది. ఉదయం పాదయాత్రలో రాహుల్ వెంట కాంగ్రెస్ సీనియర్ నేత కె.మురళీధరన్, అసెంబ్లీలో ప్రతిపక్ష నేత వీడీ సతీశన్ ఉన్నారు. రాహుల్‌కు స్వాగతం పలుకుతూ రోడ్డుకు రెండువైపులా పార్టీ కార్యకర్తలు బారులు తీరి నిలుచున్నారు. రాహుల్‌గాంధీ ఫొటోను కొంతమంది అమ్మాయిలు ఆయనకే బహుకరించారు. రాహుల్‌గాంధీ పాదయాత్రకు అపూర్వ స్పందన లభిస్తోందని, ప్రత్యేకించి యువతీ యువకులు పెద్దసంఖ్యలో రాహుల్ అడుగులో అడుగు వేస్తూ నడుస్తున్నారని పార్టీ ట్వీట్ చేసింది. తమ లక్ష్యం సాధించే దిశగా తాము ముందుకుసాగుతున్నామని తెలిపింది. పట్టాంబికి వెళ్లే దారిలో గల మహాత్మాగాంధీ విగ్రహానికి రాహుల్ పూలమాలతో శ్రద్ధాంజలి ఘటించారు. కొప్పాంలో యాత్రను ముగించారు.

వారికి ఓటమి తప్పదు

- పార్టీని అట్టడుగు స్థాయిలో బలోపేతం చేస్తాం - కొత్త మొఖాలను తీసుకువస్తాం...
- జేకేపీసీసీ అధ్యక్షుడు వికార్ రసూల్ వనీ

జమ్ము : పార్టీని వీడిన వారికి ఓటమి తప్పదని జమ్ముకశ్మీర్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు వికార్ రసూల్ వనీ అన్నారు. మాజీ ముఖ్యమంత్రి గులాం నబీ ఆజాద్ 'డెమొక్రటిక్ ఆజాద్ పార్టీ'ని ప్రారంభించిన కొన్ని గంటల తర్వాత సోమవారం ఆయన మాట్లాడుతూ అది తమ పార్టీ వీడిన వారి వర్గానికి చెందినదని అన్నారు. మాజీ ఉప ముఖ్యమంత్రి తారా చంద్‌తో సహా కాంగ్రెస్‌కు చెందిన రెండు డజన్ల మంది మాజీ మంత్రులు, శాసనసభ్యులు ఆజాద్ పార్టీలో చేరినప్పటికీ, 90 నియోజకవర్గాల్లో పార్టీని అట్టడుగు స్థాయిలో బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ ప్రచారాన్ని ప్రారంభించిందని, యువ ముఖాలను తీసుకువస్తుందని వానీ అన్నారు. రియాసి జిల్లాలోని కత్రాలో జరిగిన పార్టీ సమావేశం సందర్భంగా, జేకేపీసీసీ అధ్యక్షుడు, డోగ్రా స్వాభిమాన్ సంఘటన్ పార్టీ (డీఎస్‌ఎస్‌పీ) మాజీ నాయకుడు బుపేందర్ సింగ్ జమ్వాల్, అతని మద్దతుదారులను పార్టీలోకి ఆహ్వానించారు. ఆజాద్, అతని సహచరుల పేర్లను ప్రస్తావించకుండా వానీ మాట్లాడుతూ 'పార్టీని వీడిన వారు ఒక పార్టీని ప్రకటించారు. వారు బహిర్గతం అవుతున్నారని నేను వారికి చెప్పాలనుకుంటున్నాను. ప్రధాని నరేంద్ర మోదీ కోసం (పార్లమెంట్‌లో) ఏడ్చారు. ఎందుకంటే మీరు కాంగ్రెస్‌తో కాకుండా ఆయనకు దగ్గరగా ఉన్నారు. మీకు అవార్డుల వర్షం కురిపించారు. కాంగ్రెస్ పై మీరు చేస్తున్న కుట్రల గురించి నాకు బాగా తెలుసు' అని ఆగస్టులో ఆజాద్ పార్టీ నుంచి వైదొలగే ముందు ఆయనకు అత్యంత సన్నిహితుడిగా భావించిన వానీ

అన్నారు. కాంగ్రెస్ ఒక ఉద్యమం అని, లౌకికవాదాన్ని నమ్మే పార్టీ అని వానీ అన్నారు. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ వంటి నాయకులు తమ ప్రాణాలను త్యాగం చేసిన పార్టీ ఇదేనని, దేశాన్ని ఏకం చేసేందుకు రాహుల్ గాంధీ 'భారత్ జోడో యాత్ర' చేస్తున్నారని తెలిపారు. పార్టీని ఆదరించడం కొనసాగించాలని ప్రజలను కోరుతూ, 'మేము యువ ముఖాలను పరిచయం చేయబోతున్నాం. మీరు వారిని ఆదరించి (ఎన్నికలలో) గెలిపించాలి. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న నిరుద్యోగం, జీఎస్‌టీ, నోట్ల రద్దుతో దేశంలోని ప్రజలను పొట్టనబెట్టుకున్న ఆజాద్ పార్టీకి, బీజేపీకి మీరు మద్దతు ఇవ్వరు. తొలి నవరాత్రుల సందర్భంగా కత్రా నుంచి ప్రజలకు చేరువయ్యేందుకు పార్టీ కార్యాచరణ ప్రారంభించిందని వానీ తెలిపారు. 'మేము మొత్తం 90 అసెంబ్లీ నియోజకవర్గాలలో ర్యాలీలు నిర్వహిస్తాం. ప్రత్యర్థులను ఓడించేంత బలంగా మేము ఎదుగుతాం' అని అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వంపై ఆయన విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ నిరంతర పోరాటం వల్ల భారతదేశానికి బ్రిటీషు వారి నుంచి స్వాతంత్ర్యం లభించినప్పుడు, దేశం వెలుపల నుండి సూది కూడా దిగుమతి చేయబడిందని అన్నారు. 'దేశాన్ని అభివృద్ధి చేసి, అణుశక్తిగా, ఆర్థిక కేంద్రంగా, బలమైన సైనిక శక్తిగా మార్చింది కాంగ్రెస్సే తప్ప మోదీ కాదు. కేంద్రంలో ఈ ప్రభుత్వం (బీజేపీ) అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఎక్కడ చూసినా విధ్వంసమే కనిపిస్తోంది' అని తెలిపారు. గత ఎనిమిదేళ్లలో ప్రస్తుత పాలనలో వారి అనుభవాలను పరిగణనలోకి తీసుకొని ఓటు వేయాలని వానీ ప్రజలను కోరారు.

కేంద్ర మంత్రి నారాయణ్ రాణేకు

సుప్రీంకోర్టులో చుక్కెదురు

న్యూఢిల్లీ : ముంబైలోని జుహు ప్రాంతంలో అనధికారికంగా నిబంధనలను ఉల్లంఘించి బంగ్లాను నిర్మించుకున్న కేంద్ర చిన్న, మధ్యతరగతి పరిశ్రమల శాఖ మంత్రి నారాయణ్ రాణేకు సుప్రీం కోర్టులో చుక్కెదురైంది. సదరు బంగ్లాను కూల్చివేయాలని ముంబై హైకోర్టు బృహత్ ముంబై మున్సిపల్ కార్పొరేషన్ (బీఎంసీ) అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ రాణే కుటుంబానికి చెందిన కాల్కా రియల్ ఎస్టేట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఈ పిటిషన్‌పై సోమవారం విచారణ జరిపిన సుప్రీం న్యాయమూర్తులు జస్టిస్ ఎస్‌కే కౌల్, జస్టిస్ ఏఎస్ ఓకా ల ధర్మాసనం ఆ పిటిషన్‌ను విచారణకు స్వీకరించేందుకు నిరాకరించింది. ఆ పిటిషన్‌ను కొట్టివేస్తూ నిర్ణయం తీసుకుంది. రాణే నిర్మించుకున్న బంగ్లాలో ఫ్లోర్ స్పేస్ ఇండెక్స్, కోస్టల్ రెగ్యులేషన్ జోన్ నియమాలను పాటించలేదని పేర్కొంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహించలేమని సెప్టెంబర్ 20న ముంబై హైకోర్టు స్పష్టం చేసింది. ఆ బంగ్లానూ కూల్చివేయాలని బీఎంసీని ఆదేశించిన విషయం విధితమే.

మత విద్వేషాలు వ్యాప్తి చేస్తున్న

యూట్యూబ్ ఛానళ్ల వీడియోలు బ్లాక్

న్యూఢిల్లీ: మత విద్వేషాలను వ్యాప్తి చేసే ఉద్దేశంతో నకిలీ వార్తలు, మార్ఫింగ్ చేసిన విషయాలతో కూడిన 10 యూట్యూబ్ ఛానళ్ల నుంచి 45 వీడియోలను నిరోధించాలని ప్రభుత్వం ఆదేశించిందని సమాచార, ప్రసార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ సోమవారం తెలిపారు. నిరోధించిన వీడియోలకు 1.30 కోట్లకు పైగా వీక్షకులు ఉన్నారు. 'ఈ ఛానళ్లలో సమాజంలో భయం, అపోహను వ్యాప్తి చేసే అంశాలు ఉన్నాయి' అని ఠాకూర్ అన్నారు. 'అగ్నిపథ్ పథకం, భారత సాయుధ దళాలు, భారత జాతీయ భద్రతా యంత్రాంగం, కశ్మీర్‌కు సంబంధించిన అంశాల పై తప్పుడు సమాచారాన్ని వ్యాప్తి చేయడానికి మంత్రిత్వ శాఖ నిరోధించిన కొన్ని వీడియోలు ఉపయోగించబడుతున్నాయి' అని ప్రభుత్వం ఒక ప్రకటనలో పేర్కొంది. జాతీయ భద్రత, విదేశాలతో భారతదేశం స్నేహ పూర్వక సంబంధాల దృక్కోణం నుంచి విషయం తప్పు, సున్నితమైనదిగా గుర్తించబడినదని తెలిపింది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (మధ్యవర్తి మార్గదర్శకాలు, డిజిటల్ మీడియా ఎథిక్స్ కోడ్) రూల్స్ 2021లోని నిబంధనల ప్రకారం వీడియోలను నిరోధించాలనే ఉత్తర్వు సెప్టెంబర్ 23న జారీ అయినట్లు ప్రకటన వివరించింది. అంతకుముందు, మత విద్వేషాలు సృష్టించడానికి ప్రయత్నిస్తున్న 102 యూట్యూబ్ ఛానళ్లు, ఫేస్‌బుక్ ఖాతాలను ప్రభుత్వం నిరోధించినట్లు మంత్రి ఠాకూర్ తెలిపారు.

'చెన్నకేశవరెడ్డి' ప్రభంజనం

హైదరాబాద్: ఈమధ్య ప్రతీ శుక్రవారం మూడు నాలుగు సినిమాలు విడుదల అవుతున్నాయి. కానీ కలెక్షన్స్ మాత్రం అంతంత మాత్రం గానే ఉంటున్నాయి. క్రితం శుక్రవారం సెప్టెంబర్ 23న ఐదు సినిమాలు విడుదలయ్యాయి. నాగశౌర్య నటించిన 'కృష్ణ వృంద విహారి', శ్రీవిష్ణు నటించిన 'అల్లూరి', సురేష్ ప్రొడక్షన్స్ నుండి వచ్చిన 'దొంగలున్నారు జాగ్రత్త' విడుదలవగా, ఇంకా చివరగా బాలకృష్ణ నటించిన 'చెన్నకేశవ రెడ్డి' మళ్లీ విడుదల చేశారు. అలాగే ఇంగ్లీష్ సినిమా 'అవతార్' కూడా మళ్లీ విడుదల అయింది. ఆసక్తికరమైన అంశం ఏంటంటే, మళ్లీ విడుదల అయిన పాత సినిమాలు 'చెన్నకేశవ రెడ్డి', 'అవతార్' కలెక్షన్స్ బాగున్నాయి, కానీ మిగతా సినిమాలు అంతగా ప్రభావం చూపలేకపోయాయి. 'అల్లూరి' సినిమా విడుదల అవడమే ఆర్థిక లావాదేవీలు కారణంగా చాలా లేట్‌గా విడుదల చేశారు. శ్రీవిష్ణు మొదటిసారిగా ఒక పోలీస్ ఆఫీసర్ పాత్ర పోషించాడు, కానీ జనాలకి ఇది సరిగ్గా ఎక్కలేదు. అలాగే నాగశౌర్య నటించిన 'కృష్ణ వృంద విహారి' ప్రభావం కూడా ఏమి లేదు. ఇది ఇంతకు ముందు వచ్చిన నాని సినిమా 'అంటే సుందరానికి' కాపీగా వచ్చింది. అందువల్ల దీని ప్రభావం ఏమి కనపడలేదు. 'దొంగలున్నారు జాగ్రత్త' సినిమా కేవలం ఓటీటీ కోసమని ముందుగా ఒకరోజు అయినా సినిమా థియేటర్‌లో విడుదల చేయాలన్న నిబంధన ఉన్న కారణంగా విడుదల చేశారనిపించింది. ఆ సినిమాని ఎవరూ పట్టించుకోలేదు. రెండో రోజు ఉందో లేదో కూడా తెలియదు.

ఫొటోలు, వీడియోలు షేర్ చేస్తే కఠిన చర్యలు

హైదరాబాద్: దర్శకుడు సిరుత్తై శివ దర్శకత్వంలో తమిళ నటుడు సూర్య ప్రధాన పాత్రలో ఓ భారీ బడ్జెట్ చిత్రం తెరకెక్కు తున్న విషయం తెలిసిందే. 'సూర్య-42' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్, యూవీ క్రియేషన్స్ సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. అయితే.. సినిమా సెట్స్‌కి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి. దీంతో వాటిని చట్టవిరుద్ధంగా అప్‌లోడ్ చేసి, షేర్ చేస్తున్న వారిని అలా చేయవద్దని నిర్మాతలు కోరారు. ఇలాగే చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. స్టూడియో గ్రీన్, యువీ క్రియేషన్స్ ప్రొడక్షన్ హౌస్‌లు సోషల్ మీడియాలో షేర్ చేసి ఓ ప్రకటనలో.. 'అందరికీ వినయపూర్వకమైన అభ్యర్థన. మా రాబోయే ప్రొడక్షన్ సూర్య-42 షూటింగ్ సెట్‌ల నుంచి కొంతమంది వీడియోలు, ఫొటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడం మేం గమనించాం. ఈ సినిమాలో వచ్చే ప్రతి సీన్ కోసం రక్తాన్ని చెమటగా మార్చి మా బృందం కష్టపడుతోంది. మేం ఈ చిత్రాన్ని ప్రతి ఒక్కరికీ గొప్ప థియేట్రికల్ అనుభవంగా అందించాలనుకుంటున్నాం. మీరు షేర్ చేసిన వీడియోలు, చిత్రాలను నెట్‌లో నుంచి తీసివేస్తే.. మాకు పెద్ద సహాయం చేసినవారు అవుతారు. భవిష్యత్తులో కూడా ఇలాంటివి చేయొద్దని అభ్యర్థిస్తున్నాం. ఈ విధాన్ని కొనసాగిస్తూ ఇలాగే వీడియోలు, ఫొటోలు షేర్ చేసేవారిపై చట్టపరంగా కాపీరైట్స్ కింద లీగల్ యాక్షన్స్ తీసుకుంటామని హెచ్చరిస్తున్నాం' అని రాసుకొచ్చారు.

ఓటీటీలో అక్టోబర్ 5నుంచి కార్తికేయ-2



హైదరాబాద్: టాలీవుడ్ హీరో నిఖిల్ సిద్ధార్థ్ గతంలో నటించిన చిత్రం 'కార్తికేయ'. తాజాగా ఈ సినిమాకు సీక్వెల్ 'కార్తికేయ-2' టైటిల్‌తో రూపొందింది. చందు మొండేటి దర్శకత్వం వహించాడు. అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటించింది. అనుపమ్ ఖేర్, శ్రీనివాస్ రెడ్డి, వైవా హర్ష కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం పాన్ ఇండియాగా తెరకెక్కింది. ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 13న విడుదలైంది. బాక్సాఫీస్ వద్ద సంచలన విజయం సాధించింది. అండర్ డాగ్‌గా బరిలోకి దిగిన ఈ చిత్రం అంచనాలను మించి రాణించింది. భారీ వసూళ్లను రాబట్టింది. డిస్ట్రిబ్యూటర్స్‌కు కూడా లాభాలను పంచింది. ఈ చిత్రాన్ని థియేటర్‌లో మిస్ అయిన వారంతా ఓటీటీలోకి ఎప్పుడెప్పుడు వస్తుందా అని ఎదురు చూస్తున్నారు. వారి ఎదురు చూపులకు తెర దించుతూ డిజిటల్ ప్లాట్‌ఫామ్ స్ట్రీమింగ్ డేట్‌ను ప్రకటించింది. కార్తికేయ-2 సినిమా స్ట్రీమింగ్ రైట్స్‌ను 'జీ-5' సొంతం చేసుకుంది. ఈ చిత్రం అక్టోబర్ 5 నుంచి ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లో స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళం, హిందీ భాషల్లో ప్రేక్షకులకు అందుబాటులో ఉండనుందని డిజిటల్ ప్లాట్‌ఫామ్ ప్రకటించింది.

విజయం సరే... లోపాల మాటేంటి?

- రేపటి నుంచే దక్షిణాఫ్రికాతో మరో టీ20 సిరీస్
- 'డెత్' ఓవర్లపై దృష్టి అత్యవసరం
- ఫీల్డింగ్‌లో లోపాలు సరిదిద్దాలి

ఆసియా కప్‌లో టీమిండియా ఘోర ప్రదర్శనకు సగటు క్రీడాభిమాని పెద్దగానే కలవరం చెందాడు. ఎందుకంటే... సమీపంలోనే టీ20 ప్రపంచకప్ వస్తుండగా, టీమిండియా చెత్త ప్రదర్శన ఆందోళన కలిగించింది. అయితే దీన్ని సరిదిద్దేందుకు ఆస్ట్రేలియాతో ఆడిన టీ20 సిరీస్ టీంలో జోష్ తెచ్చింది. వాస్తవంగా చెప్పాలంటే 'చావు తప్పి కన్ను లొట్టబోయింది' అన్నట్టు... అవును... ఎందుకంటే... బౌలింగ్ విభాగం మునుపెన్నడూ ఈ విధంగా లేదు. 'డెత్' ఓవర్స్ దాదాపు పేరుకుతగ్గట్టుగానే పడ్డాయి. కనీసం సఫారీ సిరీస్‌సైనా అన్ని విభాగాల్లో రాణిస్తేనే టీ20 ప్రపంచకప్‌పై ఆశలు పెట్టుకోవచ్చు... లేదంటే...

ముంబై: ఆసీస్‌తో టీ20 సిరీస్ విజయం.. టీ20 ప్రపంచకప్‌లో ఆత్మస్థైర్యంతో బరిలోకి దిగేందుకు టీమిండియాకు చక్కగా ఉపయోగ పడుతుంది. అలాగే బుధవారం నుంచి ప్రారంభ మయ్యే దక్షిణాఫ్రికా సిరీస్‌నూ గెలిచి ఆస్ట్రేలియాకు పయనం కావాలని భారత అభిమానులు ఆశిస్తున్నారు. అయితే ఆ జట్టును తక్కువ అంచనా వేయడానికి లేదు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో అత్యుత్తమంగా రాణించాల్సిందే.

ఆసీస్‌తో సిరీస్ సందర్భంగా బౌలింగ్ కాస్త గాడి తప్పినట్లు కనిపిస్తోంది. ఫీల్డింగ్‌లోనూ మెరుపులు తక్కువే..

ఆశాజనం ఏంటంటే..

వెల్డన్ అక్షర్: ప్రతి మ్యాచ్‌లోనూ ఆసీస్ భారీగా పరుగులు చేసినా.. అక్షర్ పటేల్‌ను ఆడటంలో మాత్రం పర్యాటక జట్టు బ్యాటర్లు విఫలమయ్యారు. హైదరాబాద్ మ్యాచ్‌లోనూ కీలకమైన వేడ్ వికెట్‌తోపాటు మరో రెండు వికెట్లు తీసి భారత్‌కు బ్రేక్ ఇచ్చాడు. అంతకుముందు ఎనిమిది ఓవర్లకే కుదించిన రెండో టీ20లోనూ తన కోటా (2 ఓవర్లు)లో కేవలం 13 పరుగులే ఇచ్చి రెండు వికెట్లు తీయడం విశేషం. మిగతా బౌలర్లు ధారాళంగా పరుగులు సమర్పించుకొన్న ఆ మ్యాచ్‌లో అక్షర్ రాణించడంతో ఆసీస్ దూకుడుకు అడ్డుకట్ట పడింది. మూడు టీ20ల సిరీస్‌లో మొత్తం 8 వికెట్లు తీసి ప్లేయర్ ఆఫ్ ది సిరీస్‌గా ఎంపిక కావడం విశేషం. బ్యాటింగ్‌లో వచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటే టీ20 ప్రపంచపకప్‌లో రవీంద్ర జడేజా లేని లోటును తీర్చగల ఆల్‌రౌండ్ పాత్ర పోషించే అవకాశం ఉంది.

రన్ మెషీన్‌లు: ఆసీస్‌తో సిరీస్‌లో భారత్‌కు పెద్ద సానుకూలాంశం బ్యాటింగ్ విభాగం.. మూడు టీ20ల్లోనూ బ్యాటర్లు సమయోచితంగా రాణించారు. ఒకరిద్దరు విఫలమైనా ఆ ప్రభావం జట్టుపై పడకుండా చూశారు. ఒక మ్యాచ్‌లో కేఎల్ రాహుల్ ఆడితే.. మరో మ్యాచ్‌లో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లి, సూర్యకుమార్ ఇలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతలను నిర్వర్తించారు. కీలకమైన హైదరాబాద్ మ్యాచ్‌లోనూ స్వల్ప వ్యవధిలో ఓపెనర్లు ఔటైనా.. విరాట్, సూర్య, హార్దిక్ సూపర్ ఇన్నింగ్స్‌లతో జట్టుకు విజయం చేకూర్చి పెట్టారు. అయితే వచ్చే మెగా టోర్నీలో ఓపెనింగ్ చాలా కీలకమవుతుంది. అందుకే రోహిత్-రాహుల్ జోడీ మంచి ఆరంభాలను ఇవ్వాల్సి ఉంటుంది. కనీసం పవర్‌ప్లే వరకు వికెట్ పడకుండా ఆడితే.. తర్వాత బ్యాటింగ్‌కు వచ్చే బ్యాటర్లు దూకుడు ప్రదర్శించే అవకాశం ఉంటుంది. ఇక ఆఖర్లో 'ఫినిషింగ్' టచ్ కూడా బాగానే ఇచ్చారు. సిరీస్ నెగ్గిన తర్వాత టైటిల్‌ను హార్డ్ హిట్టర్ దినేశ్ కార్తిక్ చేతికి కెప్టెన్ రోహిత్ అందించాడు. రెండో టీ20లో చివరి ఓవర్లో 9 పరుగులు అవసరమైన క్రమంలో తొలి రెండు బంతుల్లోనే సిక్స్, ఫోర్ కొట్టేసి కార్తిక్ భారత్‌ను సిరీస్ రేసులో నిలిపాడు. అంతేకాకుండా ప్రస్తుత జట్టులో సీనియర్ ఆటగాడు కూడా డీకేనే కావడం విశేషం.

పారని రోహిత్ వ్యూహాలు

రోహిత్ శర్మ ఇప్పటి వరకు కెప్టెన్‌గా 33 టీ20ల్లో భారత్‌కు విజయాలను అందించాడు. ఇవన్నీ ఎక్కువగా ద్వైపాక్షిక సిరీస్‌లు కావడం గమనార్హం. పూర్తిస్థాయి జట్టు పగ్గాలు చేపట్టిన తర్వాత బరిలోకి దిగిన ఏకైక టోర్నీ ఆసియా కప్. అయితే అక్కడ రోహిత్ వ్యూహాలు పారలేదు. మినీ టోర్నీ తర్వాత ఆసీస్‌తో సిరీస్‌లోనూ కొన్ని నిర్ణయాలు సరిగా లేవని క్రికెట్ విశ్లేషకుల అంచనా. అందులో డెత్ ఓవర్లలో వరుసగా విఫలమవుతున్నా భువనేశ్వర్‌కే బంతిని ఇవ్వడం ప్రధానమైంది. భువీతో తొలి స్పెల్‌లోనే పూర్తి ఓవర్ల కోటాను వేయించాలని టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ సూచించాడు. తొలి పది ఓవర్లలో కొత్త బంతితో భువనేశ్వర్ అద్భుతంగా బంతులు వేస్తాడు. ఇప్పటికే అది నిరూపితమైంది. అందుకే దక్షిణాఫ్రికాతో సిరీస్‌లోనూ ఇలానే డెత్ ఓవర్లలో ఒక్క ఓవర్‌ను మించి భువీకి ఇవ్వకూడదని.. భారీగా పరుగులు సమర్పించుకుంటే ఆ ప్రభావం మెగా టోర్నీలో సీనియర్ బౌలర్ ప్రదర్శనపైనా పడుతుందని ఇర్ఫాన్ పేర్కొన్నాడు. .



అప్పటి తుది జట్టు కోసం..

దక్షిణాఫ్రికా జరిగే సిరీస్‌ను టీ20 ప్రపంచకప్ సన్నద్ధతకు వినియోగించుకోవాలి. బ్యాటింగ్ ఆర్డర్‌పై ఇప్పటికే ఓ స్పష్టతకు వచ్చిన టీమిండియా.. పొట్టి టోర్నీలో తుది జట్టుపైనా క్లారిటీగా ఉండాలి. రిషభ్ పంత్-దినేశ్ కార్తిక్ ద్వయం .. అశ్విన్-చాహల్-అక్షర్ పటేల్ త్రయంలో ఎవరు తుది జట్టులో ఉండాలి.. ఎవరిని పక్కన పెట్టాలనే అంశంపై తీవ్ర కసరత్తు చేయాలి. టీ20 ప్రపంచకప్ తుది జట్టులోకి తీసుకొనే వారికి దక్షిణాఫ్రికాతో జరిగే సిరీస్‌లోనూ మైదానంలోకి దిగేందుకు అవకాశం ఇవ్వాలి. అప్పుడే మంచి ప్రదర్శన ఇచ్చి ఆత్మవిశ్వాసం ప్రోది చేసుకొనే అవకాశం కల్పించినట్లు అవుతుంది. ఈ విషయంపై టీమిండియా సారథి రోహిత్ శర్మ, ప్రధాన కోచ్ రాహుల్ ద్రవిడ్ దృష్టిసారించాలి. గత టీ20 ప్రపంచకప్‌లో గ్రూప్ స్టేజ్‌కే పరిమితమైన భారత్ నుంచి ఈసారి అలాంటి ఫలితం రాకుండా ఉండాలంటే.. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ మీదనే కాకుండా తుది జట్టు ఎంపికపైనా తీవ్రంగా కసరత్తు చేయాలి.

లోపాలేంటంటే...

'డెత్' ఓవర్లు: బుమ్రా, హర్షల్ వచ్చారు.. డెత్ సమస్య తీరిపోతుందిలే అని భావించిన సగటు క్రికెట్ అభిమానికి నిరాశే ఎదురైంది. కీలకమైన ఉప్పల్ పోరులోనూ భారత బౌలర్లు భారీగా పరుగులు ఇచ్చేశారు. మరీ ముఖ్యంగా సీనియర్ బౌలర్ భువనేశ్వర్ కుమార్.. తానేసిన 18వ ఓవర్‌లో ఏకంగా 21 పరుగులు సమర్పించాడు. అంతకుముందు వరకు ఆసీస్ స్కోరు 150 దాటేలా కనిపించలేదు. అదే ఊపులో 19వ ఓవర్ వేసిన బుమ్రాకూ ఆసీస్ బ్యాటర్లు చుక్కలు చూపించారు. ఈ కారణంగానే ఆసీస్ స్కోరు 180 దాటింది. అందుకే కెప్టెన్ రోహిత్ శర్మ కూడా ఇదే విషయంపై ఆందోళన వ్యక్తం చేశాడు. అయితే టీమిండియాకు కలిసొస్తున్న ఏకైక ఓవర్.. ఇన్నింగ్స్ చివరి ఓవర్ (20). ఎందుకంటే గత ఆసియా కప్‌లోనూ ఏడు పరుగులను కాపాడేందుకు ప్రయత్నించి మ్యాచ్‌లను చివరి బంతి వరకూ తీసుకెళ్లారు. తాజాగా ఆసీస్‌తో మూడో టీ20లోనూ హర్షల్ కేవలం ఏడు పరుగులే ఇవ్వడం గమనార్హం. అందుకే రాబోయే దక్షిణాఫ్రికా సిరీస్‌లోనైనా 'డెత్' ఓవర్లపై దృష్టిపెట్టాలి.

'ఫీల్డింగ్'పై పట్టు: బ్యాటింగ్, బౌలింగ్‌తోపాటు ఫీల్డింగ్ చాలా కీలకం. భారీ స్కోరు సాధించినా.. భీకరంగా వికెట్లు తీసినా.. ఫీల్డింగ్ చెత్తగా ఉంటే ఫలితంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంటుంది. తొలి టీ20లో 208 పరుగుల భారీ స్కోరు సాధించినా.. టీమిండియా ఓడిపోవడానికి ప్రధాన కారణం ఫీల్డింగ్ వైఫల్యం. కీలకమైన సమయంలో ధాటిగా ఆడిన కామెరూన్ గ్రీన్, స్టీవ్ స్మిత్, మ్యాథ్యూ వేడ్ క్యాచ్‌లను భారత ఫీల్డర్లు నేలపాలు చేశారు. దీంతో బ్యాటర్ల కష్టం వృథా అయిపోయింది. దీంతో మాజీ ప్రధాన కోచ్ రవిశాస్త్రి.. 'ఇదేనా ఫీల్డింగ్' అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. ఉప్పల్ మ్యాచ్‌లో ఈ ఫీల్డింగే భారత్‌ను కాపాడింది. హర్షల్‌పటేల్ వేసిన అద్భుతమైన త్రో.. కీలకమైన మ్యాక్స్‌వెల్ వికెట్‌ను అందించింది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.